23/28

అనన్య ప్రచారంగల ఏకైక తెలుగు మహిళల మాస పత్రిక

మహిళ

తెలుగు పత్రికా రంగంలో తొలిసారిగా మహిళ నిర్వహిస్తున్న

అందాల పోటీ

జనవరి **1977** సంచిక నుండి ప్రారంభం

వివరాలకు "మహిళ" చూడండి

*

మీ అభిమాన రమణీయ రచయిత్రి

యద్దనపూడి సులోచనారాణి

అందిస్తున్న మహత్తర బృహత్తర కాదంబరి

సంసారరథం

సీరియల్గా జనవరి 1977 సంచిక నుండి ప్రారంభం

విడిప్రతి రూ 2/-

సాలు చందా రూ 24/-

మహిళ
తిరుపతి. 517 501

మహిళల మధుర జీవనానికి మార్గదర్శి

మహిళ

జనవరి 1977

జ్యోతి

సచిత్ర మాసపత్రిక

సంపుటి 14
సంచిక 12

సంస్థాపకులు :
కీ. శే. వి. ఏ. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్ :
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

సహకార సంపాదకుడు : వేమూరి సత్యనారాయణ

విషయసూచిక

ముఖచిత్రం పల్లవీ ఆర్ట్ పిక్చర్స్ "ఈ తరం మనిషి"లో శోభన్‌బాబు, జయప్రద

జ్యోతి, 40/1 మూసాపేట్ స్ట్రీట్, టి నగర్, మద్రాసు-600017.

తొలిమాట

1977 తెలుగు రైతులకు అత్యంత విషాదకరంగా మొదలవుతోంది. కుప్పనూర్పిడి చేసుకొని ధాన్యలక్ష్మిని ఇంటికి చేరవేసుకొని అమిత సంతోషంగా గడపవలసిన రైతుబిడ్డలు - ఒకటి వెంకటి ఒకటిగా మూడుసార్లు విజృంభించి ప్రళయంగా పరిణమించిన తుఫాన్లు కారణంగా నడుం విరిగిన వాళ్ళయారు. పంటచేలో పరిచి ఉన్న పనలన్నీ నదిలో నావల్లా నీటిలో తేలియాడటం చూసిన రైతుబిడ్డల హృదయాలెంత క్షోభిల్లాయో! ఉన్న కొంచెం కొంద్రలోనూ పంట పండించుకొని సంవత్సరమంతా జీవనం సాగించుకోవలసిన సన్నకారు రైతులు సర్వం నాశనం కాగా కుటుంబాన్నెలా పోషించుకోవాలా అని ఎంతగా తల్లడిల్లిపోతున్నారో! భయంకరమైన ఈ తుఫాను రైతుపాలిట పెనురక్కసిగా ప్రవర్తించింది. అన్నపూర్ణగా వినుతికెన్ని ఆంధ్రమాత అనుంగు బిడ్డలైన రైతులు చేతులు విరిగిన చందాన తయారయ్యారు.

ఈ ఆపత్సమయంలో రైతులకు పూర్తి రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వం చేపడుతుందని ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు ప్రకటించారు. ప్రభుత్వం జరిపే కృషికి పూర్తి చేయూతనిచ్చి ఈ కష్టసమయంలో తెలుగు రైతుకు పూర్తి చేయూత నందించవలసిన బాధ్యత ప్రతీ తెలుగువాడిపైనా ఉంది.

వె. గోపాలకృష్ణయ్య

యేసూ అనగ రక్షకుడు

క్రీస్తు ప్రభువును 'కపాలము' అనే స్థలములో సిలువ లేసినప్పుడు ఇద్దరు బందిపోటు దొంగలను కూడ సిలువలేశారు. వారు నీవు క్రీస్తును (రక్షకుడవు కావా) అట్లయిన మమ్ము రక్షించమని పరిహసించినవారే. అయితే సిలువపై మొదటిగా పల్కిన మాటలతో ఒకనికి మారు మనస్సు కలిగి వెంటనే ఏసుని చూచి 'ఏసూ' (రక్షకుడా) నీవు నీ రాజ్యములోనికి వచ్చునపుడు నన్ను జ్ఞాపకము చేసుకొనమని అడిగియున్నాడు. వెంటనే ప్రభు నేడు నీవు నాతోకూడ పరదైసులో యుందువని దొంగతో చెప్పినట్లు దైవ గ్రంథములో వ్రాయబడియున్నది. ఆ దొంగ పాదాలు కీడు చేయుటకు పరుగెత్తిన పాదాలేగాని, తోటి మానవులకోసం, పరుగెత్తి మే లొనంగిన పాదాలు కావు. మరుక్షణం మృత్యు ఒడిలో తల దాచుకోపోతున్నవాడు. ఆ ప్రభుకో ఏమివ్వగలడు? పశ్చాతాప్తముతో వెలువడిన, ఆ దీన ప్రార్థన ప్రభువు ఆలకించి, తన రాజ్యపు వెలుగులోనికి నడిపించగలడనే నిరీక్షణ తప్ప భగ్నజీవికి వేరే నిరీక్షణ లేదు. ఆ నిరీక్షణే అతనికి ప్రభువుతో పరదైసులో ప్రవేశించే అర్హతను కలిగించింది. మన మంతా విశ్వాసము ద్వారా కృపతో రక్షింపబడియున్నాము. మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆ ప్రభువును నమ్మదగినవాడు. గనుక మన పాపములను సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును.

—చదలవాడ చంద్రమతీదేవి

ఉత్తరాలు

'డిసెంబర్' నెల పేరు చెప్పేసరికి డిసెంబరు పూలు గుర్తుకొచ్చినట్లే డిసెంబర్ (మీ)మా "జ్యోతి" చూసేసరికి రాయి వంటి హృదయం వున్నవాళ్ళ నయినా చలింపచేసి వాళ్ళని రంజింపచేసి ఆ రాతి హృదయాన్ని పువ్వులా మార్చే గీతలు వుంటాయనిపిస్తోంది. ఆ విష యాన్ని తెలియజేసే "ఓ ప్రేమ కథ" గీతలు వ్రాతలకంటే గొప్ప కథల్ని చెప్పగలవని, ఒప్పుకొనేలా చేస్తోంది. 'నా' పేరు చెప్పకోకుండానే 'నీ'కు పేరు పెంచుతానన్నట్లుగా 'నానీ'గారు "జ్యోతి" లో జ్యోతులు వెలిగేలా గీతలు గీసారు. "ఓ ప్రేమ కథే" చూపించి మా అందరి ప్రేమను దోచారు, మాకు "జ్యోతి"పై ప్రేమనే పెంచారు.

—భమిడిపాటి భీమశంకరం,
వెదురుపాక.

నెలనెలా "జ్యోతి" ఎంతో ఆసక్తి దాయకంగా చదువుతున్నాను. "శ్రీశ్రీ" గారి "పదబంధ ప్రహేళిక" మెదడును తిక - మక చేస్తూంది. "సత్యం-శివం సుందరం" "జై మంగళా" సీరియల్స్ మా హృదయాలను మురిపింప జేస్తు న్నాయి. రచయిత్రులకు నా అభినందనలు. వేణుగారి "అంతర్యాలు" నాకు నచ్చిన కథ.

—మన్మోహన్ థోంది, అర్మూర్.

శ్రీ శాస్త్రి, దేవ్‌లు వ్రాసిన గిరి దాటని సంస్కారం బాగుంది. సమాజంలోని సమస్యనూ, ఓ యువ రచయిత ఊహల గురించి బాగా చెప్పగల్గారు. ఏ రచయిత కైనా, తాను తన రచనలలో అందించే సందేశా లన్నింటినీ, పరిస్థితుల ప్రభావం వల్ల తన నిజ జీవితంలో ఆదర్శంగా ఆచరించలేక పోవచ్చును. ఇదే ఓ రచయితగా నా అభిప్రాయం కూడా.

ఎక్కువ పేజీలతో, తక్కువ కథా బలంతో బోర్ కొట్టించే కథలకన్నా, చిన్న కథలైనా, వెరైటీగా వుండేవి అందించుకొన్న "జ్యోతి" సంపాదక వర్గానికి నా హృదయపూర్వక అభినంద నలు. మినీ కథలకు, చిన్న కథలకు మరింత ప్రాధాన్యత నిస్తారని ఆశిస్తాను.

— గురుజాడ విజయరామయ్య.
(రాంబాబు), విజయవాడ.

డిశంబరు 76 "జ్యోతి"లో అన్నపూర్ణ "సమాధి-పునాది" కథ బాగుంది. చదువు పూర్తిచేసినవారు "ఏదో వస్తుంది మాకు తగిన జాబు" అని ఎదురుచూసే యువతు లకు చక్కని పరిష్కారం చూపించారు "ప్రకాష్" పాత్రద్వారా రచయిత్రి.

మల్లాదిగారి "కథకుని కథ" బాగుంది.

— కె. బి. పూర్ణచంద్రరావు,
కె. గోపికృష్ణ, విజయవాడ.

శ్రీశ్రీగారు, "పాఠంలోకం కోరితే అసలే విరమించుకోవాలని నాకుంది. కాని, అంత ఘోరమైన కోరిక నా పాఠక వర్గం కోరదని నా ధైర్యం" — అని రాసారు. నిజం, పాఠకులు ఎప్పుడూ కోరరు. అలా జరగడానికి వీలులేదు.

ఆయన పదబంధ ప్రహేళిక, నిజంగా ఒక విజ్ఞాన ప్రహేళిక.

ఈ కొండలు కోనల్లో వున్న మాకు, మా "జ్యోతి"ని చూడగానే, ఒక ఆప్తుని చూపినంత ఆనందం కల్గుతున్నది. చక్కని కథలు, నవలానుబంధం ప్రతి నెలా అందిస్తున్న మా "జ్యోతి"కి ధన్యవాదాలు.

—డి. వి. రామకృష్ణ,
బలిమెలాడామ్ ప్రాజెక్ట్, చిత్రకొండ.

డిశంబరు నెల ముఖచిత్రం ఆకర్షణీయంగా ఉంది. మల్లాదిగారి "కథకుడి కథ"లోని సంతోష్ పాత్ర మా కను కొలకులలో నీటి బిందువులను చూపింది. "సమాధి-పునాది" "గిరిదాటని సంస్కారం" కథలుగూడ బాగున్నాయి. "మిస్టర్ సంపత్, ఎం.ఏ" సీరియల్ ముగిసినందుకు బాధనిపించినా క్రొత్తరకం సీరియల్ చదివినామని తృప్తిపొందాము.

—ఇ. సుబ్బారావు, నెల్లూరు.

డిశంబరు నెల "జ్యోతి"లో "స్వామి చిత్రానంద"గారి కథానిక - "రాని బస్సు కోసం"- చాలా బాగుంది. దాదాపు అటువంటిదే సంఘటన- గత సంవత్సరం నేను మద్రాసు సందర్శించినప్పుడు జరిగింది. నా ఆకారము, ఆహార్యమూ చాలా మందిచేత,ఉత్తర భారతీయుణ్నా అనిపించినప్పటికీ ఒకామె, నేను తెలుగువాడినేనని ఎలా పోల్చుకోగలిగిందో- నాతో సరిగ్గా అదే సరళిలో, తెలుగులో, మాట్లాడింది. అది నాకింకా ఆశ్చర్యంగానే వుంది.

పి. యస్. యస్. కిరణ్‌బాబు,
పిఠాపురం.

డిశంబరు సంచికలోని మల్లాది వెంకట కృష్ణమూర్తిగారి కథ "కధకుడి కధ", ఒకవిధముగా "ఓహెన్రీ" కథలను ఢామినేట్ చేసేట్టువంటిదే; గానీ మీ చిత్రకారుడు వేసిన చిత్రమువలన దానికి రావలసిన "కొన మెరుపు" రాకుండా పోయి కథ చప్పగా తేలిపోయింది. దయచేసి కథ భవిష్యత్ తెలియచేసేట్టుగా చిత్రాలు వేయవద్దండి.

—టి. హరనాథ్‌గుప్త, పుంగనూరు.

డిశంబరు నెల జ్యోతి మాసపత్రిక యందు ప్రచురితమైన ముద్దా రమేష్‌గారి "అదీ కథ", "దురలవాటు" స్కెచ్‌లు చాల బాగున్నాయి. ముఖ్యంగా ఇచ్ఛాపురం రామచంద్రంగారి "ఫుట్ బాల్" చిన్నకథ చాల బాగుంది. ఇలాంటి ఆసక్తిదాయకమైన కథలు ప్రచురించి మమ్మానందింపజేయగలరు—

—కె. వి. నాగేశ్వరరావు,
నార్తు రాజుపాలెం.

1976 బెస్ట్ ఎమెచ్యూర్ సింగర్ అవార్డు

వంశీ ఆర్ట్ థియేటర్స్ హైదరాబాదు వారు ఫిబ్రవరిలో ఔత్సాహిక గాయనీ గాయకులనుంచి 1976 వ సంవత్సరానికి ఉత్తమ గాయనీ గాయకుల ఎన్నిక

చేయాలని నిర్ణయించారు. స్క్రీనింగ్ హైదరాబాదు, గుంటూరు, నెల్లూరులలో జరుగుతాయి. స్క్రీనింగ్‌లో ఎన్నికైన వారినుంచి ఉత్తమ గాయనీ గాయకులను ఎన్నిక చేయటానికి సంగీత దర్శకులు శ్రీ పెండ్యాల తుదిన్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తారు. బెస్ట్ ఎమెచ్యూర్ సింగర్ అవార్డే కాకుండా, శ్రీయుతులు శోభన్ బాబు, రాజేశ్వరరావు, మహదేవన్, యస్. పి. శ్రీమతులు జమున, సుశీల రోలింగ్ షీల్డ్స్ కూడా వుంటాయి. ఇదే సందర్భంలో జరుగు కవితలు కథానికల పోటీలో ఎన్నికైన నాలుగు ఉత్తమ కవితలను జ్యోతి, కథానికలను స్వాతి మాస పత్రికలు ప్రచురిస్తాయి. పూర్తి వివరాలు కోరువారు 20 పైసల స్టాంపు పంపుతూ వంశీ ఆర్ట్స్, 1-8-702/31, నల్లకుంట, హైదరాబాదు-44 నుంచి పొందవచ్చు.


అఖిలభారత తెలుగు వక్తృత్వ పోటీలు

భారత-మలేషియా తెలుగు మైత్రీ సంఘం, హైదరాబాదు, వచ్చే జనవరి మాసం ఎనిమిది, తొమ్మిది తేదీలలో అఖిలభారత స్థాయిలో తెలుగు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తోంది. పూర్తి వివరాలు స్వంత చిరునామా కల కవరు పంపి శ్రీ బి. రమేష్. 10-5-64/7, శ్రీరామ నగరు కాలనీ, మాసాబ్ ట్యాంకు, హైదరాబాదు - 500 028 నుండి పొందవచ్చును.

శ్రీశ్రీ రచన 'దైవభీతి'పై చర్చ!

శ్రీశ్రీగారి భయానక రసములోని భయాన్ని భరించలేక అది భయంకాదు నమ్మకము అన్న నెల్లూరి పాఠకుని లేఖలో వారి భయాన్ని తిరిగి ప్రదర్శించుకొని మేకపోతు గాంభీర్యమే ప్రదర్శించుకొనిరి. అదే నేటి ఆధ్యాత్మిక చింతనలోని పరమ రహస్యము. అనాదినుండి వచ్చుచున్న ఆస్తిక నాస్తిక వాదనలు వర్గవిభేదాలవల్లనే యని స్పష్టమగుచున్నది. ఆదిలో ఏ మత మున్నది? బలవంతుడు బలహీనునిపై విధించిన ఆంక్షలే ఆచారములైనాయి. అవి బలవంతుని అధికారాన్ని నిలుపుట కోసము మొదట బలవంతంగాను, తరువాత పాపభీతిచేతను, ఆ తరువాత తప్పుకోలేని భయంచేతను ఆచరింపబడే టట్లు చేయబడినాయి. దేవుడు వున్నాడని నిరూపించలేకపోవుటే దేవుడు లేడన్న దానికి నిదర్శనము. వేరే నిరూపణ అవసరములేదు. సృష్టి ఆదినుండి దేవుడిని చూపినవాడు లేకపోయినను, ఆధ్యాత్మిక వ్యాసంగములు నెరపుచున్న వారందరు ఉబుసుపోక వ్రాసినవారే అని గుర్తించవలెను. కొందరు వుబుసుపోక వ్రాస్తే, చాలామంది జీవనవృత్తిగ వ్రాస్తున్నారు. ఆధ్యాత్మిక చింతనపోయి, నాస్తికవాదము ప్రబలిననాడు కొందరి వృత్తులు, కొందరి అధికార హోదాలు, కొందరి వర్గ ఔన్నత్యము. కుల మతాధికారములు, భువి స్వర్గ విలాసములు వదలుకొనవలసి వుంటుంది. ఆ ప్రయోజనములు కాపాడు

విద్వాన్ విశ్వం షష్టిపూర్తి



ప్రముఖ కవి, రచయిత, పాత్రికేయుడూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సంపాదకుడు విద్వాన్ విశ్వం షష్టిపూర్తి సందర్భంగా మద్రాసులో సత్కరించబడ్డారు పలువురు ప్రముఖులు సభ్యులుగా గల విద్వాన్ విశ్వం షష్ట్యబ్దిపూర్తి ఉత్సవ కమిటీ ఆయనకు సన్మానించి 25 వేల రూపాయల పర్స్ బహూకరించిందాయనకు ఆ సందర్భంగా జరిగిన సభకు బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షత వహించారు ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖా మాత్యులు మండలి వెంకటకృష్ణారావు, డా॥ ఎం శాంతప్ప, మద్రాస్ షరీఫ్ ఆర్ రామకృష్ణన్, పి వి రమణయ్య (రాజా), బి జె రావు, కళాసాగర్ ప్రెసిడెంట్ డా॥ సి ముద్దుకృష్ణారెడ్డి ఫిలిం నిర్మాత ఎం ఎస్ రెడ్డి, కుమారి వాణిశ్రీ, శ్రీమతి జమున, ఆరుద్ర దాశరధి, గొల్లపూడి ఆ సందర్భంగా విద్వాన్ విశ్వం సాహితీ సేవలను కొనియాడుతూ ప్రసంగించారు విద్వాన్ విశ్వం తనకు జరిగిన సన్మానానికి కృతజ్ఞతలు చెబుతూ సర్వమానవ శ్రేయస్సు నాసిస్తూ తన రచనా వ్యాసంగం కొనసాగించగలనన్నారు


ఈ సన్మాన సందర్భంగా ప్రతివక్త చేతా ప్రశంశించబడ్డ వ్యక్తి టి వి కె శాస్త్రి. షార్టుగానూ. స్మార్టుగానూ ఉండే ఈ ఉత్సాహవంతుడు 'కళాసాగర్' నిర్వహణలో కీలకమైన పాత్ర నిర్వహిస్తున్నారు చిరునవ్వు వీడని ముఖంతో, బొంగరంలా తిరుగుతూ కార్యక్రమ బాధ్యతలు చేపట్టి, అలసట కన్పించనీయని శ్రీ శాస్త్రిని మద్రాసులోని తెలుగు వారందరికీ దగ్గిరవాడిగా వర్ణించవచ్చు విద్వాన్ విశ్వం సన్మాన ఉత్సవం దిగ్విజయంగా జరగడానికి టి వి కె శాస్త్రి నిరంతరం శ్రమించారు ఆ అర్హతకు పాత్రుడు గనుకే ప్రతివక్తచేతా యీ సన్మానోత్సవ నిర్వహణకు మూలస్థంభంగా ప్రశంశించబడ్డాడు కూడా ఈ షష్ట్యబ్ది పూర్తి ఉత్సవ సందర్భంగా నరాల రామిరెడ్డిచే అష్టావధానం ఆనంద్, శారద, రామారావులు సంగీత విభావరి నిర్వహించారు

—జ్యోతి ప్రతినిధి

కొనుటకే ఆస్తికత్వపు బురఖా మోసము ఎంతకాలమో సాగదు బురఖాలు తొలగే రోజులు వచ్చాయి ప్రస్తుతము ఇండియాలో పర్యటించుచున్నాడా కోవూరు గారు, ఆస్తిక మాయలో మునిగిపోయిన మూఢభక్తులకు, వంచింపబడుతున్న బలహీనవర్గాలకు, ఆస్తిక శిఖామణులని భ్రమపడుచున్న ఆస్తికులకు కనువిప్పు కలిగిస్తారని ఆశించుచున్నాను

--యా క రా, విజయవాడ.

శ్రీశ్రీ నిర్వహించు
పదబంధ ప్రహేళిక



ఆధారాలు - జనవరి '77

అడ్డం

2 పద్మార్కం
6 రెండు లఘువులు
7 తిరగబడ్డ బంధువు
9 7 భార్య?
10 అమ్మాయి (అటునుంచి)
12 వాద్య విశేషం
14 తమర్ని ఏకవచనంలో
15 ఈ తగ మధురవాణి సూచించింది
17 మధ్యమ పాండవుడు
19 ఇది లేని గది ఉంటుందా?
20 ఆకర్ణించి
22 జలాశయ విశేషం

డిసెంబరు 'పదబంధ ప్రహేళిక'కు సమాధానం:

అడ్డం:— 1. కనుక 4. ఇచ్చట 6. లత 8. పాట 9. హంస 11. రుక్మిణి 12. వారి 13. భరణి 15. విశ్వాసం 20. పానకం 22. వదంతి 24. రేలు 25. కడాని 26. లక్ష 28. ధర 29. తన 31. యోజనం 33. నగలు.

నిలువు:— 1. కలహం 2. వారు 4. ఇట 5. టక్కరి 7. తరుణి 8. పాణిని 10. సభ 12. వాసం 14. రసన 16. శ్వాపదం 20. పాలు 21. కంకర 22. వనిత 23. తిల 24. రేడియో 27. క్షణాలు 28. ధనం 30. నగ.

ఏకాక్షర పదాలు:—3. లోక్ 17. రా 18. ం 19. ఊ 32. ద్రా.

నిబంధనలు మరవకండి!

ఎంట్రీలు కొట్టివేతలూ, దిద్దుబాటులూ లేకుండా జ్యోతిలోని పదబంధ ప్రహేళిక లోనే నింపి పంపాలి. ఎంట్రీ పంపినవారి చిరునామా పదబంధ ప్రహేళిక వున్న పేజీ లోనే పైన రాసి పంపాలి. ఆల్‌కరెక్ట్ ఎంట్రీలలో లాటరీవేసి ఒక్కరికి తెలుగు నిఘంటువూ, మరో పదిమందికి ఆ నెల జ్యోతి కాపీలు పంపబడతాయి. ఆల్‌కరెక్ట్ పంపిన పాఠకులందరి పేర్లూ జ్యోతిలో ప్రకటిస్తాము. ఎంట్రీలు చేరవలసిన ఆఖరు తేది 1-1-77. (ఈ నెల విజేతల పేర్లు 14 పేజీలో చూడగలరు)

---

23 సమూహం
25 దుష్టచతుష్టయంలో ఒకడు
27 స్త్రీ
28 దిట్ట
30 స్నేహానికి భర్తృహరి ఉపమానం
32 ఎటు చూసినా నవ్విస్తాడు

నిలువు

2 ఆడదాని ఆద్యంతాలు కెరటం
3 ఇతని మతంలో దేవుడు లేడు
4 అసంపూర్ణ గ్రంథం తొమ్మిదవది
6 ఈ ఇల్లు భారతంలో తగలడింది
8 గుర్రం
9 2 లో 3 వ పాదం మొదలు
10 ప్రధానేంద్రియం
11 ఒక ఉభయచరం
13 జనకుని జామాత
14 దీర్ఘం
16 కృశ్చేవ్ పేరు
21 రే.
22 లోపలి
24 విమానాశ్రయం
26 అసతి
27 ఇది లేని గది ఉండదు
29 'కష్టజీవి'కి రెండువైపులా నిలుస్తాడు
30 చెరసాల

ఏకాక్షర పదాలు

1 నాలో సగం
5 ఇంగ్లీషు చెట్టు
18 30 అడ్డుతో కలవ్వొచ్చు
31 సరే
33 ద్విగుణిస్తే పీడోళ్ళు

మహాకవి శ్రీశ్రీ రచనల ప్రత్యేక శీర్షిక !



నవరసాల శ్రీశ్రీ

కుళ్ళ్యా, పేతుళ్ళ్యా

దేవుడి గదిలో దయ్యాలు—ఇది
ప్రతీ యింటిలో బీభత్సం
ఇంట్లో వంటకి మండదు పొయ్యి
దేవర వారికి దీపాలు
కక్కుసు చూస్తే ప్రత్యక్ష నరకం
గలీజు బూజూ గదులన్నీ
తలగడాలలో నల్లుల సంతతి
తండులాలలో మన్నూ మశానం
ధనిక గృహాల్లో దారిద్ర్యం
ఇదీ బ్రదర్ మన ఐశ్వర్యం

మనం మనుష్యుల మనుకొందామా,
ద్విపాద పశువుల మని అంటామా?
పశువుకి కూడా శుభ్రత వుంది
నర పశువులకే అది లేదు,
ఈ దేశంలో, ఎలకా దేవుడు
పందీ దేవుడు మనిషే వెధవ!
వ్యాపారంరా, వ్యాపారం!

ఈ నెల బీభత్స రసం!

డా॥ కోట్నీస్ స్మారక మందిరం ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు భారత దేశంనుండి 8 మందితో ప్రతినిధివర్గం బయలుదేరి వెళ్ళింది డా॥ బాసు నాయకత్వాన వెళ్ళిన యీ సౌహార్ద్ర ప్రతినిధుల బృందంలో 'నవరసాల శ్రీశ్రీ' శీర్షిక నిర్వాహకుల్లు మహాకవి శ్రీశ్రీ కూడా ఉన్నారు

తెల్లారి లేచింది మొదలు
యెవడి నెత్తి కొడదామా అనే ఆలోచన,
మొగుణ్ని పెళ్ళాం మోసం చేస్తది
మొగాడు ముండల మురాకోరు
ఎక్కడా లేని ఇంత అసహ్యాం
ఇక్కడే ఎందు కుండాలి?
అందుకు ఒకటే కారణం
అదే దైవం
అనే భావం
చెయ్ రా, చెయ్ రా, చెయ్, చెయ్, చెయ్,
నీ యిష్టం వచ్చినన్ని పాపాలు చెయ్
పర్వా లేదు భగవంతుడున్నాడు
కొబ్బరి కాయొకటి కొడితే చాలు
కర్పూరం వెలిగిస్తే మేలు
తుడుచుకు పోతాయ్, నీ పాపాలు
మసీదు ముందర, చాపెల్ ముందర
కోవెల ముందర గుమిగూడేది
ఎవరు వారు? ఎవరు వారు?
కుష్టు రోగులూ, కుంటీ గుడ్డీ
ఆ చుట్టూతా బోలెడు ఈగలు
బోలెడు దోమలు
నీ అన్నంలో విషం కలుపుతాయ్
సరదాగా నువ్వది సాపడుతావు
అదే ప్రసాదమని అనుకుంటావు

కళ్ళు కద్దు కుంటావు
అది పెంటరా అని నే నంటా
నువ్వు నన్ను నాస్తికు డంటావు
ఒరేయ్ ఎలకా, ఒరేయ్ పందీ
ఒరేయ్ శునకా, ఒరేయ్ నందీ
మీ రంతా భక్తులు, అశక్తులు,
బానిసలు!
మానసిక స్వాతంత్ర్యం లేదు మీకు, మీ
మనస్సు నిండా
కుళ్ళూ, పీతుళ్ళూ,
ఇది జుగుప్స!
ఇది బీభత్సానికి స్థాయీ భావం!
ఈ యేహ్యాం ఎవరు తొలగిస్తారా?
దేవుడా?
బతికున్న జీవుడా?
వెళ్ళు గుడిలోకి
    దరగా లోకి
    చర్చి లోకి
అక్కడ అంతా బీభత్సం!
    బైటికి రా!
విశాల విశ్వంలోకి విరుచుకు పడు!
నన్ను నమ్ము! నా మాట నమ్ము!
కుళ్ళు దేవుళ్ళని నమ్మకు
దేవుళ్ళంతా కుళ్ళే!

డిసెంబరు పదబంధ ప్రహేళిక ఫలితాలు :

ఒక్క తప్పులేకుండా వచ్చిన ఎంట్రీలు రెండు. వాటిని పంపిన వారిలో డి. శ్రీధర్, 12 స్టేషన్ రోడ్, కోడంబాకం, మద్రాసు-24 నిఘంటువు గెలుచుకొన్నారు ఆల్ కరెక్టు ఎంట్రీ పంపిన మరొకరు పి ప్రసాద్, ఒంగోలు. వీరికి డిసెంబర్ జ్యోతిని ఉచితంగా పంపుతున్నాము



సిహెచ్.మధు

అటు వారి కాదు ఇటూ

ఆ ఇంట్లో—

అందరూ మెలుకువతో ఉన్నారు

అయితే—

నిద్రపోతున్నారు

కనులు మూసుకున్నారు కదలటం లేదు మెదలటంలేదు దగ్గటంలేదు తుమ్మటంలేదు గాలి కూడా బిగ్గరగా పీల్చటంలేదు

గుండె కొట్టుకుంటూవుంది కాని ఎవరికీ వినిపించటం లేదు

ఆ ఊళ్ళో—

అంతా అదే పరిస్థితి

కారణముంది

నిన్న రాత్రి ఊళ్ళో గోడలపై రెండు పోస్టర్లు వెలిసాయి "దొంగల మచ్చామని ఊళ్ళో దోచుకుంటున్నామని, రాత్రి పూట ఎవరైనా ఎదిరిస్తే కనీసం తెలివితో ఉంటే కదిలితే కాల్చేస్తామని మా వద్ద తుపాకీలున్నాయని"

పోస్టర్లు చూపిన ప్రజానీకం భయపడి పోయింది.

ఆ ఊరు రోడ్డుకు ఎనిమిది మైళ్ళ దూరంలో అడవిలో ఉంది చుట్టూ అడవి

గ్రామాధికారులు పోలీసువారికి కబురు చేసారో లేదో కాని పోలీసులు వస్తున్నారో కాని లేదా—దొంగలు గ్రామాధికారుల బెదిరించారోకాని — ఏ సంగతి ప్రజలకు తెలియదు

రాత్రి ఎనిమిది గంటలు కాగానే—

అందరూ తలుపేసుకున్నారు, "పోతే ధనం పోనీ కాని, ప్రాణాలు పోతే ఏలా" అనుకున్నారు

భోజనం చేసారు

నిద్రపోయారు

నిద్ర రావటంలేదు భయం


దీపావళి నాలుగు రోజులుంది ప్రజలలో భయం నాల్గు రోజులవరకు వెల్తారో లేదో వెళ్ళకపోతే ఊరంతా చీకటి ఆ ఊరంతా దీపాలతో వెలిగించాలనుకున్నారు ఇంతలో ఈ సంఘటన

ఆ ఇంట్లో—

అరుణబాబు అనే పిల్లవానికి నిద్ర రావటంలేదు దొంగల భయం కాదు తల్లి చెప్పింది "అరే దొంగలచ్చారురా నిద్రపోరా, వాళ్ళ దగ్గర తుపాకీలున్నాయిరా" అని—

భయం కాదు నిద్ర రాకపోవటానికి

దీపావళి వచ్చిందని ఊళ్ళో దుకాణదారులు పటాకులు తెచ్చుకున్నారు అరుణబాబు నాన్న అరుణబాబును బజారులో నుండి ఎత్తుకుని రాగా—తుపాకీ కొనివ్వమంటే కొనియిచ్చాడు ఇంటికొచ్చేసరికి



రాత్రి తొమ్మిది అయ్యింది అప్పటికే ఊరంతా నిశ్శబ్దమయ్యింది ఎక్కడో దొంగలున్నారనే భయం

తుపాకీ కాల్చాలని అరుణబాబుకు ఆరాటం

ఇంటికి రాగానే తుపాకీ కాల్చాలని ప్రయత్నిస్తే అమ్మానాన్నా "ఊళ్ళో దొంగలున్నారని" తిట్టింది కాల్చనివ్వ లేదు అదే బాధ

తుపాకీ కొన్ననుండి కాల్చలేదు

కాల్చాలి

అందుకే నిద్ర రావటంలేదు

రాత్రి పన్నెండు అయ్యింది

ఎక్కడో దొంగలు తలుపుకొట్టిన చప్పుడు.

అరుణబాబు లేచాడు

పిస్తోలు తీసి పొడువైన మందుబిళ్ళల కాగితం చుట్టూరా చుట్టి పేల్చాడు

ధన్ ధన్ ధన్ ఒకటి రెండు పది పన్నెండు ఇరువది సార్లు చప్పుడయ్యింది

ఇంట్లోవాళ్ళు లేచారు

లైటు వేశారు

అందరిలో భయం

నాన్న లేచి ఫెడీలుమని అరుణబాబు చెంపపై వేసాడు

ఏడుపు వినిపిస్తే ఎక్కడ దొంగ లొస్తారోయని ఏడువకుండా అమ్మ ఒళ్ళో హత్తుకుంది

తలుపు కొట్టిన దొంగలు ఎక్కడో దూరంగా పరిగెత్తిన చప్పుడయ్యింది

ఈ సంఘటన చూచిన అరుణబాబు తమ్ముడు ప్రకాశ్ "నకిలీ తుపాకీ చప్పుళ్ళకే అందరూ లేచారు అందరూ మెలుకువతో ఉన్నారని దొంగలు రావచ్చు రాకపోవచ్చు వచ్చినా అసలు తుపాకీ మనం పట్టుకుంటే ?" ***

మినీ కథ

అద్భుతదీపం

సుబ్బారావు, పాపారావు మిత్రులు

పక్కా తాగుబోతులు సుబ్బారావు సీసాలకు సీసాలే పీల్చేస్తే పాపారావు పీపాలకు పీపాలే త్రాగేరకం అసలు వీళ్ళిద్దరూ స్నేహితులయింది ఓ బ్రాందీ షాపులోనే

ఇలా ఉండగా ఓనాడు సుబ్బారావు ఒక కుర్రాడితో పాపారావుకి ఓ చీటీ పంపాడు

పాపారావుకి,

మా ఆవిడ ఊళ్ళో లేదు మీ ఆవిడా ఊరు వెళ్ళిందని తెలిసింది ఇంట్లో బోల్డంత 'మందు' ఉంది ఈ రాత్రి తొమ్మిది గంటలకు నువ్వు మా ఇంటికి వచ్చేస్తే 'పార్టీ' చేసుకుందాం' మిత్రుని ఈ చిన్న కోరిక తీర్చగలవని ఆశిస్తున్నాను నీ కోసం వేయి సీసాలతో ఎదురు చూస్తుంటాను

సుబ్బారావు

పాపారావు ఎగిరి గంతేశాడు

ఆ రాత్రి సుబ్బారా వింటికి బయలుదేరాడు పాపారావు చీకటిరాత్రులవడం వలన తిరిగొచ్చేటప్పటికి 'జాగ్రత్త'కోసం తన వెంట ఓ లాంతరు కూడా తీసుకుని బయలుదేరాడు

మిత్రుణ్ణి ఆనందంగా రిసీవ్ చేసుకున్నాడు సుబ్బారావు అర్ధరాత్రివరకూ మిత్రు లిద్దరూ సురాపానంలో మునిగి తేలారు ఇటువంటి రోజులు— 'రోజుకి రెండు'రావాలని భగవంతుని ప్రార్థించారు

బ్రతికున్నంత కాలం మనం ముగ్గురం (సుబ్బారావు, పాపారావు, 'సీసా'రావు) విడిపోని మిత్రుల్లా కలిసి వుందామని వాగ్దానాలు చేసుకున్నారు

చివరికి మిత్రుడికి 'థాంక్స్' చెప్పి యింటికి బయలుదేరాడు పాపారావు తన లాంతరుతో సహా

బయటంతా కటిక చీకటి లాంతరు సహాయంతో దారి చూసుకుంటూ గోతుల్లో, కాలవల్లో పడకుండా 'తెలివిగా' తప్పించుకుంటూ యిల్లు చేరుకున్నాడు పాపారావు

పక్కమీద పడి గాఢ నిద్రలో మునిగిపోయాడు

మర్నాడు ఉదయం పదిగంటలవేళ ఎవరో తలుపు తడుతుంటే నిద్ర లేచి తలుపు తీశాడు పాపారావు

సుబ్బారావు పంపిన కుర్రాడు పాపారావు చేతికి ఓ చీటీ అందించాడు ఇలా వుంది అందులో —

పాపారావుకి,

నీ లాంతరు యీ కుర్రాడితో పంపుతున్నాను నువ్వు రాత్రి తెచ్చేసిన నా 'చిలక పంజరం' పంపివేయగలవు

సుబ్బారావు

-కోనే నాగవెంకటఆంజనేయులు





సీరియల్
ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి

ఆనాడు తాను ముచ్చటపడి ప్రధమంగా తిలకం నుదుటిన దిద్దుకొన్ననాడు తల్లి మహంకాళిలా విరుచుకుపడి ఆ తిలకాన్ని స్వహస్తాలతో చెరిపి వేసిన దృశ్యం ఆమె మనోపథంలో మెదిలింది

జరిగిన కధ

శివరావు సౌమ్యుడు, పై మెరుగులకు కాక వ్యక్తిత్వాలకు విలువనిచ్చే వ్యక్తి. ఆయన భార్య మీనాక్షి అందుకు పూర్తిగా వ్యతిరేకం వారికున్న ఇద్దరాడ పిల్లలలో పెద్దది ఉమ గుణాలకు తల్లి పోలిక తండ్రి గుణాలకు వారసురాలు సుందరి ఆర్ధిక చిక్కులలో ఉన్న గాయక కళాకారుడు సత్యమూర్తికి సాయం చేద్దామనుకున్న సుందరిని కసిరి కొట్టింది మీనాక్షి మీనాక్షి అభ్యంతరం పెట్టినా సత్యమూర్తికి తన పర్సనల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చాడు శివరావు సత్యమూర్తి తల్లికి ఆపరేషన్ కోసం పెద్ద మొత్తం సాయం చేశాడు శివరావు సత్యమూర్తికి చక్కని బంగళా, ఫోనూ ఏర్పాటు చేశాడు మీనాక్షికి ఇదేమీ నచ్చడం లేదు శివరావుతో కలిపి సత్యమూర్తి ఇంటికి వెళ్ళినప్పుడు, సత్యమూర్తి తల్లి చూపిన ఆదరభావమూ, ఆ తల్లీ కొడుకుల మధ్యగల అనుబంధమూ చూసి ముచ్చట పడింది సుందరి సుందరి ఒంటరిగా స్కూటరుపై వెళుతుండగా అల్లరి చేయబోయిన రౌడీలను దండించి ఆమెను కాపాడుతాడు సత్యమూర్తి సత్యమూర్తివైపు మరింత ఆకర్షితురాలవుతుంది సుందరి సత్యమూర్తితో షాపింగుకు వెళ్ళినందుకు సుందరిని నిలదీసింది తల్లి కుమార్ విదేశాలకు వెళ్ళాడు కుమార్ తిరిగి రాగానే ఉమ కిచ్చి పెళ్ళిచేయాలని మీనాక్షి సంకల్పం ఉమ జీవితంలోకి శంకర్ ప్రవేశించాడు ఇద్దరూ బ్లూఫిలిమ్స్ చూశారు అంతే! ఉమ తనను తాను మరిచిపోయింది ఉమ గర్భిణి అని తెలవడంతో మీనాక్షి నెత్తిన పిడుగు పడినట్లయింది ఈ దుర్వార్త తెలిసిన శివరావు తట్టుకోలేకపోయాడు ఆఫీసులో తన రూంలోనే నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు తలపెట్టాడు సత్యమూర్తి స్పృహ తప్పి ఉన్న యజమానిని డాక్టరు దగ్గరకు చేర్చాడు భర్తకు సీరియస్‌గా వుందని తెలిసి బయలుదేరిన మీనాక్షితోపాటు మిసెస్ కైలాసం కూడా బయలుదేరింది శివరావుగారి కుటుంబం అవమానాల పాలుకావడం చూసి తట్టుకోలేని సత్యమూర్తి ఉమని చేసుకోడానికి ముందుకొచ్చాడు ఈ పెళ్ళి విషయం తెలిసిన సుందరి నిశ్చేష్ట అయింది

'ఛీ, ఇటువంటి తల్లి పగవారికి కూడా వుండకూడదు' మనస్సు ఈసడించింది

"ఏమిటి సుందరీ ఆ పరధ్యానం?"

తండ్రి రెండుసార్లు అడిగిన తర్వాత మూడవసారి విన్పించిన ప్రశ్నకు నిద్ర నుండి మేల్కొన్నట్లు చూచింది సుందరి

డైనింగ్ టేబుల్‌వద్ద కుటుంబ సభ్యులంతా వున్నారు, క్రొత్తగా జేరిన సత్యమూర్తితో సహా

"సుందరీ, అలా వున్నావేం? ఒంట్లో కులాసాయేనా?"

"ఆఁ, డాడీ"

ఎదుటి కుర్చీలో వున్న సత్యమూర్తి అపరాధిలా తల వాల్చుకున్నాడు

"సందడీ, సరదాలూ తగ్గాయిగా? ఇక కాలేజీకి వెళ్ళు" ఆజ్ఞాపించింది మీనాక్షి సుందరి దెస చూడకనే, భోజనాని కుపక్రమిస్తూ

సుందరి సమాధానం చెప్పేలోపునే మరలా అన్నది

"తీరుబడిగా కూర్చునేవాళ్ళకే అనారోగ్యాలూ, ఆలోచనలూ ఎక్కువ నలుగురితో కలిసే స్వభావం కాదాయె నీది"

తాను వేసిన కుశల ప్రశ్న ఇంతటి సాధింపును సృష్టించినందుకు లోలోన చింతిస్తూ, శివరావు వాతావరణాన్ని మరో ప్రశ్నతో మార్చదలిచాడు

"సత్యం' హనీమూన్‌కు కాశ్మీర్ వెళ్తారా?"

సమాధానం మీనాక్షి ఇచ్చింది "ఇంట్లో ప్రశాంతతా, సౌకర్యాలూ తక్కువైన వాళ్ళు పోవాలి దేశాల వెంబడి, అయినా ఉమ ఆరోగ్యంకూడా అంత బాగుండలేదు"

శివరావూ, సుందరీ విస్మయంగా చూచారు

ఇటువంటి సంభాషణల సందర్భంలో, లోగడ చాలాసార్లు 'మా అమ్మాయిలను అమెరికా పంపుతాను హనీమూన్‌కు స్విట్జర్లాండు పంపుతాను ప్రపంచమంతా తిరిగొస్తారు సరదాగా' అనే మీనాక్షి నేటి ధోరణి ఏమిటో ఎవరికీ అంతుపట్టలేదు

"చిన్నబాబూ, అమ్మగారు వచ్చారు" అన్నాడు నౌఖరు వచ్చి

"ఆఁ అమ్మా?" సత్యమూర్తి ఆత్రంగా లేచాడు

"రండమ్మా రండి," అంటూ శివరావు ఎదురువెళ్ళి సాదరంగా ఆహ్వానించాడు "ఎలా వచ్చారు, ఫోన్ చేస్తే కారు పంపేవాడిని కదా?"

"ఎందుకు లెండి అన్నయ్యగారూ మనలో మనకు మర్యాదలేవిటి?" ఆప్యాయంగా జవాబిచ్చింది "ఇక్కడ మూడ్రోజులైంది కదా? అబ్బాయినీ కోడల్నీ ఇంటికి పిలుచుకువెళ్దామనీ, మిమ్మల్నందర్నీ ఓసారి చూచినట్టూ వుంటుందనీ "

"మంచిదమ్మా అలాగే కానీయండి ఉమా, మీనా ఇలా రండి" అని పిలుస్తూ వెనక్కు చూచిన శివరావు నీళ్ళుగారిపోయాడు

ఉమ తండ్రిపిలుపు వినినట్లే గబగబా భోజనం ముగించి పైకి వెళ్ళిపోయింది మీనాక్షి అంతకుముందే వెళ్ళిపోయింది

చిన్నబుచ్చుకున్న వదనాలతో నేలచూపులు చూస్తూ నిలబడిపోయారు అటు

భద్రమ్మా, ఇటు సత్యమూర్తి

సుందరి వచ్చింది

"నమస్కారం, అత్తయ్యగారూ రండి అలా ఆ గదిలో కూర్చుందాం" అంటూ భద్రమ్మ రెండు చేతులనూ పట్టుకొని ప్రక్కగదిలోనికి తీసుకువెళ్ళింది

శివరావు విసురుగా భార్య గదిలోకి వెళ్ళాడు

నిలబడ్డచోటనే యింకా నిలచివున్న సత్యమూర్తికి తల్లీ సుందరీల సంభాషణ వినవస్తోంది

"పార్టీనాడు మీరు రాలేదేం అత్తయ్యగారూ?" ఏదో మాట్లాడాలి గనుక మాట్లాడుతోంది సుందరి

"పార్టీయా? ఏం పార్టీ?"

సుందరికీ సత్యానికీ కూడ తెలిసింది విందుకు ఆమె ఆహ్వానింపబడలేదని

సుందరి బాధపడ్తోందని గ్రహించిన భద్రమ్మ తడబడుతూ విషయాన్ని దిద్ద ప్రయత్నించింది "ఆఁ ఆఁ అన్నట్టు పార్టీకదూ? రాలేకపోయాను పెళ్ళయాక రిజిస్ట్రాఫీస్‌నుంచి యింటికి వచ్చేసరికి కొంచం జ్వరం వచ్చినట్లనిపించింది"

"పెండ్లి రిజిస్ట్రాఫీస్‌లో జరిగిందా?" క్రొత్తగా విన్న విషయానికి తట్టుకోలేక, "కూర్చోండి ఇప్పుడే వస్తాను" అంటూ అక్కడినుండి పారిపోయినట్లే వచ్చి బయటపడింది

కనులు తుడుచుకుంటూ తలెత్తిన ఆమెకు, పాషాణంలా నిలబడి వున్న సత్యమూర్తి కన్పించటంతో అదిరిపడింది

ఆమె కనులలో సప్తసముద్రాలను చూచిన సత్యమూర్తి బాధగా కనులు మూసుకున్నాడు

ఇద్దరూ గ్రహించారు రెండవవారి వేదనను.

కానీ ఏ పైశాచిక శక్తి యిలా యిరువురినీ విడదీసి విలపింప జేస్తూన్నది?

అది అతడికి తెలుసు, ఆమెకు తెలియదు

సుందరి త్వరత్వరగా అతడి సమక్షంనుండి పరుగెత్తినట్లే నడచిపోయింది.

శివరావూ మీనాక్షిల మాటలు మొదట అస్పష్టంగా వినవచ్చి, ఇప్పుడు తార స్థాయిని అందుకుని, మైక్‌లో అరచినట్లే వినవస్తోంది మీనాక్షి స్వరం

"మీరేం చెప్పకండి అడుక్కుతినే యింటికి నా బిడ్డ వెళ్ళదు మన స్నానాల గదులు కూడా వాళ్ళ పడకటింద్లకు పదింతలు ఘనంగా వుంటాయి"

"మీనా, అలా అరవకు వారు బాధపడతారు ఉమ వారి కోడలు

"మీరింకేం చెప్పవద్దు నేను పంపేది లేదు" ఖచ్చితంగా ఖంగారుగా అన్నది

"అసలు నిన్నడిగేదేమిటి? ఉమను నేను పంపిస్తున్నాను"

"అది ఆ భార్యాభర్తలు నిర్ణయించుకుంటారు" బింకంగా అన్నది, అదివరకే

ఉమకు నూరిపోసిన మీనాక్షి

ఆమెకు కుమా ర్తెపై గల నమ్మకం నిరాధారమైనది కాదు

"ఉమా అలా పారిపోయి వచ్చావేమిటి మా అమ్మవస్తే? పద ఆవిడ ఒక్కతీ కూర్చుంది" అన్నాడు సత్యమూర్తి గదిలోనికి వెళ్ళి

"ఒక్కతే ఏం ఖర్మ? ఉన్నదిగా మీ ముద్దుల మఱదలు?" అన్నది ఉక్రోషంగా

"అఁ కనీసం మర్యాద తెలిసినవారు ఒకరైనా వున్నారు"

"మీ ఇళ్ళమర్యాదలు నాకేం తెలియవు కానీ నన్ను విసిగించవద్దు నేను కాస్సేపు పడుకోవాలి"

"ఉమా! నేను పోట్లాడే రకాన్నీ, విసిగించే రకాన్నీ కాదు అమ్మ మనల్ని తీసుకువెళ్ళటానికి వచ్చింది"

"ఓ!" కళ్ళు చిత్రంగా త్రిప్పింది ఉమ "ఎందుకట? నేను ఆమెకేమౌతాను?"

సమాధానం చెప్పకుండా సత్యమూర్తి ముఖం త్రిప్పుకొన్నాడు

ఆ మౌనం చూచిన ఉమ వాచాలత అధికమైంది

"లోకం దృష్టిలోనే మనం భార్యాభర్తలమనీ, నన్ను భార్యగా చూడలేననీ స్పష్టంగా చెప్పావ్‌కదా? ఇప్పుడేం సంబంధమని నీ యింటికి రాను?"

"ఉమా! జరిగినదానికి ఏమాత్రం సిగ్గుపడినా నువ్విలా మాట్లాడలేవు మీ నాన్నగారి ప్రాణాన్నీ, ఈ యింటి గౌరవాన్నీ నిలబెట్టవలసి "

"అపుజెయ్యి," కసిరింది "మాటిమాటికీ ఆ విషయాలు ఎత్తకు ఈ ధనాన్నీ హోదానీ చూచి చేసుకున్నావ్, మమ్మీ కూడ అలాగే అంది"

"ఉమా!" నివ్వెరపోయినట్లే అన్నాడు

"నేను ఒక్కరోజు నా స్నేహితులకోసం ఖర్చుచేసినంత కాదు నీ నెలజీతం నువ్వు నాకేం జరపగలవ్ సత్యం నీ యింట? ఏమైనా ఆలోచించే రమ్మంటున్నావా? వెళ్ళమను మీ అమ్మను"

"ఉమా!!"

సరిగా అదేసమయంలో శివరావు వచ్చాడు ఉమ ఆఖరి మాటలను మాత్రం విన్న అతడు కుపితుడౌతూ ఆమెను మందలించబోయాడు


"ఉమా! బుద్ధివున్న మాటలేనా అవి? "

ఉంతలో—

"అన్నగారూ!" అని వినవచ్చిన భద్రమ్మ సంబోధనకు అందరూ అటు చూచారు

అన్నీ ఆమూలాగ్రంగా వినివున్నట్లు ఆమె ముఖమే చెప్తోంది అయినాసరే ఆమె పెదవులు చిరునవ్వునే చిందిస్తున్నాయి, కనులు శాంతరసాన్నే వర్షిస్తున్నాయి,

"అన్నగారూ శాంతించండి ఉమ పసిది, చిన్నతనం. అంతే." అంటూ



కుమారుని దెసతిరిగింది

"బాబూ మీరు ఇక్కడున్నా అక్కడున్నా ఒకటే మీరు చల్లగా, ఆనందంగా వుండటం కావాలి నాకు, అంతే నా కారణంగా మీమధ్య పోట్లాటలూ, మనస్పర్థలూ వద్దు వస్తానమ్మా ఉమా ఏమీ మనసున పెట్టుకోకు నీ ఇష్టానికి ఏనాడూ ఆటంకం కలగదు"

ప్రేమగా కోడలి చుబుకంపట్టి ముద్దిడి, శివరావూ సుందరిలవద్ద వీడ్కోలు తీసుకొని వెళ్ళిపోయింది

"ఆగమ్మా నేనూ వస్తున్నాను" సత్యమూర్తి అనుసరించాడు

"ఎక్కడికి?"

"ఇంటివఱకూ దిగవిడచి వస్తాను"

"వెఱ్ఱితండ్రి ఎంతదూరమనీ· అక్కర్లేదు వెళ్ళొస్తానులే నీ పనులు చూచుకో"

సత్యమూర్తి రగిలే మనసును పైకి ప్రదర్శించకుండా నిలబడిపోయాడు స్థాణువులాగా

'ఏ తల్లి ఆదేశానుసారం ఇంతటి త్యాగం చేశానో ఆ తల్లికే అంతటి అవమానమా·'

శివరావు తల భూమిలోనికి కృంగిపోగా శిలలా కన్పట్టాడు.

సుందరి భద్రమ్మను కారువఱకూ సాగనంపి నమస్కరించింది

"నడచి వెళ్ళగలను కదా

అభ్యంతరం చెప్తూన్న భద్రమ్మతో ప్రార్థనా పూర్వకంగా అన్నది సుందరి: "అలా అనకండి నాన్నగారు యిప్పటికే తలెత్తుకోలేకుండా వున్నారు మమ్మల్ని క్షమించండి "

"ఎంత మాటమ్మా సుందరీ? ఎప్పుడైనా వస్తుంటావ్‌గా?"

అంగీకారంగా తల ఊపింది సుందరి, బలవంతంగా కన్నీరు అదిమిపెడుతూ

'ఆ ఇంటిలో, మీ ఆదరణలో ఎల్లప్పుడూ వుండాలనుకున్నాను కానీ నా ఆశలు పునాదులతో కూలిపోయాయి ' అనుకుంటూన్న ఆమె హృదయఘోష సముద్రఘోషను అధిగమించింది

శివరావు చూడలేక చూడలేక చూచాడు సత్యం దెస

దీర్ఘాలోచనలో మునిగివున్నాడు సత్యమూర్తి

"సత్యం!" అతి మంద్రస్థాయిలో సంబోధిస్తూ అతడి భుజంపై చేయివేశాడు "సత్యం! ఒకనాడు ఈ బాధలన్నీ నేనూ అనుభవించాను నీవు చెప్పకుండానే నీ ఇబ్బందులన్నీ నేను గ్రహించగలను అహంభావియైన ధనికురాలికి భర్తగా వుండడం కంటే హైన్యమైన శిక్షలేదు మగవాడికి నీముందు నేను తల ఎత్తుకోలేక ఎంత సిగ్గిలిపోతున్నానో తెలియదు నీకు

"అయితే, ఈ తప్పులేవీ ఉమవి కావు ఆమెను పెంచిన తల్లివి ఉమ కేవలం తెలివి తక్కువది, అమాయకురాలు, అంతే నాకోసం ఆమెను క్షమిస్తూ వుండు ఇందుకు ఏదో ఓ పరిష్కారం నేను ఆలోచిస్తాను "

"మీరింత శ్రమపడి చెప్పాలాండీ? నేను ఎన్నడూ మీకు బాధ కలిగేలా ప్రవర్తించను "

"నాకు తెలుసు సత్యం నీది చాలా ఉన్నత హృదయం "

తన గదిముందునుండి సాగిపోతూన్న సుందరిని ఉమ అటకాయించింది

"అయ్యాయా మర్యాదలు?"

" "

"ఏం, నీకు నాకంటే ఎక్కువ సంబంధం వుందనుకున్నావా వాళ్ళతో?"


"ఎక్కువ సంబంధం లేకున్నా, యింటికి వచ్చిన అతిథిని ఎలా గౌరవించాలో తెలిసిన జ్ఞానం ఎక్కువ వుందనుకుంటాను "

"సుందరీ!"

"ఏం? వెళ్ళి ఆ ప్రశ్నలన్నీ డాడీని అడుగు ఆయన కూడా మీ అత్తగారికి చాలా మర్యాదలు చేశారు "

పళ్ళు నూరుకుంటూ ఉమ వెళ్ళిపోయింది

తన గదిలోకి వెళ్తూన్న సుందరికి అటు బాల్కనీలో ఒంటరిగా నిర్వేదంగా



నిలబడిన సత్యమూర్తి కన్పించాడు

రెండు క్షణాలు ఆలోచించి, అటు నడిచింది

"బావగారూ!"

వెనుదిరిగివున్న సత్యమూర్తి తృళ్లిపడి యిటు చూచాడు

"బావగారు" అని తనలో తాను గొణుక్కున్నాడు

"ఈరోజు జరిగినదానికి అందరి తరఫునా నేను క్షమాపణ కోరుతున్నాను"

"వద్దు సుందరీ వద్దు," కళ్ళకు రెండుచేతులూ అడ్డువుంచుకున్నాడు "నీనుండి నేను అటువంటి మాటలు వినలేను"

"హుఁ!" సుందరి స్వరంలో అవహేళన, "ఔను నాకు తెలుసు మీరు నా మాటలూ వినలేరు, నా స్నేహమూ భరించలేరు, నేనంటేనే అసహ్యం మీకు విషయం తెలియక మీ వెంటబడి మిమ్మల్ని విసిగించాను"

"సుందరీ!" బాధతో విలవిలలాడిపోయాడు సత్యమూర్తి "అటువంటి నిష్ఠూరాలు వద్దు సుందరీ, సున్నితమైన నీ మనసున ముళ్ళు గ్రుచ్చిన పాపిని కానీ ఎటువంటి పరిస్థితులలో అలా చేశానో బహుశః నేను మరణించేలోగా ఎప్పుడైనా చెప్పగలనేమో? ఇప్పుడు మాత్రం నన్నేమీ అడగవద్దు ప్లీజ్—నాతో అసలు మాట్లాడవద్దు" మరి మాటల కవకాశమీయకనే గబగబ వెళ్ళిపోయాడు

24

"ఎక్కడికి వెళ్తున్నావ్?"

సత్యమూర్తి ప్రశ్న విని కూడా విననట్టే తన అలంకరణలో నిమగ్నమై వున్నది ఉమ

సత్యమూర్తి రెట్టించాడు

"నీకెందుకు? నువ్వు రావుగా నాతో?"

"ఎందుకు రాను? వస్తాను పద పిక్చర్ చూద్దాం."

వెగటు సూచించే నవ్వు నవ్వింది

"ఓ! పిక్చర్‌కు తీసుకు వెళ్తావన్న మాట? అంటే—మనం భార్యాభర్తలమేనని అందరికీ నమ్మకం కలిగించటానికా?"

"ఉమా! అలా మాటిమాటికీ రెట్టించడంవల్ల నిన్ను నీవే కించపరచుకుంటున్నావ్ నన్నుకాదు"

"ఔను నిన్ను కట్టుకోవటంతోనే నన్ను నేను కించపరచుకున్నాను భర్త వుండీ లేనిదానిలా రంపపుకోత అనుభవిస్తున్నాను"

సత్యమూర్తి ఆమె ముఖం చూడలేనట్లు వెనుదిరిగి నిలబడి జవాబు చెప్పాడు "నీవేకాదు రంపపుకోత నేనూ అనుభవిస్తున్నాను"

"కారణం నేను కాదు"

"నువ్వే నువ్వు చేసిన పొరపాటు"

"ఏమైనా కానీయ్ కానీ నేనిలా జడపదార్థంలా బ్రతకలేను. కోరికలు చంపుకోని"

"సారీ, నేను నిన్ను భార్యగా చూడలేను"

"ఔను చూడలేవు నాకు తెలుసు నీ మనసులో ఎవరున్నారో? ఆ మాత్రం దానికి అంత గొప్పగా అందరిలో వివాహాని కెందుకు తయారయ్యావ్?"

"ఎందుకో—నీకే బాగా తెలుసు నా కంటే"


తోకత్రొక్కబడిన నాగినిలా ఉమ మరేదో మాట విసిరేలోగా క్రిందినుండి శివరావు సత్యమూర్తిని పిలవడం విన్పించింది

సత్యమూర్తి వెంట ఉమ కూడా వచ్చింది

"ఓ! ఎక్కడికైనా వెళ్తున్నారా? వెళ్ళండమ్మా రాత్రికి మాట్లాడుకోవచ్చు" ఆ జంటను కనులనిండా తనివితీరా చూచుకుంటూ అన్నాడు శివరావు

ఆ వృద్ధుని కనులలో ద్యోతకమౌతూన్న అపారమైన తృప్తిని గమనించిన సత్యమూర్తి తన మానసిక ఆందోళననూ, అశాంతినీ వెనుకకు నెట్టాడు

"లేదండి ఎక్కడకూ వెళ్ళటంలేదు చెప్పండి" అంటూ ప్రక్కకు తిరిగాడు అప్పటికే హాలు దాట ఆవరణలోనికి నడుస్తూన్న ఉమతో తీవ్రంగా అన్నాడు



"ఉమా! నీ గదిలోకి వెళ్ళు ఇప్పుడు ఎక్కడికీ వెళ్ళటానికి వీల్లేదు"

తండ్రి ఎదురుగా ఉండడంతో ఉమ తర్కించటానికీ ఎదురుజవాబు చెప్పటానికీ వీలులేక కోపాన్ని అణచుకుంటూ వెనుదిరిగిపోయింది

అదేదో భార్యాభర్తల చిలిపి తగవుగా భావించిన శివరావు తానేమీ గమనించనట్లే వుండిపోయాడు

శివరావూ సత్యమూర్తీ మౌనంగా నడచి బయట లాన్‌లో కూర్చున్నారు

శివరావు ఏదో చెప్పటానికి బాధపడుతూన్నట్లూ సంశయిస్తూన్నాట్లూ కొంతసేపు శూన్యంలోనికి చూస్తూ గడిపివేశాడు

ఆఖరుకు నిశ్శబ్దాన్ని ఛేదించాడు

"సత్యం! ఉమ తల్లికి దూరంగా వుంటే మారవచ్చుననే ఆశతో మిమ్మల్ని దూరంగా పంపదలచుకున్నాను కానీ నీకు దూరంగా వుండడం నా కెంత బాధో నీకు తెలియదు"

ఆశ్చర్యంగా చూచాడు సత్యమూర్తి

"నిన్ను విజయవాడ బ్రాంచి మానేజర్‌గా నియమించాను అక్కడ మేడ కొన్నాను మీ కోసమే అయితే ఒక రహస్యం—కేవలం మన యిరువురి నడుమనే వుండాలి"

"చెప్పండి"

"మేడ నీ పేరనే కొన్నాను!"

"అదేమిటలా చేశారు?" సహించలేనట్లు అడిగాడు సత్యమూర్తి "నాకు

అటువంటి ఆశలు లేవని మీకు తెలుసు "

"తెలుసు సత్యం కానీ అందరి క్షేమం కోరి అలా చేశాను. పెద్దవాడిని నా మాట కాదనకు "

"బాబుగారూ!" చాలా నీరసంగా వున్నది సత్యమూర్తి స్వరం "మీతో తర్కించగలవాడిని కాను కానీ అంతగా మీరు మాకు యివ్వవలె ననుకుంటే ఉమ పేరనే వుండడం మంచిది కదా?"

"కాదు. ఉమా. మీ అత్తగారూ ఇద్దరిద్దరే ఆలోచన తక్కువ. అలవాట్లు ప్రమాదకరమైనవి ఫలితంగా వాళ్ళు నిరాధారంగా నిలబడేరోజు రాగలదనే భయంతో. నేను ఈ మన కంపెనీని చెరిసగంచేసి నీ పేరనా సుందరి పేరనా వ్రాశాను! మిగిలిన ఆస్తి అంతా మీనాక్షిదే అందులో ఆమె ఒక పైసా అయినా మిగల్చగలదనే ఆశ నాకు లేదు "

"సా ర్!!!"

"బంగారువద్దు సత్యం జాగ్రత్త మంచిదని. అంతే ఉమకుకూడా తెలియ రాదు మగపిల్లల్లేని నాకు నిన్ను దేవుడు ప్రసాదించాడని మురిసిపోతున్నాను నీపై నాకు పూర్తి నమ్మకం వున్నది నీకు ప్రథమంగా మగబిడ్డే పుట్టాలని వెయ్యి దైవాలకు మ్రొక్కుతున్నాను "

'భగవాన్! పుట్టబోయే బిడ్డ ఎవరి సంతానమో తెలిసిననాడు ఈ వృద్ధుడు ఏమై పోతారు?' వణకిపోయాడు సత్యమూర్తి

'వద్దు వద్దు ఏనాటికీ తెలియనీయను అతి ఉన్నత హృదయులైన మీ సంతోషం కొఱకు ఈ నిప్పుల కొలిమిని నేను శాశ్వతంగా హృదయంలో బంధించు కుంటాను ' స్థిర నిశ్చయం చేసుకొన్నాడు సత్యమూర్తి

"మీ అమ్మగారిని రోజూ కలుసుకుంటున్నావా? కులాసాయేనా?"

"బాగానే వున్నారు "

"వారిని ప్రయాణానికి సిద్ధంగా వుండమని చెప్పు నేను ఒసారి కలుసు కుంటాను రేపు ఇలా వున్న ఊళ్ళోనే పెద్దామె ఒక్కరూ వుండడం నాకు చాలా చిన్నతనంగా వుంటోంది "

కొంతసేపు గడచింది

"సుందరికి కూడా నీవంటి వ్యక్తే లభిస్తే ఇక నాకు నిశ్చింత సత్యం!"

సంధ్య చీకట్లు అలముకున్న కారణంగా సత్యమూర్తి ఉలికిపాటును శివరావు గమనించలేదు

"సుందరిలాంటి బిడ్డ ఎంతో పుణ్యాత్ములకు గాని పుట్టదు ఆ తరహాయే వేరు. సుందరిని పెళ్లాడిన వ్యక్తి అదృష్టవంతుడౌతాడు సుఖపడ్తాడు "

శ్రోత ఎదలోని సంచలనాన్ని గమనించకుండా ప్రియపుత్రికను గూర్చిన శ్లాఘ

వచన ప్రవాహం అలా ఎంత తడవైనా సాగిపోయేదే. మీనాక్షి కాదు రయ్యిన దూసుకొని రాకపోతే

మీనాక్షిని చూస్తూనే సత్యమూర్తి లేచి వెళ్ళిపోయాడు

"వీడి కసలు నేను అత్తగారిననే భయభక్తులేమైనా వున్నాయా?" సత్యమూర్తి నిష్క్రమించిన దెసగా కొఱకొఱ చూస్తూ గొణిగింది మీనాక్షి

"ఏమిటి క్రొత్తగా తల క్రిందుల మాటలు మాట్లాడుతున్నావ్? అల్లుడికి భయ భక్తులతో సలాములు చేయాల్సింది అత్త మామలు. ఆ ఆపదకు అతడు మనల్ని గురి చేయడం లేదు అందుకు సంతోషించు"

"మనకు సరా, సాటా? మన కాలిగోటికైనా పోలనివాడు మన అల్లుడైనంత మాత్రాన ఏ ముఖంతో అధికారం చేస్తాడు? అర్హత వుండద్దా దేనికైనా?"

"మీనా!" అసహనంగా లేచి నిలబడ్డాడు శివరావు

"నాపై సాము చేసినట్లు అందరి విషయంలోనూ చెల్లదు నీ ధోరణిని మార్చుకోపోతే చాలా అనర్థాలు కొని తెచ్చిన దానవౌతావు." అంటూనే లోపలికి వెళ్ళిపోయాడు

మేడమీదికి వెళ్ళిపోతూన్న అతడి కనులు అప్రయత్నంగా సుందరి గదివైపు మళ్ళాయి

కిటికీ జాలీని ఆనుకొని శూన్యంలోనికి దృష్టి సారించి అన్య మనస్కంగా వున్నది సుందరి

కన్నతండ్రి హృదయం కలుక్కుమన్నది

'ఏమిటీమధ్య సుందరి యింత మందకొడిగా ఏమిటో బాధపడుతున్నట్లుగా వుంటోంది?'

"సుందరీ!"

"హాఁ డాడీ" ఖంగారుపడుతూ యిటు తిరిగింది

సోఫాలో కూర్చున్నాడు శివరావు

"కాలేజి నుంచి వచ్చాక నాకు కన్పించలేదేం?"

"వెళ్ళలేదు ఇంట్లోనే వున్నాను"

"ఏం?"

" "

"సుందరీ!" ఆ కంఠంలో అమితమైన ఆర్ద్రత "ఏమిటమ్మా అదోలా వుంటున్నావ్? మీ అమ్మ ఏమైనా కోప్పడిందా?"

"ఛ! లేదు డాడీ"

"మరి? కాలేజీకి ఎందుకు వెళ్ళటంలేదు? నా బాగోగులు కనుక్కోవటానికి ఆఫీసుకు కూడా వచ్చేదానవు ఇప్పుడు యింటిదగ్గరైనా కనీసం ఈ ముసలి తండ్రి

ఎలా వున్నాడో చూస్తున్నావా?"

సుందరి కంఠం దుఃఖంతో పూడుకుపోయింది

"పిక్నిక్ నుండి వచ్చాక నువ్వు మారిపోయావమ్మా నీ మనస్సులో ఏముందో తెలియనిదే నేనేం చేయగలను?"

ఏదో ఒకటి చెప్పనిదే తండ్రి వదిలేలా లేరు ఈ రోజు

"నాకు "

"ఊఁ చెప్పు డబ్బేమైనా కావాలా?"

"ఇక చదువుకోవాలని లేదు డాడీ"

"ఏమిటీ!?" అంతకంటే మాట్లాడలేక పోయాడు శివరావు

'ఎమ్మెస్సీ చదువుతాను రీసెర్చి చేస్తాను' అంటూ ఎంతో ఆత్మ విశ్వాసంతో పలికే సుందరి నోట యిటువంటి ధోరణి వంతంగా, ప్రధమ శ్రేణిలో నిలచే సుందరికి ఏమైంది?'

"విద్య సముద్రంలాగా అనంతమనీ, ఎంత చదివినా సమగ్రం కాదనీ ఒకసారి మీరే అన్నారుకదా డాడీ?"

"ఔను"

"ఎందుకో నా మనస్సు చదువుపై లగ్నం కావడంలేదు విహారయాత్రలో మేము ఒక బాబాగారి ఆశ్రమం చూశాం ఎంత ప్రశాంతంగా వున్నదని? ఆయన ఉపన్యాసాలు రెండు మూడు విన్నాం మనం అమూల్యమైన పవిత్రమైన విషయాలను తెలుసుకోకుండా జీవితాలను యిలా వ్యర్థం చేసుకుంటున్నామనుకుంటు "

తండ్రి వదనంలోని భయ విచలతనూ, నీలి నీడలనూ గమనించిన సుందరి ధోరణి ఆగింది

బాధగా మూలుగుతూ లేచి నిలబడ్డాడు శివరావు

"ఇటువంటి యింట కాకుంటే వైరాగ్యం యింకెక్కడ జన్మిస్తుంది? తల్లీ బిడ్డల మధ్య ప్రేమ లేదు, భార్యా భర్తల బంధానికి అర్థమే లేదు"

"లేదు డాడీ నేనెవర్నీ కారణంగా "

వైరాగ్యంగా నవ్వాడు శివరావు "నీవు చెప్పకపోయినా నాకు తెలుసు సుందరీ, నీ మనసులో ఏదో వున్నది అది నేను తీర్చలేనిది—అందుకే నువ్వు నాకు చెప్పడం లేదు"

సమాధాన మీయకుండా నేల చూపులు చూస్తూ వుండిపోయింది సుందరి

"పోనీలేమ్మా, బలవంతంలేదు చెప్పగల విషయం కాదు గనుకనే నీకు అంత బాధ సన్యసించాలనుకున్న సమయాలూ, సన్నివేశాలూ నాకూ చాలా ఎదురైనాయి, కానీ మొండిగా ఈ బండిని లాగుతున్నానే కానీ సాహసించలేదు భవబంధాలను త్రెంచుకొనే తెగింపు మీనాక్షితో కాపురం చేసిన వాడికి లేకపోయినా, కడుపున పుట్టిన వాళ్ళకు లభ్యమైనదని లోకులు చెప్పుకొనే రోజు వస్తుందన్నమాట!" (సశేషం)



ప్రపంచం దేనిమీద నడుస్తోంది?

కొంపెల్ల విశ్వం

ఈ ప్రపంచం దేని మీద నడుస్తోంది?

ప్రేమ మీదా, అనురాగం మీదా, పరస్పర అవగాహన మీదా, జాలిమీదా, కరుణమీదా, మానవత్వం అనబడే దయా గుణం మీదా? దేనిమీద??

* * *

అనుకోకుండా ఇంటి మీద చుట్టాల దాడి జరగటంతో ఏం చేయాలో తోచ లేదు దయానిధికి. వచ్చిన చుట్టాలిద్దరూ కూడ తరచుగా ఎప్పుడూ వస్తూవుండే వాళ్ళు కాదు, నిర్మొహమాటంగా ప్రవర్తించదగినవాళ్ళు కాదు. ఒకడు తన బాబాయి కొడుకు, మరొకడు తన భార్య తమ్ముడూను.

రాకరాక ఇద్దరూ ఇరవై అయిదో తారీఖునే రావటం, సరిగ్గా వాళ్ళొచ్చే సమయానికే ఇంట్లో చాలా సరుకులైపోవటం, కూడబలుక్కున్నట్టు ఇద్దరూ ఒకేసారి రావటం కలవరపెట్టాయి దయానిధిని.

కలవరపడి ప్రయోజనం లేదు కాబట్టి, వచ్చిన వాళ్ళిద్దరినీ ఎంతకాలముంటారు మీరని అడగటం మర్యాద కాదు కాబట్టి— కర్తవ్య నిర్వహణలో పడ్డాడు దయానిధి.

ఫలితమే—

వాళ్ళ ఆఫీసులో రామకోటేశ్వరరావు దగ్గిర యాభై రూపాయిల అప్పు. అప్పు చేసిన యాభైలో ముప్ఫయి రూపాయలు ఖర్చుచేసి ఇంట్లోక్కావలసినవి కొని, మిగిలిన నాలుగు అయిదు రూపాయల నోట్లు జేబులో భద్రంగా దాచుకుని ఇంటి కొచ్చాడు దయానిధి.

దయానిధి ఇంటికొచ్చిన గంటక్కానీ రాలేదు—పనిమీద వెళ్ళిన చుట్టాలిద్దరూ

వాళ్ళొచ్చాక—

ముగ్గురూ కాసేపు కబుర్లు చెప్పుకుంటూ అన్నం తిన్నారు.

అన్నం తిని, ముందుగదిలో కూచుని మళ్ళీ కబుర్లు చెప్పుకుంటున్నప్పుడు—

"దయానిధిగారూ!" అని ఎవరో పిలవటంతో వీధిలోకెళ్లాడు దయానిధి. అతన్ని పిలిచినది జగన్నాధరావు.

"మీరా, ఏమిటిలావచ్చారు?" అంటూ అడిగాడు దయానిధి, జగన్నాధరావుని.

"ఏంలేదండి. మీరేమీ అనుకోనంటే"

"ఫరవాలేదు. చెప్పండి."

"ఇందాకటినుంచీ మిమ్మల్ని అడగాలా

వద్దా అని ఆలోచిస్తున్నాను. ఇంక వేరే మార్గం లేక ఇలా వచ్చేసాను.

"ఓ ఇరవై వుంటే సర్దగలరా, మళ్ళీ ఫస్టుకిచ్చేస్తాను." అడగలేక అడగలేక అడిగాడు జగన్నాధరావు.

"ఇరవయ్యా!" అంటూ ఆలోచనలో పడ్డాడు దయానిధి.

"అవునండి. మరో అవసరానికీ మరో అవసరానికీ అయితే ఇలా వచ్చేవాణ్ణికాదు. కానీ ఇంట్లో బియ్యం నిండుకున్నాయండి. మా రెండోవాడు ఇంతవరకూ ఆకలని గోలపెట్టి ఇప్పుడే నిద్రపోయాడు. కనీసం రేపొద్దున్నైనా ఇంట్లో వాళ్ళకి ." ఆ పైన మాట్లాడనేలేక పోయాడతను

"ఉండండి. ఇప్పుడేవస్తాను!"అంటూ లోపలికెళ్ళి జేబులోని నాలుగు అయిదు రూపాయలనోట్లలో మూడు తీసుకునివచ్చి జగన్నాధరావుకిస్తూ అన్నాడు దయానిధి—

"నే నింతకన్న సర్దలేను. ఏమీ అనుకోకండి!"

"అదేమిటండీ, ఈ మాత్రం సహాయం చేశారు. అదే పదివేలు!" అంటూ పదిహేను రూపాయలు తీసుకుని, మరో సారి కృతజ్ఞతలు చెప్పుకుని వెళ్ళి పోయాడు జగన్నాధరావు.

కాసిన్ని మంచినీళ్ళు తాగుదామని వంటింట్లోకి వెళ్ళిన దయానిధిని భార్య.

"ఎందుకొచ్చాట్ట?" అంటూ అడి గింది, ముద్ద నోట్లో వుండగానే.

డిటెక్టివ్ పుస్తకాలు కూడ ముందుగా చివర రెండు పేజీలు చదివి, సస్పెన్సే మిటో తెలుసుకున్న తర్వాతకానీ పుస్తకం చదవటాని కొప్పుకోని తత్వం ఆమెది. ఆ సంగతి బాగా తెలుసు దయానిధికి. అందుకే ఆమె పక్కగా పీట వాల్చుకుని కూచుని స్వరంతగ్గించిఅన్నాడుదయానిధి.

"ఏముంది? మనకొచ్చిన అవసరం లాటిదే! యింట్లో బియ్యం అయిపోయా యట!"

"సరే! ఆకులు నాకే వాళ్ళింటికి—"

"సర్లేగానీ మనం అప్పు చేశాం చూడు—రామకోటేశ్వర్రావు. అతని వేళ పొద్దుటే మరెవరిదగ్గరో ఓ వంద తీసుకొన్నాట్ట. ఆ వందలోంచే మనకో యాభై ఇచ్చాడు. మన యాభైలో మనం జగన్నాధరావుకి పదిహేనిచ్చాం. అంచేత .."

ఇంకా ఏదోచెప్పపోయాడు దయానిధి. చెప్పనీకుండా అడిగింది అతని భార్య—

"అయితే మీ స్నేహితులు, పరిచయస్థులు అందరూ కూడ అప్పుమీదే బతుకుతున్నా రందురూ!"

"నువ్వొక్కర్తెవో పిచ్చిదాన్లా వున్నావ్ అలివేలూ! మన పరిచయస్థులూ, స్నేహితులూ అన్న మాటేమిటి? ఇంచుమించు అంతా అప్పుమీదే బతుకుతున్నారు. అంతెందుకు? ఓ చిన్నదేశం వుందనుకో. కాస్త పెద్దదేశం దగ్గర అప్పు చేస్తుంది. ఆ పెద్దదేశం, ఇంకాస్త పెద్దదేశం దగ్గర అప్పు చేస్తుంది. పైగా చిన్నా పెద్దా దేశాలన్నిటికీ అప్పు లివ్వటానికి ప్రపంచ బ్యాంకు వుండనే వుంది. అంచేత ఈ అప్పుల గురించి నువ్వాట్టే మనసులో పెట్టుకోకు!" అనేసి ముందు గదిలోకెళ్ళి పోయాడు దయానిధి.

* * *

ఈ ప్రపంచం దేనిమీద నడుస్తోందో పాఠకులకు చెప్పవలసిన అవసరం ఇంకా వుందని—నేను అనుకోను.

దేవుడి కధకి మానవుడి ముగింపు



యస్. కాశీవిశ్వనాధ్

ఇది ప్రేమ కధకాదు.

అయినా ఇందులో ఓ అమ్మాయి వుంది. ఆ అమ్మాయి కాళ్ళలో సంగీతానికి నర్తించే శక్తి వుంది. మెరుపుల్ని కళ్ళలో నిలుపుకుని కమ్మగా నవ్వే శక్తి వుంది.

అదిగో ఆ అమ్మాయే నా కధకి నాయిక.

నాయిక పేరు—రాణి!

ఆ రాణికి పదకొండు ఇళ్ళతోగూడిన ఓ చిన్న సామ్రాజ్యం వుంది. ఆ పదకొండు ఇళ్ళలో ఏ ఇంట్లో ఎప్పుడు ఏ భోజనం చేస్తుందో ఆమెకే తెలియదు.

ఇన్ని వున్న రాణికి వయసెంతో చెప్పలేదు కదూ—రాణి వయసు పదకొండు!

అవును. ఆమె వయసు పదకొండే!

అయితే పదకొండేళ్ళ అమ్మాయి చుట్టూ నా కధ ఎందుకు తిరిగిందని విజ్ఞులడగొచ్చు.

ఒకసారి, అంటే దాదాపు రెండేళ్ళ క్రితం నేను మా అక్కగారింటికి ఓ పని మీద వెళ్ళినప్పుడు రాణి తారసపడింది.

ఓ మధ్యాహ్నంవేళ మా అక్కయ్య గారి క్వార్టరు ముంగిట్లో నీడకోసం వేసిన కమ్మలపాక కింద కూర్చుని నాటకం రాసుకుంటున్నవేళ అల్లంత దూరాన పది పన్నెండుమంది జనంవున్న గుంపు మధ్య చకచక నృత్యం చేస్తున్న ఓ అమ్మాయి కనిపించింది.

అది శాస్త్రీయ నృత్యమని అనను—అలాగని పిచ్చివాడి దాట్లు అనిగూడా అన లేను.

ప్రేక్షకుడికి నేత్రపర్వంగా, హృదయ రంజకంగా కదులుతున్న అడుగులకి నృత్యమనే అంటాన్నేను.

ఓ అయిదు నిమిషాల తర్వాత ఆ గుంపులో నేనూ ఒకణ్ణి కాకతప్పనప్పుడు, నా ప్రవేశం ఎలా గమనించిందో ఏమో, రాణి వేస్తున్న అడుగులు ఆగిపోయి, తుపాకి శబ్దం విన్న పాలపిట్టలా రివ్వు మంటూ ఎటో పారిపోయింది. చుట్టూ జేరిన ఆడంగులుగూడా ఎవరి క్వార్టర్సు లోకి వారు వెళ్ళిపోయారు.

హృదయానందంకోసం వెళ్ళిన నేను, వారికి రసాస్వాదనకి భంగం కలిగించా నేమోనని సంశయపడుతూనే, ఆ సంశ యాన్ని సాయంత్రం టీ సమయంలో మా అక్కయ్యతో అంటే, "అదేం లేదు లేరా, రాణీ డేన్సు మాకు కాణీ ఖర్చులేని కాలక్షేపం. అది రోజూ అలా గెంతు తూనే వుంటుంది. మేం చూస్తూనే వుంటాం" అంది.

తర్వాత నేను మా అక్కనడిగి రాణి గురించి తెలుసుకున్న వివరాల సారాంశం ఇది.

రాణికి తల్లీతండ్రీ ఎవరో తెలీదట.

అక్కడున్న క్వార్టర్సులో ఎవరింట్లో నైనా జొరబడిపోగల స్వాతంత్ర్యంతో పాటు వారింట్లో అంట్లు తోమే బాధ్యత, అందుకు ప్రతిగా ఆ పూట కాసిన్ని మెతు కులు తినగలిగే హక్కు ఆమెకున్నాయి.

ఇంకా చాలా చాలా వివరాలు విన్నాను. అయితే ఇదేదీ, నా కలానికి కదలిక నేర్పర్చలేదు.

రాణి మూగది!

రాణి చెవిటిది!


ఈ రెండూ రెండూ నమ్మలేని నిజాలు—కానీ, కల్తీ లేని వాస్తవమే ఇది.

తెల్లగా, మెత్తగా వుండే సిల్కు దారాలతో నేసిన పత్రంలాంటి దేహంతో మెరిసిపోయే రాణి మూగది, చెవిటిది.

చెయ్యి తిరిగిన శిల్పకారుడు తనకోసం ప్రత్యేకించి తయారుచేసుకున్న బొమ్మ లాంటి రాణి మూగది, చెవిటిది.

భక్తులు సైతం భగవంతుణ్ణి నిందించే యీ వెలితి నన్ను బాగా కదిలించింది. రైలుపట్టాలమీద అడుగులో అడుగేసి నడవడంలో ఆనందం పొందే రాణి చెవు లకి రైలుకూతలే వినిపించకుండా కొన్ని సార్లు రైలుకింద పడబోయినప్పుడు— ఆమె చెవులకి ఏ వింత సంగీతం విన్పించి ఆ కాళ్ళనలా నర్తింపజేస్తు న్నాయి.

బహుశా ఆమె మనసులో ఆమెకు



మాత్రమే విన్పించే ఏదో ఓ సంగీతం మ్రోగుతుండాలి. మనసులోని సంగీతానికి మనిషి కదుల్తోంది.

ఆ మర్నాడు నా కోరికమీద మా అక్క రాణిని ఇంటికి పిల్చింది. నేను రాణిని డేన్సు చెయ్యమని బ్రతిమలాడాను. ఊఁహూ లాభంలేకపోయింది. సిగ్గుతో మెలికలు తిరిగిపోయింది. రేడియో వేశాను. రాళ్ళను సైతం ఎగిరి గంతు వేయించే సంగీతం వినిపించింది. తనో ప్రశాంతమైన, నిశ్శబ్దమైన స్థలంలో ఒంటిగా వున్నట్టుగా కూర్చుందే తప్ప, రేడియోలోనించి ఓ సంగీతం వస్తున్నదన్న ధ్యాసే లేదామెకు.

"దీన్ని ఆడించడాని కొకటే మందుంది—" అంటూ మా అక్క ఆ పొరుగు క్వార్టర్లో వున్న అమ్మాజీ అనే ఓ అమ్మాయిని పిల్చుకొచ్చింది. అమ్మాజీ గూడా రాణీ వయసుదే! అమ్మాజీ వచ్చి ముందు రాణీని పాడమంది—రాణి పాడలేదు.

"పాడకపోతే నీ జట్టుండను ఫో" అన్నట్టుగా సౌంజ్ఞ చేసి బెదిరించింది అమ్మాజి. అంతే! రాణిని ఎక్కణ్ణించి ఏ ఆవేశం కదిలించిందోగాని తనకి తోచిన విధంగా ఓ పది నిమిషాలపాటు డేన్సుచేసి చేసి, చేస్తూనే ఏడుస్తూ అంతలోనే తుర్రుమంటూ బయటికి పారిపోయింది.

భగవంతుడు భక్తికి లొంగిపోయినట్టు రాణి స్నేహానికి లొంగిపోయింది.

"ఇలాంటి అమ్మాయిలకి డేన్సు నేర్పిస్తే చాలా బావుంటుంది కదరా?" అంది మా అక్క.

"ఎలా వీలవుతుందక్కా? రాణీ చెవికి ఏమీ వినబడదు. ఏ శబ్దమూ వినలేని రాణి ఎలా లయబద్ధంగా నాట్యంచెయ్యగలదు?" ఇది నా సమాధానం.

అయితే యీ సమాధానం ఆమెను సంతృప్తిపరిచిందేమోగాని నాలో మాత్రం చాలా అసంతృప్తిని రేపింది.

అక్కడున్న నాలుగురోజుల్లోను రాణి పట్ల నేను చూపించిన ఆసక్తిని చూసి

"చూడబోతే రాణీని ఏదో కథలో ఇరికించేసేటట్టున్నావే" అంది మా అక్క.

నేను రాసిన కథల్లో ఎప్పుడూ ఆ వయసు అమ్మాయి బ్రతకలేదు.

అయినా రాణి గురించి అంతవరకు నాకు తెల్సింది రాస్తే అది ఓ స్టేట్‌మెంట్ అనిపించుకుంటుంది గాని కథ అనిపించుకోదు.

కథకి ఓ మలుపు కావాలి.

రాణిచుట్టూ కథని తిప్పి ఏ మలుపు యివ్వాలి? అసలు రాణి నా కథలకి వస్తువు కాగలదా? ఈ రెండు ప్రశ్నలూ నేను విశాఖపట్నం తిరిగొచ్చేసిన చాన్నాళ్ళ వరకు నా మనసులో బ్రతికేయి.

మా అక్క రాసే ఉత్తరాల్లో అప్పుడప్పుడు రాణి ప్రస్తావన వచ్చేది: "మీ డేన్సింగ్ హీరోయిన్ మొన్నామధ్య పెద్ద మనిషయితే, మా ఇంట్లోనే కూర్చోబెట్టాను" అంటూ వచ్చిన ఓ ఉత్తరం నాకు విచిత్రమైన అనుభూతి కలిగించింది.

రాణి పుష్పవతయిందా?

అయితే, ఇంకా డేన్స్ చేస్తోందా? ఇంకా అందరిళ్ళల్లో అంట్లు తోముతోందా? ఇంకా లేడిపిల్లలా పరుగులు తీస్తోందా? ఇక నా సంశయాలు. ఆ వూరు

వెళ్ళి రాణిని చూడాలని దాదాపు నెలకో సారైనా అనిపించినా, దాదాపు ఏడాది న్నరవరకు వెళ్ళడం పడలేదు.

ఈ సారైనా వెళ్ళకపోయేవాణ్ణి — వెంకట్ బలవంతం చెయ్యకపోతే!

వెంకట్ ఓ ప్రఖ్యాత తెలుగు సినిమా సంస్థలో సహకార దర్శకుడి హోదాలో చాలా అనుభవం గడించాడు. ఇప్పుడు వాడికి సొంతంత్రంగా ఓ చిత్రం డైరెక్ట్ చేసే అవకాశమొచ్చి ఓ వినూత్న పంథాలో వున్న కథ కోసం వెదుకుతూ మా వూరొచ్చి నన్నడిగితే నేను మాటల సందర్భంలో రాణిని గురించి చెప్పాను. రాణిని ఆలంబనం చేసుకుని ఓ కథని బెంగాలీ చిత్రం మాదిరి తెలుగు చిత్రం తీయడానికి అనువుగా చెప్పాను. ఆ కథ వాడికి నచ్చినట్టే అనిపించింది కాబోలు 'ముందా అమ్మాయిని చూపించు" అని పట్టుబడితే వున్నపళంగా ఆ వూరికి బయలుదేరాం.

అకస్మాత్తుగా వచ్చిన నన్నూ, మా వెంకట్‌ని చూసి అక్క ముందు ఆశ్చర్య పోయినా వెంటనే ఆతిథ్యం ఇచ్చింది.

మేం వచ్చిన పని చెప్పి రాణిని వెంటనే పిలిపించమన్నాను.

దానికి మా అక్క "నెల్రోజుల్నుంచి నీకీ విషయం వుత్తరంలో రాద్దామను కుంటూనే మర్చిపోతున్నాను" అంటూ ఆ విషయాన్ని చెప్పింది.

ఆ విషయంలోవున్న విషాదం ఒక్క క్షణం నా గుండెని స్థంభింప జేసింది. నాకేగాదు మనసున్న ప్రతి మనిషి ఆ అనుభూతికి లోనవుతాడేమో!

రాణి చచ్చిపోయింది!

లేత ఎండ వెలుగులా మెరిసి, ఇంద్ర ధనుస్సులా అందాలీనే రాణి చచ్చి పోయింది.

రాణి రైలుక్రిందపడి చచ్చిపోలేదు.

రాణి జబ్బుచేసి చచ్చిపోలేదు.

మరెలా చచ్చిపోయింది?

రాణి గర్భవతిగా మరణించింది!!

ఆ అందాల బొమ్మని ఏ కసాయి గుండె అలా బ్రద్దలు చేసిందో ఎవరికీ తెలియదట — ఏడునెలలు గర్భాన్ని మోసిన రాణికీ ఆ పాపాన్ని ఆమెలో ఎవరు ప్రతిష్టించారో తెలియదట.

నొప్పులొచ్చేదాకా బరువుగా తిరుగుతూ, మెల్లిగా కదుల్తూ చల్లగా నవ్వినా, ఏడునెల్లకే నెప్పులొచ్చి, ఆ బాధలో మెలికలు తిరిగి తిరిగి—ఈ ప్రపంచం నించి ఎక్కడికో ఎగిరిపోయింది రాణి.

"ఈకథ నీ సినిమాకి పనికొస్తుందా?" అన్నాన్నేను వెంకట్‌తో.

"పనికిరాదు. నా కథలోని రాణిని అంతర్జాతీయ నాట్యసుందరిగా మలుచుదా మనుకున్నాను కానీ ..."

అవును! నేనో, మరో రచయితో రాసిన కథలోని పాత్రనైతే మా ఇష్టాను వర్తంగా మార్చుకోవచ్చు.

కానీ—యిది దేవుడు రాసిన కథ. ఇటువంటి దారుణమైన ముగింపుల్ని ఆ దేవుడు తప్ప మరో మనసున్న రచయిత ఇవ్వలేడేమో!

అందుకే దేవుడనేవాడు ఎప్పుడైనా కనిపిస్తే "దేవుడా! నువ్వు రాసే కథల ముగింపుల్ని మా కొదిలెయ్" అని అడగాలనుంది.

***

కొయ్యగుర్రం

ఎమ్.హెచ్.వి. సుబ్బారావు

ఈ విశాల ప్రపంచంలో విశాల ప్రపంచం నిజానికి ఏమంత విశాలమైంది కాదు. ఆ ప్రపంచం యావత్తూ ఆమెకున్న ఒక్కగానొక్క ముసలితల్లి! కాదంటే చిన్నతనాన్నే వూళ్ళట్టుకు పోయి ఉన్నాడో వూడాడో కూడా తెలీని ఓ అన్నా! అంతే!

విశాల తండ్రి పరలోకానికి పోతూ పోతూ ఆ ఇంట్లోవున్న ఒక్క విలువైన వస్తువూ, మంగళసూత్రం, పట్టుకెళ్ళాడు. ఇక విశాల తల్లి రమణమ్మకి మిగిలిందల్లా పుట్టింటి తరపున ఆమె తెచ్చుకున్న రెక్కలూ, అత్తింటి తరపున భర్త ప్రసాదించిన ఆర్నెల్ల కడుపూను. ఆ కడుపు చేత్తో పుచ్చుకుని, ఆ రెక్కల్ని కరగదీసి విశాలని పదహారేళ్ళ దాన్ని చేసింది రవణమ్మ.

రవణమ్మ 'మొండి'దన్నారు కొందరు. రవణమ్మ 'గట్టిపిండం' అన్నారు మరి కొందరు. కొందరు 'రవణమ్మకి ఆశ జాస్తీ, చేసే పని కొంచెం దండుకునేది ఎక్కువ అన్నారు. మరికొందరు సిగ్గులేని మనిషి; అస్తమానం దేవిరిస్తూంటుంది అన్నారు.

ఎవరేమన్నా రవణమ్మ పట్టించుకోలేదు. పిండి రుబ్బింది. నీళ్ళుమోసింది. అప్పడాలు వత్తింది. ఆవకాయ పెట్టింది. పండక్కీ పబ్బానికీ పిల్చినా పిలవక పోయినా హాజరయింది. అతిథుల్ని సత్కరించింది. అడ్డమైన చాకిరీ చేసింది. ఇంటి మనిషిలా ఎవరింట పనిచేస్తే వారికి సమస్త సౌకర్యాలు సమకూర్చి పెట్టింది. తరవాత తనకీ కూతురికీ ఆ పూట గడుపుకుని తృణమో, పణమో యిచ్చినంత పుచ్చుకుని వెళ్ళింది.

విశాల రవణమ్మతో చిన్నతనాన్నించీ నీళ్ళు మోసిందిగాని నిందలు మొయ్యలేదు. అప్పడాలు వత్తిందిగాని అడుగులకు మడుగు లొత్తలేదు.

రవణమ్మ చాకిరీ చేసే ఇళ్ళ యజమానుల్లో రకరకాల వాళ్ళుండేవాళ్ళు. యువకులు, మధ్య వయస్కులూ, ముసలివాళ్లూ. కాని అందరూ రవణమ్మని మాత్రం గౌరవంగానే చూసేవారు. ఇల్లాళ్ళు ఆశపోతనీ. అదనీ ఇదనీ సణుక్కున్నా, యజమానులు మాత్రం రవణమ్మని ఏ మాత్రం చౌకబారు దృష్టితో చూసేవారు కారు. వాళ్ళ దృష్టిలో ఆమె చిన్నతనంలోనే భర్తని కోల్పోయినా, దక్షతతో, సమర్ధతతో సంసారాన్ని నడుపుకుని పిల్లల్ని పెంచి పెద్దచేస్తూన్న మాతృమూర్తి..కాని విశాలని చూసేసరికి మాత్రం ప్రతివాళ్ళకీ బుద్ధులు వెర్రితలలు వేసేవి.



ఏవే కోడలా! అనీ, ఏవే మనవరాలా! అనీ వెలికి నవ్వులు నవ్వుతూ పలకరించే వాళ్ళే ఎక్కువమంది వుండేవాళ్లు. చనువు చాటునా, ముసలాళ్ళలో వుండే వరసలుపెట్టి పిల్చుకునే అలవాటు చాటునా వాళ్ళు తమ లేకి బుద్ధుల్ని దాచుకోవాలని చూపినా వాళ్ళ వెకిలి నవ్వుల వెనకాల నగ్నంగా వాళ్ళ నిజస్వరూపం బైటపడేది.

లోపల కుళ్ళు బుద్ధులు ఎలా వున్నా పెద్దవాళ్ళు రవణమ్మకీ, ఆమె కుటుంబానికీ ఇస్తున్న మర్యాదనిబట్టి ఆ వూరి కుర్రవాళ్ళు విశాలని 'యిన్‌యాక్సెసిబుల్' క్రింద జమకట్టేశారు.

రవణమ్మ కష్టాలు పడింది. గనుక నిత్య శంకితురాలు. తన కూతురు ఉత్త అమాయకురాలు. ఒకటి అంటే పది అనడం తెలుసుగాని యీ జీవితంలో నెగ్గుకు రావడం ఎట్లాగో తెలీనిది.

అందుకే రవణమ్మ విశాలని గూర్చి ఆలోచించినప్పుడల్లా భయంతో వళ్ళంతా వణికిపోతుంది.

తనకంటి వెలుగు యీ ప్రపంచానికి ఎదురునిల్చి పోరాడగలదా?

"మనం బీదవాళ్ళం తల్లీ! కొంచెం జాగ్రత్తగా వుండాలి." అని మందలించేది రవణమ్మ.

విశాలకి చిర్రెత్తుకొచ్చేది. బీదవాళ్ళు అయితే! తమకెవరూ ధర్మంగా ఏమీ ఇవ్వ

ఢం లేదుగా! ఇంత హీనంగా చూడబడుతూ మళ్ళీ వీళ్ళ ఇళ్ళలోనే ఎందుకు పనిచేయాలో? ఆ మాటే అనేది తల్లితో.

"ఛా!ఛా! ఏం బ్రతుకమ్మా ఇది! అస్తమానం బీదవాళ్ళం బీదవాళ్ళం అని వంగి వంగి దణ్ణాలుపెడుతూ యీ పనులు చేయకపోతేనేం! ఎక్కడైనా హాయిగా కూలీ నాలీ చేసుకుని బ్రతకగూడదూ!"

"పిచ్చితల్లీ! ఇప్పుడు మనం చేస్తోంది అదికాక ఇంకేమిటమ్మా!?"

"అదిగాదమ్మా! పొలాల్లో పనులు చేసో, రాళ్ళుకొట్టో ఈ చాకిరీ ఇంకో చోట చేస్తే బ్రతకలేమా?"


"అక్కడ మాత్రం మనుషులుండరా, తల్లీ! ఇంకా అంతకన్నా ఇదేనయంగదూ! గృహస్తులు సాటి కులస్తులు. పిల్లా పాపా వున్నవాళ్ళు. కొంచెం జంకూ, గొంకూ, పాపభీతీ, దైవభీతీ వుంటాయి. ప్రపంచమంతా అంతేనమ్మ రెండే తెగలు డబ్బున్నవాళ్ళా లేనివాళ్ళా పేదవాళ్ళు తమ మర్యాద కాపాడుకోగలిగేది తమ మంచితనం ద్వారానేనమ్మా! పోరాడి మనం ఏమీ సాధించలేము. డబ్బున్నవాడు లేనివాడిని అన్ని విధాలా దోపిడీ చెయ్యాలనే చూస్తాడు. అది వాడి సహజగుణం."

తల్లివాదం ఏమిటో విశాలకి సరిగ్గా అంతుబట్టలేదు. డబ్బున్నవాళ్ళంతా దుర్మార్గులని అంటూనే, వాళ్ళకి అణిగి మణిగి వుండడం ద్వారానే మన మర్యాద కాపాడుకోగలం అంటుంది. ఎంత వెర్రిది తన తల్లి. మన మంచితనం వాళ్ళలో జాలిని రేకెత్తిస్తుందని భ్రమపడుతోంది. కాని అదే వాళ్ళకి నిస్సహాయతకింద గోచరించి వాళ్ళని మరింత ప్రేరేపిస్తుందని వూహించలేకపోతోంది సత్తెకాలపు అమ్మ.

అయినా అసలు ధనవంతులంతా దుర్మార్గులన్న అభిప్రాయంతో విశాల ఏకీభవించదు. తన తల్లి వృత్త అమాయకురాలు. తను పనిచేసే ఇళ్ళవాళ్ళంతా ధనవంతులనుకుంటోంది ..తనకి తెలుసు వాళ్ళ అసలు స్వరూపం ..తమ ముందరే వాళ్ళ దర్జాలూ, హోదాలూ, అధికారాలూ అన్నీనూ. వాళ్ళ ఇళ్ళ పరిస్థితులు చూస్తే ఘోరం. ఒకటి వుంటే ఒకటి వుండదు. అన్నిటికీ తడుముకోవలసిందే. చిన్నపిల్లగా వాళ్ళమధ్య తిరిగి వాళ్ళ స్థితిగతులన్నీ అర్థం చేసుకుంది గనక తనకి తెలుసు. నెలాఖరు వచ్చిందంటే చాలు వాళ్ళ ఇళ్ళకీ వీళ్ళ ఇళ్ళకీ చేబదుళ్ళకి వెళ్ళడం, ఎవరైనా అతిధులు వస్తే మంచాలు, పక్కలూ దగ్గర్నించీ అరువు తెచ్చుకోవడం. కార్యాలూ, కరామత్తులూ అయితే కంపనబడ్డ కాకుల్లా అప్పులకి తిరగడం .... పెళ్ళిళ్ళలో అనుకున్న సొమ్ము ముట్టకపోతే రసాభాసులు ..ఛీ! ఛీ! వీళ్ళా డబ్బున్నవాళ్ళు? ఒకళ్ళకయినా వీళ్ళలో కారుందా? కారుదాకా ఎందుకు? ఫ్రిజ్ వుందా? రేడియోగ్రాం వుందా? వాషింగ్ మెషిన్, మిక్సర్ ....ఏం వున్నాయని?

విశాలకి యీ పై యంత్రాలేకాక యింకా చాలా తెలుసు. డబ్బున్నవాళ్ళు అనిపించుకోగలిగే అర్హత గలవాళ్ళు ఎలా వుండాలో ఆ పిల్లకి క్షుణ్ణంగా తెలుసు. పెద్ద బంగళా, ఇంటి ముందో

ప్రేమించి చూడు....ఒక లేడీ క్లర్కును!



గూర్ఖా, విశ్వాసపాత్రులైన నౌకర్లూ, దయతో చలించిపోయే స్వభావం, ధనాని కతీతమైన మమతలు....హృదయాల్లో నవనీతం దర్జా ... హుందాతనం .. అసలు అన్నీవున్న విత్తశ్ళలాగే వాళ్ళు చాలా ఉదారంగా వుంటారు. డబ్బుకోసం అడుగడుక్కీ కక్కూర్తి పడరు. వాళ్ళ కళ్ళకి బీదరికం ఓ అపరాధంలా కనిపించదు.

ఎంతమంది కలవాళ్ళ అబ్బాయిలు బీద వాళ్ళని ప్రేమంచడంలేదు?

అనిల్ ఏం చేశాడు? ఎవర్నీ లెక్క చెయ్యకుండా సుజాతని పెళ్ళి చేసుకోలేదూ? అశోక్ మాత్రం! కన్నతల్లిలా చూసుకున్న వదినగారి ఆత్మీయతనైనా కన్నీళ్ళతో వదులుకున్నాడుగాని అరవిందని కాదన్నాడా? విహ్వాల్‌ని పాపం అతని మేనగోడలు లావణ్య నిజానికి ఎంత మనస్ఫూర్తిగా ప్రేమించిందో! కాని ఏం లాభం? లావణ్యకూడా డబ్బున్నదే అయిపోయింది. విహ్వాల్ లావణ్యని పెళ్ళిచేసుకుంటే అతనిలోనే ప్రాణాలన్నీ నిలుపుకున్న బీదపిల్ల లక్ష్మి గతి ఏం కావాలి? విహ్వాల్ లక్ష్మిని పెళ్ళి చేసుకుని పవిత్ర ప్రేమకి విజయం సాధించి పెడతాడో, లావణ్యని చేసుకుని డబ్బుకి దాసోహం అంటాడో యీ వారం తేలిపోతుంది.

ఆలోచనల్లో తేలిపోతూ విశాల హెడ్మాష్టారి ఇంటికి వెళ్ళింది.

విశాల వెళ్ళేసరికి రవణమ్మ హెడ్మాష్టారి ఇంట్లో వడియాలు పెడుతూంది. హెడ్మాష్టారి భార్య పక్కనే కూర్చుని కబుర్లు చెబుతోంది.

"ఏమమ్మా! రవణమ్మా! ఈమధ్య కొత్తగా మా స్కూల్లోకి రైటర్‌గా వచ్చాడు చూడు. కుర్రాడు. పాపం, వెనకా ముందూ ఎవరూ లేరట. మీ శాఖే. మన విశాలకి అడగమన్నావా మీ అన్నయ్యగార్ని" అంటోంది.

"ఏదోనమ్మా! మీ దయ. మీకంటే నా కెక్కువ తెలుసునా ఇలాంటి విషయాల్లో. ఏదో ఆ నిశ్చయం చేసేసి మూడు ముళ్ళూ మీ చేతుల్తోనే వేయించేస్తే— ఇహ నా ఒక్కపొట్ట- తిన్నా వెళ్ళిపోతుంది, తినక పోయినా వెళ్ళిపోతుంది" అంటోంది రవణమ్మ.

విశాల అవేవీ వినలేదు. పరుగుపరుగున వచ్చి "పిన్నిగారూ! పిన్నిగారూ! అతను బీదపిల్లని చేసుకోడానికి ఒప్పుకుంటాడా?" అంది.

హెడ్మాష్టరుగారి భార్య క్షణం కొయ్య బారిపోయింది. తర్వాత మొహం ముడుచు కని "నాకు తెలీదమ్మా! వెళ్ళి మీ మాష్టార్ని అడుగు" అంది. రవణమ్మగారి మొహం తెల్లగా పాలిపోయింది.

విశాల విసుగ్గా "అబ్బ! అసలు మాష్టారు ఈ గొడవ పట్టించుకోరు పిన్ని గారూ! మీరే చెప్పండి! అతను తన మేన గోడల్ని చేసుకోడా?" అని అడిగింది.

ఈసారి హెడ్మాష్టారి భార్యలో కొంచెం ఉత్సుకత తొంగి చూపింది.

"మేనకోడలా! అలాంటి వాళ్ళెవరూ వున్నట్లు మీ మేష్టారు చెప్పలేదే!"

"అబ్బ! మాష్టారికేం గుర్తుంటుంది పిన్నిగారూ! విహ్వాల్‌కి లావణ్య అనే మేనగోడలు లేదూ!"

"విహ్వాలా! అతనెవరూ?! యీ కుర్రాడి పేరు ఆంజనేయులు."

"అయ్యో! ఖర్మ! మీతో నా కెందుకు గానీ నిన్న వచ్చిన వీక్లీ పడెయ్యండి. నేనే వెళ్ళి చదువుకుంటాను" అంటూనే టేబుల్ మీదున్న వీక్లీ తీసుకుని వెళ్ళి పోయింది విశాల.

రవణమ్మ జీవంలేని చూపులు చూస్తూ "అమ్మాయి మాట్లాడిన మాటలు నా కొక్కటీ అర్థం కాలేదమ్మా ... ఎందు కలా మాట్లాడుతోంది ... ఏమైనా ..." అంటూ మధ్యలో ఆపేసింది.

"ఆఁ! ఏఁవీ లేదు! ఇప్పుడు విశాల చెప్పిందంతా పత్రికలో సీరియల్ గురించి. నాకూ ఇప్పుడే అంతుపట్టింది . అదో మాలోకం. నువ్వు పనికానీ. మరేం బెంగెట్టుకోకు. మీ అన్నయ్యగారితో చెప్పి ఈ సంబంధం నేను రైటు చేయిస్తాగా" అంటూ అభయమిచ్చింది హెడ్మాష్టారి భార్య.

*　　*　　*

పనిలేని వేళల్లో అమ్మలక్కలు విశాల దారిద్ర్యంపట్ల సానుభూతినీ, ఆమె అందం పట్ల ప్రశంసనీ వ్యక్తం చేస్తూండేవారు అప్పుడప్పుడూ.

"పిల్లకేం. కన్నూ ముక్కూ తీర్చిదిద్ది నట్లుంటాయి. బంగారు బొమ్మలా గుంటుంది" అని అందరూ అంటూవుంటే ఓమాటు అద్దం చూసుకుంది విశాల.

"నేను అందంగా వుంటానా? ఓహో! అందంగా వుండడం అంటే ఇదేకాబోలు" అనుకుంది.

అప్పటినించీ రోజుకో మాటైన

జ్యోతి

ప్రేమించి చూడు....ఒక సినీతారను!



అద్దంలో చూసుకుని "నేను అందంగానే వున్నాను" అనుకునేది. తనతోటి పిల్లల్ని అద్దంలో తనపక్క వూహించుకుని చివరికి కొన్నాళ్ళకి "నిజంగా నేను అందంగా వుంటాను" అనే నిశ్చయానికి వచ్చేసింది.

అప్పటినించీ రోజూ అద్దంలో చూసుగోడం విశాలకి దినచర్య అయింది. అలాంటప్పుడల్లా తను అందమైన దాన్ననే భావం మరింత బలపడుతోనే వుంది.

'తను వూళ్ళో అందరి ఆడపిల్లలకంటే అందగత్తెని' అనే అభిప్రాయం రూఢి అయ్యాక "నేను నిజంగా చాలా అందంగా వుంటాను- కథల్లో అంత- ఇక నన్ను ఎవరైనా ప్రేమించడమే తరవాయి" అనుకుంది.

విశాల చెరువుకి నీళ్ళకి వెళ్ళినప్పుడు ఎవరైనా అబ్బాయిలు తనని ప్రేమిస్తారేమోనని చూసేది. కాని తను ఎదుర పడితే వాళ్ళు గౌరవంగా తప్పుకుని పోయేవారు.

విశాలకి చిరాకేసేది.

ఓరోజు ఎవరో కొత్త కుర్రాడొకాడ వచ్చాడు వూళ్ళోకి- నొక్కుల జుట్టూ పెద్దపెద్ద కళ్ళూ, విశాలమైన నుదురూ మంచి పొడుగూ-పర్సనాలిటీతో హుందాగ వున్నాడు.

ఆ కుర్రాడు తన పక్కనించి వెడుతూ తమాషాగా కళ్ళెగరేసి నాటకీయంగా "శ్రీ వూరి చెరువుగట్టు మీద నీళ్ళ బిందె మోస్తూ ఇంత సౌందర్యం వృథా అ పోతోందని ఎప్పుడూ చెప్పలేదేం, దురా

ర్గుడా" అంటూ మోచేత్తో పొడిచాడు తన వూరి కుర్రాణ్ణి. వాళ్ళిద్దరూ స్నేహితులు.

విశాలకి వాడి భాష నచ్చలేదు. ఐనా కుతూహలం చంపుకోలేక ఓర చెవిపెట్టి విన్నది.

"ఒరేయ్, పిచ్చిగా వాగకు! ఆ పిల్ల ఎవరనుకున్నావ్? రవణమ్మగారమ్మాయ్. 'రవణమ్మగారంటే నిప్పురా ... నిప్పు." అన్నాడు.

విశాల చరచర సాగిపోయింది. తన వూరి కుర్రాడిమీద అంతులేని కోపం వచ్చింది.

"మధ్యలో వీడి పెత్తనం ఏమిటో, బోడి పెత్తనం- ఆ కుర్రాడు ఒకవేళ ప్రేమిస్తాడేమో ప్రేమించనీయగూడదూ?" అని నొచ్చుకుంది.

* * *

ఎవరూ ప్రేమించకుండానే విశాలపెళ్ళి ఆంజనేయులుతో జరిగిపోయింది. 'రవణమ్మ కష్టాలు గట్టెక్కాయి. విశాల అదృష్టజాతకురాలు' అన్నారంతా. ఏ పూటకాపూటకి వెతుక్కునే పిల్లకి నెలకి నికరంగా ఒకటవతేదీకల్లా నూటయెనభై రూపాయలు చేతిలోపడే ఆధరువు దొరికిందంటే అదృష్టమేమరి - అందునా కానీ సంపాదన లేని వాళ్ళు గూడా వేలకి వేలు కట్నాలు అడిగే యీ రోజుల్లో.

ఆంజనేయులు పాపం బుద్ధిమంతుడే! పెళ్ళవగానే రవణమ్మని గూడా తీసుకొచ్చి తనతో వుంచుకున్నాడు. రవణమ్మ ఇంటి పని చూసుకుంటూ కొత్త జంటకి కాస్త తిరగడానికి అవకాశాలు కల్పించేది.

ఆంజనేయులూ విశాలా మధ్య మధ్య సినిమాకి వెళ్తాండేవాళ్ళు. హాలు దగ్గం వెళ్ళగానే ఆంజనేయులు ఓ బెం టిక్కెట్టూ, ఓ నేల టిక్కెట్టూ కొని, నే టిక్కెట్టు విశాల చేతిలో పెట్టి తను వెళి బెంచీలో కూర్చుని సినిమా చూసి వచ్చే వాడు.


విశాలకి; సినిమాలో రిక్షా తొక్కే హీరో హీరోయిన్‌తో కలిపి పక్క పక్కన మెత్తని సోఫాల్లో కూర్చు సినిమా చూసి సినిమా అయ్యాక హీరొ యిన్‌కి 'టాటా' చెప్పి వెడుతోంటే— "ఛీ,ఛీ చివరికి రిక్షా వాళ్ళపాటి చేశాపు కాము" అనుకుని యిదయిపోయేది.

ఆంజనేయులు పూలు తెచ్చి స్వయంగ తన చేత్తో సిగలో అమరుస్తాడేమోనని ఎదురు చూసేది విశాల. ఆంజనేయులు ప్రతి 'శుక్రవారం' పూలు తెచ్చేవాడు. తెచ్చి' ఇందులో సగం అమ్మవారి పూజకి వుంచు' అంటూ విశాల చేతికి ఇచ్చేవాడు. ఎప్పుడైనా విశాలే నోరు తెరిచి అడిగిన రోజున "రోజా పూలు కొనాలంటే అయ్యేపనా? శేరు రెండు రూపాయలు. ప్రతి శుక్రవారం తెస్తూనే వున్నాగా" అనే వాడు.

ఈ దుఃఖాలన్నిటికీ కారణం ఆంజనే యులు తనని 'ప్రేమించకుండా పెళ్ళి చేసు కోవడమే'నని గాఢంగా నమ్మింది విశాల.

కాని అసలు కారణం అర్థమయ్యేసరికి పదహారేళ్ళ విశాల నలభయ్యేళ్ళదయింది. అప్పుడుగాని తల్లి తనకి చిన్నప్పుడు చెప్పిన మాటల్లో అర్థం బోధపళ్లేదు. తల్లి అందరితో మంచిగా ఎందుకు వుండేదో, ఆంజనేయులు వూళ్ళో వాళ్ళకందరికీ

ప్రేమించి చూడు....ఒక లేడీ పోలీసును!



నౌకరుగా ఎందుకు ఒదిగి ఒదిగి వుండే వాడో, తన అందం ఎందుకు తనని అంద లం ఎక్కించలేదో అన్నీ అర్థం అయ్యాయి విశాలకి.

ఆ అవడమైనా అంత తొందరగా అవలేదు.

కాలేజీకెళ్ళిన కూతురు సుప్రియ ఓ రోజు సాయంత్రం ఇంటికి కొంచెం దూరంలో ఆగిన ఓ స్కూటర్ మీదినించి దిగి టాటా చెప్పి లోపలికి వచ్చిన రోజున అవలేదు.

గుళ్ళో పురాణానికెళ్ళిన విశాలకి ఎదురుగా వున్న సినిమాహాల్లోంచి ఆ కుర్రాడూ, సుప్రియా ఒకళ్ళమీద ఒకళ్ళు వాలిపోతున్నట్లు నడుస్తూ బైటికొస్తోంటే చూసిన్నాడూ—అవలేదు.

కనీసం ఓ రోజు ఉదయం మొహం చాటేసుకు తిరుగుతోన్న కూతుర్ని నిలేస్తే ఆ పిల్ల బావురుమంటూ 'నాకు నెల తప్పిందమ్మా' అని తన భుజాలపైన వాలిపోయిన్నాడూ—ఉహూ! అవలేదు.

కాని ఆంజనేయులు ఆ కుర్రాడి తండ్రి దగ్గరికి వెళ్ళి విషయం అంతా వివరించాక అతను నవ్వుతూ. "యీ 'పెర్మిసివ్' సొసైటీలో ఇలాంటివి మామూలే గదండీ యీ రెండు వేలూ పట్టికెళ్ళండి. ఎబార్షన్ ఇప్పుడొహ నేరమూ కాదు— నేనేదో సినిమాల్లో విలన్‌లా మాట్లాడుతున్నా ననుకునేరు. యీ పరిష్కారం మా వాడు సూచించిందే గుడ్‌బై" అంటూ భళ్ళున తలుపు మూసుకున్నప్పుడు అర్థంఅయింది. అయ్యాక—

"మనం బీదవాళ్ళం తల్లీ, జాగ్రత్తగా వుండాలి"—

అని మాత్రం అనగలిగింది. ***

సీరియల్

జై మంగళా

ఎ. శ్యామలారాణి

జరిగిన కథ: చిన్నతనంలోనే తల్లి దండ్రుల్ని పోగొట్టుకున్న మంగళకు అండగా నిలిచి ఆమె ఆస్తిపాస్తుల్ని సంరక్షించి ఆదరించాడు చౌదరి. రామం కుటుంబంలో దాదాపు ఒక మనిషిగా మసలేది మంగళ. రామం భార్య గౌరి అంటే ఎంతో అభిమానం. రామం తమ్ముడు రాజంటే ఎంతో అనురాగం ఆమెకు. హఠాత్తుగా రామం మరణించాడు. ఆ బాధ తట్టుకోలేని రాజు మనశ్శాంతికోసమని చెప్పి గమ్యంలేని యాత్రకు బయల్దేరాడు. కన్నకు ప్రమాదకరమైన జబ్బు చేస్తే మురళీబాబు వైద్యంచేసి ఆదుకొన్నాడు. గౌరిని వివాహం చేసుకొని మురళీబాబు గౌరినీ, కన్ననూ తీసికెళ్ళిపోయాడు. రాజు తిరిగొచ్చాడు. చెప్పుడు మాటలు విని గౌరిని అపార్థం చేసుకున్నాడు. చౌదరి కొడుకు గోవిందుకు పెద్ద సంబంధం చూస్తుండగా గోవిందు, తను ప్రేమించిన కృష్ణవేణిని గుళ్ళో పెళ్ళి చేసుకొన్నాడు. అందుకు మంగళ సహకారం వుందని తెలిసి చౌదరి మంగళపై మండిపడ్డాడు. రాజుకి మంగళపై కోప మొచ్చింది. హఠాత్తుగా మంగళ తాతగారు రంగంలోకి వచ్చారు. అనాథ అనుకొన్న మంగళ లక్షలకు వారసురాలని తెలియడంతో తన ప్రేమ వెల్లడిచేస్తే అపార్థం చేసుకొంటుందని భయపడి రాజు ఊరు విడిచి వెళ్లాడు. కొత్త ప్రదేశంలో మంగళకు ఏమీ తోచడంలేదు. కృష్ణతో స్నేహం కలిసింది. మంగళను చేసుకోమని కృష్ణతో తాతగారు చెప్పడం విన్న మంగళ కల్లోలపడింది. అక్కడ రాజు ప్రొఫెసర్ తన కూతురు శారదను రాజుకిచ్చి చేసే ఉద్దేశ్యం వ్యక్తపరిచాడు. రాజు తన కా ఉద్దేశ్యం లేదని చెప్పాలని ప్రయత్నించే లోపలే శారద తన బావనే చేసుకొనే ప్రయత్నంలో వుందని తెలిసి, వారి పెళ్ళికి తమ సహకారం అందించాడు.

మూడురోజుల తరువాత వసుమతి తిరుగు ప్రయాణం కాబోతూంటే కృష్ణ వస్తున్నట్లు టెలిగ్రాం వచ్చింది.

"ఎలాగూ వచ్చినదానివి రానేవచ్చావు. అతన్నోసారి పరామర్శించి వెళ్ళు. ఆయన నాకు తాతగారన్న మాటేగాని, ఆయన కోసం నిజంగా బాధపడి ఏడ్చింది అతనే!" అని మంగళ అంటే వసుమతి ప్రయాణం వాయిదా వేసుకుంది.

మరునాటికి కృష్ణ వచ్చేసాడు. ఆ పరిస్థితిలో వసుమతి రావటం, ఆమె ఆత్మీయత, ఓదార్పు అతని మీదెంతగానో పని చేసాయి.

"మీ వసుమతి చాలా మంచిపిల్ల!" అన్నాడు మంగళతో కృష్ణ.

ఆమె భుజా లుప్పొంగేయి.

"మీ కృష్ణ చాలా ఉన్నతమైన వ్యక్తి మంగళా! తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టే జగదీశ్‌లాంటి వాళ్ళనే ఇంతవరకు చూసాన్నేను. ఇతని నిరాడంబరత, నిగర్వితత్వం చూస్తూంటే ఎలా మెచ్చుకోవాలో, నీ అదృష్టాన్నెలా అభినందించాలో తెలియకుండా ఉంది" అంది వసుమతి.

"నిజంగానే అంటున్నావా?" కళ్ళల్లోకి గుచ్చిగుచ్చి చూసింది మంగళ.

"ఏం, ఎందు కనుమానమొచ్చింది?"

"ఏంలేదు, అదృష్టమేదో, దురదృష్టమేదో తేల్చుకోలేకపోతూన్న నాకు నీ నోట ఆ మాట వింటే ఎంతో బలం వచ్చినట్లుంది!" అంది మంగళ.

ఆ మరునాడే వసుమతి ప్రయాణం. రాత్రి పదకొండు గంటలు దాటింది. అంతవరకూ కబుర్లు చెప్పి వసుమతి నిద్రలోకి జారుకుంది. మంగళ నెమ్మదిగా లేచి బయటకు వచ్చింది.

ఆఫీసు గదిలో ఇంకా లైటు వెలుగుతూంది. కొన్నాళ్ళుగా ఊళ్ళో లేనందువలన మిగిలిపోయిన వర్కంతా ఓపికగా చూస్తూన్నాడు కృష్ణ. అట్టే సవ్వడి కాకుండా నేరుగా అతను రాసుకుంటూన్న టేబిలు ముందుకొచ్చి నిల్చుంది మంగళ.

అంత చొరవగా ఏనాడూ తన గదిలోకి రాని మంగళ అలా రావటంతో నిశ్చేష్టుడవుతూ "ఏం కావాలి మంగళా?" అన్నాడు కృష్ణ.

"నీతో కొంచెం మాట్లాడుదామని-" కుర్చీ దగ్గరగా లాక్కుని టేబిలు కానుకుని కూర్చుంది మంగళ. అది మరింత ఆశ్చర్యమనిపించిం దతనికి. ఇన్నాళ్ళలో మంగళ తనంత తానుగా కల్పించుకుని తనతో సంభాషించటం ఇదివర కొక్కసారే జరిగింది - అది - తనకిక చదువు చెప్పవద్దని చెప్పడానికి-ఇది, రెండోసారి!

"చెప్పు మంగళా!" అన్నాడు ఆత్రంగా కృష్ణ.

"రేపు మా వసూ వెళ్ళిపోతూంది" దీనంగా చెప్పింది మంగళ.

"అవునూ, అయితే?"

"వసూ వెళ్ళిపోతే నాకేం తోచదు."

"... ..."

"చిన్నప్పట్నుంచీ కూడా ఒకరంటే ఒకరికి ప్రాణంగా పెరిగేం!"

"........!"

"వసూ అంటే నాకు చాలా ఇష్టం." చిన్నపిల్లలా చేతివేళ్ళ గోళ్లు ఒక దానితో



ఒకటి 'టిక్. టిక్' మని పిస్తూ చెప్తూంది మంగళ.

"ఊఁ ఇంకా!" కృష్ణకి నవ్వు ఆగటంలేదు.

మంగళ మరింత ఉత్సాహంగా ముందుకొచ్చింది. "వసూ చాలా తెలివైనది. నాలాంటి బడుద్ధాయికాదు. మీ అందరిలాగే పెద్ద చదువే చదివింది. పాపం, చాలా అమాయకురాలు మాత్రం. తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళు అనుకుంటుంది. అసలు మా పాలెంలో వసూ అంత చదువుకున్న పిల్లగాని, అందమైన పిల్లగానిలేదు తెలుసా? ఆ ముక్కు, చెవులు, కళ్ళు అంతా వాళ్ళ నాన్నగారి పోలికే. చాలా అదృష్టవంతురాలు."

"మంగళా! నాతో ఏదో మాట్లాడాలన్నావ్. నువ్వొక్కర్తెవే మాట్లాడుతున్నావే!" నవ్వుతూనే సన్నగా హెచ్చరించాడు కృష్ణ.

"ఆఁ ఆఁ లేదు నీతో మాట్లాడాలనే నిన్నొక విషయం అడగాలనే అదే మరేం కాదనుకో మా వసూని పెళ్ళి చేసుకొంటావేమో అడుగుదామని కృష్ణా. నాకు పెళ్ళి మాటలెలా ఆడాలో తెలియదు. ఏమనుకోకు, వసూ అన్ని విధాలా నీకు తగిన పిల్ల!" కృష్ణముఖం చూస్తూ ఇంకేమి చెప్పాలో తెలియక ఠక్కున ఆగిపోయింది మంగళ.

కృష్ణ ఎంతకీ మాట్లాడక పోవటం చూసి తనే అంది మళ్ళీ.

"తాతగారి ముచ్చటకోసం అన్నయ్యలాంటి నిన్ను మరో దృష్టితో చూడలేను."

"నేను కూడా ఈ మాట ఎలా చెప్పాలా అనే మధనపడుతున్నాను మంగళా. కాని, నా పెళ్ళి సంగతి మాత్రం ఇప్పుడెత్తకు ముందు నీ వివాహం జరగాలి. అన్ని విధాలా యోగ్యమైన వాడిని వెతికి తెచ్చే బాధ్యత నా మీదుంది. అది తీరే వరకు."

"కృష్ణా అలాంటి శపథాలవీ చెయ్యకు. నువ్వలా భీష్మించుకు కూర్చుంటే ఈ జన్మలో నీ పెళ్ళి జరక్కపోవచ్చు!" కంఠం కొద్దిగా కంపించింది.

"అంటే?" విస్మయంగా చూసేడు కృష్ణ.

"పెళ్ళిళ్ళు చేయించడమే తప్ప చేసుకునే రాత నా జాతకంలో లేదని ఎవరో చెప్పార్లే ఇది వరకు" ఒకనాడు రాజు అన్న మాటలు జ్ఞాపకానికొచ్చి మంగళ కంఠం కొద్దిగా జీరపోయింది.

"నాన్సెన్స్ ఇలాంటి పిచ్చి నమ్మకాలు పెట్టుకోకు!" ఆత్మీయతగా గద్దించాడు కృష్ణ.

మంగళ కాస్త తెప్పరిల్లింది. కాని ఆమె వదనం దీనంగా అయిపోయింది.

"కృష్ణా! నాకు నా పెళ్ళికంటే వసూ పెళ్ళి ముఖ్యం. వాళ్ళకి నేనెంత ఋణపడి ఉన్నానో నీకు తెలియదు. తల్లి తండ్రిలేక పోయినా ఆ ప్రేమ, ఆదరణ అన్నీ నాకు చౌదరిగారి దగ్గరే లభించాయి. ఆయనంటే నాకు దేవుడు. అలాంటి మనిషి ఈవాళ చెప్పుకోలేని ఇబ్బందిలో పడ్డారు. ఒకప్పుడు కోరి చేసుకుంటామన్న వాళ్ళు కూడా ఈవాళ 'మీ అబ్బాయి సానివాళ్ళ పిల్లను చేసుకున్నాడన్న ఆరోపణతో

ప్రేమించి చూడు....ఒక లేడీ డాక్టరును!



ఆయన్ని కాకులు పొడిచినట్టు పొడిచి బాధిస్తున్నారు. నువ్వు వసూని పెళ్ళి చేసుకుని ఆయన్ని చింత నుండి తప్పించావంటే నాకు మహోపకారం చేసావని నేను బతికి నన్నాళ్లూ చెప్పుకుంటాను. నా పెళ్ళి జరిగిన కంటే ఎక్కువగా ఆనందిస్తా న్నేను "

మంగళ అంత దీనంగా మాట్లాడటం కృష్ణ ఎప్పుడూ చూడ లేదు. ఏమి సమాధానం చెప్పాలో అతనికి కాసేపు పాలు పోలేదు.

"కృష్ణా! ఇంతవరకూ నా జీవితంలో నా కోసమని ప్రత్యేకంగా ఎవ్వరిముందూ, కనీసం తండ్రిలాంటి చౌదరిగారి ముందు కూడా చేయి చాచి ఏమీ అడగలేదు-" మంగళ అతని కళ్ళల్లోకి సూటిగా చూసింది. నల్లని ఆ కళ్ళ వెనుక దాగిన భావాలిట్టే చదవగల కృష్ణకు ఆమెచేత ఇంకేమి మాట్లాడించినా కోరి అవమానించినట్లవుతుందనిపించింది.

"నీ ఇష్టం మంగళా!" అన్నాడు పొడిగా.

మంగళ ఆనందాని కవధులు లేక పోయాయి.

తండ్రినింతగా వేధిస్తూన్న సమస్య చిటికలో తీరిపోయి కృష్ణతో తన పెళ్ళను కుంటే కలో, నిజమో తేల్చుకోలేక తబ్బిబ్బయింది వసుమతి.

ఈ వార్త స్వయంగా తెలియజెయ్యటానికి మరునాడు కృష్ణను వసుమతిని వెంటబెట్టుకుని పాలెం ప్రయాణమైంది మంగళ.

మంగళ కళ్ళపడగానే చౌదరి నీరసమంతా ఎటో ఎగిరిపోయి, చెంగున మంచం



దూకి వచ్చాడు. అందుపై వసుమతి పెళ్ళి జరగబో తూందన్న సత్యం మంగళ నోట వింటూంటే అతని ఆనందానికి పట్టపగ్గా ల్లేక పోయాయి.

“నువ్వు మామూలు మనిషివి కాదే తల్లి నీలో సాక్షాత్తు సర్వమంగళాదేవి రూపమే కన్పిస్తూంది నా కిప్పుడు!” అని చౌదరి పొంగిపోతూంటే “అవును. ‘అమ్మోరనే’ వాడుగా నన్ను రంగనాథం” అంది మంగళ నవ్వుతూ.

అంతవరకూ మంగళ ఎలాగూ కృష్ణ భార్య అయిపోతుందని, నిరాశపడిపోయిన రంగనాథానికి క్రొత్తగా ఆశ చిగురించింది.

23

కృష్ణని వాళ్ళ ఊరు పంపించి తిరిగి వచ్చిన మంగళ లాయరు ముకుందరావు గారికి కబురు పంపించింది, అర్జంటుగా రమ్మని. ముకుందరావు రంగారావుకి చిర పరిచితులు ఆత్మీయులు. రంగారావు దగ్గరికి తరచు వస్తూ పోతూండేవారు. తన వ్యవహారాలు తనకంటే ఎక్కువ అతనికే తెలుసుననేవాడు రంగారావు. మంగళకు కూడా అతనిదగ్గర బాగా చను వేర్పడింది.

మంగళ అంత జరూరీగా కబురు పెట్టడం, ఆస్తిపాస్తుల వివరాలు జాగ్రత్తగా అడిగి తెలుసుకోవడం మహాశ్చర్యం వేసింది అతనికి. ‘ఓ’ అంటే ‘ఢం’ అన్నట్టుగా వచ్చిన ఈ పిల్ల అప్పుడే ఎంతగా ఎదిగిపోయింది అని విస్తుపోతూ అడిగాడాయన.

“ఇప్పుడెందుకమ్మా, ఆ వివరాలన్నీ?

“ఎందుకేమిటి? ఆస్తి నాదేకదా?” హుందాగా అడిగింది మంగళ.

అంతవరకూ మంగళ ధోరణికి మతి పోతూన్నట్లున్న అతనికి ఆ తర్వాత మంగళ అన్న మాటతో నిజంగానే కాసేపు బుర్ర పనిచేయటం మానేసింది.

“కృష్ణ, తండ్రిపోయాక ఎవరో రంగారావు దాతృత్వం గురించి చెప్తే సహాయమడగటానికి వచ్చాడు. సహాయమేమిటి, నీ చదువంతా అయ్యే వరకూ నాది పూచీ అన్నాడు మీ తాతగారు. కొన్నాళ్ళు హాస్టల్లో ఉండి చదువుకునేవాడు. తర్వాత ఆయనకొకసారి హార్టెటాక్ వచ్చింది. అప్పట్నుంచి సహాయంగా ఇంట్లోనే ఉండిపోయాడు. అభిమానించి దగ్గరుంచుకున్నా రేకాని, కృష్ణను పెంచుకోలేదాయన!” అని మరో మారు స్పష్టం చేసాడు.

“పోనీ, ఇప్పుడు నేను పెంచుకుందామనుకుంటున్నాను!” టక్కున చెప్పింది మంగళ. మంగళ ముఖంలోకి నిశితంగా చూస్తూ ఉండిపోయాడతను.

‘ఎలాగో చేస్తున్నాడు లేవయ్యా చౌదరి కూతురికి పెళ్ళి! జమీందారు బిడ్డలాంటి మా వాడిని కాదన్నందుకు తగినశాస్తే జరుగుతూందిలే! ఎవరి దయాధర్మాలమీదో బతికి నాలుగు ముక్కలునేర్చాడే తప్ప ఏముందా కుర్రాడికి? కూతురేం సుఖపడి పోతుందో మనం చూడమా ఇక!’ అన్న రంగనాథానికి తగిన జవాబిదేనని తల తాటించింది మంగళ.

* * *

వారం రోజులుగా రాజు చిన్నజ్వరంతో

బాధపడుతున్నాడు. అలాగే మొండికెత్తి ఆఫీసుకి వెళ్లివస్తున్నాడు. డాక్టరు జబ్బేమి లేదంటాడు. తనకెందుకో రోజు రోజుకీ క్షీణించిపోతూన్నట్లుంది.

చివరికోనాడు ఇది శారీరిక రుగ్మత కాదని, మానసిక రుగ్మత అని రూఢి చేసుకుని ఎలాగైనా గౌరి దగ్గరకు వెళ్ళి తీరాలని నిశ్చయించుకున్నాడు. చచ్చినా బ్రతికినా తన వాళ్ళను చూడగలిగానన్నా సంతృప్తయినా మిగులుతుంది. అన్న దీనస్థితికి వచ్చేసాడు. గౌరి ఎన్ని మాట లాడినా పడటానికి సిద్ధపడి, తన నేరాలకు ఆ మాత్రం కనీసపు శిక్షనయినా అనుభ వించవలసిందేనని నిశ్చయించుకుని లేచాడు.

ఇంతలో 'పోస్ట్' అన్న కేక చిత్రంగా వినిపించింది రాజుకి. కారణం తన కెవరూ ఉత్తరాలు రాయరు. పొరపాటున ఇంకెవరి ఉత్తరాలో తనకిచ్చేయటం లేదు కదా, అనుకుంటూ అనుమానంగా అందు కున్నాడు.

ఒకటి, రెండు, మూడు! ఒక్కసారిగా ఇన్ని ఉత్తరాలే! తనకే?! అనుకుంటూ ఆశ్చర్యంగా ఒక కవరు తీసాడు.

అందులో అందంగా ముద్రించిన రెండు శుభలేఖలున్నాయి.

గడగడ వణుకుతూన్న చేతుల్తో తెరచి చూసాడు.

చి॥సౌ॥ వసుమతిని, చి॥ కృష్ణకు ఇచ్చి అని చౌదరి రాసిన దొకటి మరొకటి కృష్ణకు, వసుమతికి అని. అది రాసిం దెవరు? మంగళ! మంగళ మందహాసం చేస్తూ ఎదుట నిల్చినట్లయింది.

మరో ఉత్తరం గోవిందు దగ్గర్నుంచి.

"డియర్ రాజూ!

స్వయంగా కలసి నీ చేతికి శుభలేఖ నిచ్చి, పిలిచి తీసుకు వెళ్ళాలనే అను కున్నాను. కాని హడావుడి వలన రాలేక పోయాను. వసుమతికి అనుకోకుండా చాలా ఆశ్చర్యకరంగా వివాహం నిశ్చయ మయింది. మా వసు చాలా అదృష్టవంతు రాలు. నిన్ను మరీ మరీ రమ్మని రాయ మంది.

నీ రాకకోసం చూస్తూ
గోవింద్.

P S ఈ పెళ్ళికి ఎంతగా రావాలని మనసులో ఉన్నా గౌరి రాదులే! ఈ పాలెం వాళ్ళ మూర్ఖతకి మరోమారామెను బలి చెయ్యటం మురళిబాబు కిష్టంలేదు. కనక నువ్వు ధైర్యంగా రావచ్చు. కాని, మరో ముఖ్యమైన సంగతి. ఈ పెళ్ళి కూడా ఎప్పటిలాగే సర్వమంగళాదేవి చలవ వలనే జరుగుతూంది!"

చాచిపెట్టి నాలుగు లెంపకాయలు కొడితే ఎలా విలవిల్లాడి పోతారో అలా బాధపడ్డాడు రాజు. ఆ ఉత్తరంలో చివర గోవిందు కావాలని గుప్పించిన వ్యంగ్యం, విసుర్లు రాజుకెలా తగలాలో అలాగే తగిలేయి.

'చివరికి తన గురించి మిగిలిపోయే మాటలిటువంటివే నన్నమాట!'

బాధగా ముఖం రాసుకుని మూడో కవరు తీసాడు. దాని మీద దస్తూరీ అతనికి ఎంతో పరిచయమైనదిగా అన్పించింది. కాని పోల్చుకోశక్యం కాలేదు.

ఆత్రంగా కవరు చించాడు. 'ప్రియ



మైన రాజుకి!' అన్న సంబోధన చూసి అప్రతిభుడై పోయాడు.

నీ 'వదిన'నని చెప్పుకుని నిన్ను బాధించటం నా కిష్టంలేదు. కారణం నువ్వు చాలా మెత్తని వాడివి. లోకం ఏమనుకుంటుందో అన్న భయంతో నీ ఇష్టాయిష్టాలను కూడా లెక్క చెయ్యని వాడివి. ఒకరకంగా పిరికివాడివి. దేనికీ తట్టుకోలేని అర్భకుడివి. ఒంటరిగా ఎలా ఉండగలుగుతున్నావోనని నేను బాధపడని క్షణం ఉండదు.

కాని. నేను జీవితపు గతకల్లో, ముళ్ళల్లో, హాలాహలంలో పడి నలిగి చివికి చివికి శల్యమై మరొకరి ఊపిరితో బతుకుతూన్న ఓ ఆడదాన్ని-జీవితమంటే నాకు వికృత పిశాచపు వికటాట్టహాసం. నన్నా భయంకర భావన నుండి వెలికి తీసుకురావాలని శత విధాల ప్రయత్నిస్తూన్న దేవుడిలాంటి మురళిబాబు గురించి లోకమేమనుకుంటూందో నాకు తెలుసు. కాని నువ్వు ఆ లోకులతో, పలుగాకులతో సమానమైపోకుండా జరిగినది సరిగా అవగాహన చేసుకుని, నన్నెదో ఊరడించ వస్తావని ఎదురు చూసాను. కాని నీజాడ తెలియలేదు.

గోవిందు నిన్ను కలిసానని చెప్పిన నాడు నా ఆనందానికి మేరలేకపోయింది. ఏ క్షణాన నువ్వొస్తావోనని గుమ్మందగ్గరే నిల్చుని, నిల్చుని ఎంత ఆత్రంగానో చూసేను. కాని నువ్వు రాలేదు. నా ఉనికి తెలిసి కూడా నువ్వు రాలేదంటే నన్నెంతగా ద్వేషిస్తున్నావో గ్రహించి కుమిలిపోయాను.

నన్నూ, నా నీడనూ నువ్వు సహించలేక దూరంగా ఉన్నా, నువ్వెనా బాగుపడ్డావని తెలిస్తే ఆనందించేదాన్నేమో! కాని నువ్వెంత నష్టపోయావో, ఎంతటి అదృష్టాన్ని కాలదన్నుకున్నావో తలచుకుంటూంటే మాత్రం నా మనసుకి తీరని బాధ కలుగుతూంది.

రాజూ! నేను పాలెం వదిలిన తరువాత జరిగిన సంఘటనలన్నీ నాకు చూచాయగా గోవిందు, వసుమతివల్ల తెలిసాయి. మంగళ ఎడల నీ ప్రవర్తన కేవలం అవివేకం మాత్రమే కాదు- కృతఘ్నత- చెప్పరాని కృతఘ్నత! నువ్వుతప్పక వస్తావనీ, నీతో ఎన్నో విషయాలు చెప్పాలనీ అనుకున్న నాకు, నువ్వింక రావని తెలిసాక- నీది కృతఘ్నత.ఎందుకయిందోఈఉత్తరం ద్వారా చెప్పవలసిన కర్తవ్యం ఉందనిపించింది.


అందుకే నీకీ ఉత్తరం రాస్తున్నాను.

''పైకి చెప్పకపోయినా ఒకరినొకరు ప్రాణాధికంగా ప్రేమించే- మంగళ- నువ్వూ ఈనాడు ఒకరికొకరు ఏమీ కారనుకుంటే ఈ ప్రపంచమే అసత్యంగా కనపడుతూంది నాకు.

"రాజూ! ఈ సంబంధ బాంధవ్యాల సంగతి ఎలా ఉన్నా, ఉపకారం చేసిన వారిని మాత్రం మనం జీవితాంతం గుర్తుంచుకోవాలి.

"అకతాయిగా, అల్లరి చిల్లరిగా తిరిగే మంగళనే నీకు తెలుసును. కాని ఆమెలోని

ప్రేమించి చూడు....ఒక్క లేడీ లాయరును!



మహోన్నతమైన వ్యక్తిని నాకు తెలుసును.

"రాజూ! చిన్నప్పటినుండి మీఅన్నయ్య నిన్నతి గారాబంగా పెంచారట- అందుకే. నీ ఇంటి పరిస్థితేమిటో నీకు తెలియలేదు. పెద్ద చదువులపై కోరికలు పెంచుకున్న నిన్ను నిరుత్సాహపరచలేక 'సరే'నన్న మీ అన్నయ్య నీకు తెలియకుండా భూమిని అమ్మేయాలనుకున్నారు. ఆ సంగతి గ్రహించిన మంగళ మీ భావి జీవితాలు దెబ్బతింటాయన్న భయంతో భూమిని అమ్మనివ్వకుండాచేసితనే సహాయపడింది. ఆడపిల్ల డబ్బుతో చదువుకుంటున్నానని ఎక్కడ పౌరుషపడతావోనని తన పేరుని బయటపెట్టనివ్వలేదు.

గడచిన ఐదేళ్ళలో నువ్వు హాయిగా చదుకుని సంపాదించుకున్న డిగ్రీ మంగళ డబ్బుతో! హాస్టలుకు కట్టిన ఫీజు మంగళ డబ్బు-నువ్వు తిన్న తిండి, కట్టిన గుడ్డ మంగళ డబ్బు ఫలితం- మంగళ శుద్ధ ఫకీరుగా మిగిలింది.

ఇల్లు అమ్ముడయి పోయిన్నాడు కూడా కనీసం చౌదరిగారికి కూడా అసలు రహస్యం తెలియనివ్వలేదు మంగళ. తనకి నిలువనీడపోయిననాడుకూడా ఏమాత్రమూ తల్లడిల్లలేదు. మన ఇంటికి కాబోయే కోడలు పరాయివారి పంచన బ్రతుకు గడపటం కష్టంగా తోచి, మాతోపాటే ఉండమని ఆనాడు మంగళను బలవంతం చేసి ఉంచగలిగామే కాని, మీ అన్నయ్య, నేనుకూడా విధి నిర్ణయమిలా ఉంటుందని తెలుసుకోలేకపోయాం.

'ఇక నువ్వు రావటమే తరువాయి.



అనుకుంటూ ఎన్నో ఆనందాల నూహించుకున్న అందరి కలలూ కల్లలే అయ్యాయి. విధివక్రించి దరిచేరబోతున్న నావ ఛిన్నాభిన్నమై సముద్రాన కలసిపోయింది.

మనసు చెదరి ఉన్న నువ్వు మమ్మల్నిమా రాతకు విడిచిపెట్టిపోయావు. మంగళ మాత్రం ఏ పరిస్థితుల్లోనూ స్థైర్యాన్ని కోల్పోలేదు. దారిలో నువ్వేమి ఇబ్బందులు పడతావోనని, రహస్యంగా డబ్బుతెచ్చి మంగళ నీ పెట్టిలో ఉంచటం, ఆ రోజు నా కళ్ళపడటం కూడా నిజంగా మంగళ కిష్టంలేదు. అదంతా ప్రేమ ప్రభావం రాజూ!

నువ్వు వెళ్ళిపోయావు. దిక్కుమాలిన పక్షుల మాదిరిగా మిగిలిన నాకూ, కన్నకూ మంగళ అండ లేకపోతే మా జీవితాలేనాడో పాలెం మట్టిలో కలిసిపోయి ఉండేవి.

ఈనాడీ గాధనంతటినీ నీకు చెప్పేవారు లేకపోయి ఉండురు.

రంగనాధం కుయుక్తులు పారలేదని అప్పులవాళ్ళందరినీ రెచ్చకొట్టేడు. కిరాతకుల్లా వచ్చి పడ్డవాళ్ళని ఆపగలిగేది డబ్బు మాత్రమే!

మంగళ భికారిగా మిగిలింది. నువ్వొస్తావన్న నిబ్బరంతో, నీ రాక కోసం ఎదురు తెన్నులు చూస్తూ ఆ ఇంటి నంటిపెట్టుకునే వుంది. కాని, పాలెం వదల్లేదు.

"లోకమంటే భయపడి నీ మంచిని కూడా గుర్తించలేని నీకు, లోకాన్నెదిరించైనా అందరికీ మంచి జరిగేలా చూడాలన్న మంగళ ప్రవర్తన కొరుకుడు పడక పోయుంటుంది. నీ బలహీన మనస్తత్వాన్నాసరాగా తీసుకుని నిన్ను పెడదారి పట్టించిన నీచుల మాటలకు నువ్వు లొంగిపోయి ఉంటావని నాకు తెలుసు. దానికి ప్రత్యక్ష తార్కాణం మంగళ నీకు దూరం కావటమే!

"కాని, రాజూ! నాదొక్క మనవి. చేసిన మేలుకి కృతజ్ఞత తెల్పుకోవటం ధర్మం. మంగళ చేసిన త్యాగానికి నువ్వు కృతజ్ఞత చెప్పుకు తీరాలి. నీకు మనసంటూ మిగిలితే జరిగినదానికి పశ్చాత్తాపంతో పరితపించిపోవాలి. మంగళ నిన్ను క్షమిస్తుందన్న నమ్మకం నాకుంది.

నా విద్యుక్త ధర్మం నేను నేరవేర్చుకున్నాను. చెప్పవలసినదంతా నీకు చెప్పేను. అటుపైని నీ ఇష్టం! ఈ లోకపు కట్టుబాట్లు, రీతి రివాజులూ, కృత్రిమత్వం ఎరగని కన్నమాత్రం 'బాబాయి ఎప్పుడొస్తా'డని అడుగుతూనే ఉన్నాడు. నేనేమి జవాబు చెప్పగలను?

బహుశః నన్ను మరచిపోవాలని నువ్వు ప్రయత్నిస్తూన్న తరుణంలో తిరిగి నా ఉనికిని గుర్తుచేసి నిన్ను బాధించి ఉంటే- పూర్వపు సంబంధ బాంధవ్యాలు జ్ఞప్తికి తెచ్చుకోకుండా, నన్ను క్షమించు.

ఉంటాను,

గౌరి."

రాజు పిచ్చివాడిలా జుట్టు పీక్కున్నాడు. మనసులో పెనుతుఫాను చెలరేగింది. చెమటతో వళ్ళంతా తడిసిపోయింది. కళ్ళు మసకమసకగా అయిపోతున్నాయి.

అంతా కలసి వెలివేసి తనను బల్లేలతో పొడుస్తూన్నట్లుంది. అందరూ తనని చూసి అదోలా నవ్వుతున్నారు. చివరకు చౌదరి కూడా 'ఓరి, అవివేకీ!' అని పరిహసిస్తూన్నట్టు తోచింది. అంతా హాయిగానే ఉండి ఉంటారు. తనే ఈ దిక్కుమాలిన జీవితం గడుపుతూన్నది.

'లోకమంటే భయపడి నీ మంచిని కూడా గుర్తించలేని నువ్వు!

లోకాన్నెదిరించయినా సరే అందరికీ మంచి జరిగేలా చూడాలన్న మంగళ.'

గౌరి రాసిన మాటలు తలలో మోత కొడుతున్నాయి—

'నువ్వు సంపాదించిన డిగ్రీ, అన్నాళ్లూ తిన్నతిండి, కట్టిన బట్ట అంతా మంగళ డబ్బే. మంగళకు ఏమీ కాలేకపోయినా, కృతజ్ఞతనైనా చెప్పుకుని, కనీసం మనిషి వనిపించుకో!' అని గౌరి ఎదుట నిలిచి చెప్తూన్నట్లుంది.

రాజు కళ్ళనిండా నీరు కమ్మేపింది.

తలపుకొస్తూన్న ఒక్కొక్క సంఘటనా లలిని మనసుని పీల్చి పిప్పిచేస్తూంది.

శిఖరాగ్రాన రత్న ఖచిత సింహాసనం మీద మహారాణీలా కూర్చుని మంగళ తన కేసి నిర్లక్ష్యంగా నవ్వినట్లు తోచింది.

ఏదో చెప్పాలన్న తపనతో తను ఆయాసపడుతూ, ఒక్కో మెట్టే ఎక్కి పైకి వెళ్తున్నాడు. ఎప్పటికీ ఆమెను చేరుకోడం సాధ్యంకాకుండా ఉంది.

చివరికెంతో ప్రయాసమీద, ప్రాణాలు కడంటి పోతాయేమోనన్న స్థితిలో ఆమె పాదాలవరకూ ఎగబ్రాకేడు.

కాని, మంగళ నవ్వున అంతరిక్షాని కెగిరిపోయింది.

ఇక ఆమెని చేరడం దుస్సాధ్యం. నిరాశ, నిస్పృహతో, ఆవేదనతో అతని హృదయం బ్రద్దలయి ఆ శిఖరాగ్రంనుండి క్రిందికి దొర్లిపోతున్నాడు.

క్రిందినొక అఖాతం- అంతా చీకటి- పట్టుదొరకటం లేదు.

రాజు మైకం కమ్మేసినట్లుగా పక్కమీద వాలిపోయాడు.

మనసులో చెలరేగిన ఆ రా టా న్ని శరీరం అణచివేసింది.

ఒకగంట తర్వాత వచ్చింది టైపిస్ట్ విజయ- తాను పెళ్ళి చేసుకోబోతూన్న వ్యక్తిని రాజుకి పరిచయం చేద్దామని.

సోషవచ్చినట్లుగా పడిఉన్నా అతన్ని చూసి విభ్రాంతి చెందుతూ "మాస్టారూ! మాస్టారూ!" అని పిల్చింది రెండుసార్లు.

రాజు అతి బలవంతాన కళ్ళు విప్పేడు.

ఆ కళ్ళనిండా నీళ్ళు- "పె ... పె . పెళ్ళికి . వెళ్లాలి ... మం . గ....శను చూడాలి వెళ్లాలి ... వె. ..ళ్లాలి!" అన్నాడు ముద్దగా.

శుభలేఖలు తీసి చూసిన విజయ, "పెళ్ళి సంగతి దేవుడెరుగును- మీకు వంట్లో బాగులేదు. జ్వరం పేల్చేస్తూంది- ముందు ఏమీ ఆలోచించకుండా విశ్రాంతి తీసుకోండి. నేనిప్పుడే డాక్టర్ని తీసుకొస్తాను" అని బయలుదేరింది, హడావిడిగా.

24

పాలెం మొత్తం చౌదరిగారింట్లో పెళ్ళి సందడితో మార్మోగిపోతూంది. వసుమతికి పెళ్ళి సంబంధాలు కుదరటంలేదని, చాటు మాటుగా చెవులుకొరుక్కున్న వాళ్లందరూ



చాటంతేసి ముఖాలు చేసుకుని వచ్చి చౌదరి నఖినం దించి వెళ్తున్నారు.

ఎక్కడెక్కడి బంధుమిత్రులతో ఇల్లు నిండిపోతూంది. మంగళ ఎవరో వచ్చారనగానే ఆత్రంతా ఎదురు పరుగెత్తడం, వచ్చినవారిని చూసి నిస్పృహగా వెనుతిరిగి పోవటం చేస్తూంది. మధ్య మధ్య యథాలాపంగా అడిగినట్లు, "రావలసిన వాళ్ళంతా వచ్చారా?" అని గోవిందు నడుగుతూంది.

"అహా, రావలసినవాళ్ళూ, రాగలిగిన వాళ్లూ అంతా వచ్చేరు- ఉండలేక రాలేక బాధపడేవాళ్ళు ఎలాగూ రాలేరు. ముఖం చెల్లక మరొకరురారు!" అన్నాడు ఆఖరున గోవిందు.

మొదటిది గౌరి నుద్దేశించి, రెండవది రాజు నుద్దేశించి అన్నాడని గ్రహించుకున్న మంగళ, మూగగా కన్నీళ్ళు పెట్టుకోవటం ఎవరూ గమనించలేదు.

ఆ రాత్రే పెళ్ళి. ఎటుచూపినా సందడి-సంబరం- ఉత్సాహం- ఆనందం తాండవిస్తున్నాయి. ఆ కోలాహలం మధ్య తననెవరో వెలివేసినట్లు, తను దిక్కుమాలిన దానినన్నట్లు బాధపడుతూ మౌనంగా క్షణాలు దొర్లిస్తూ, చివరికి ఎవరికీ చెప్పకుండా ఒంటరిగా చెరువుగట్టుకేసి బయలుదేరింది.

అప్పుడే సూర్యాస్తమయం కాబోతూంది.

పక్షులు గూళ్ళకు చేరుకుంటున్నాయి.

'రాజు ఇప్పటికి కూడా రాలేదు- అంటే గోవిందు చెప్పినట్లుగా ఇక రాడేమిటి చెప్మా?' రాదనుకుందికి మనసంగీకరించటంలేదు.

నిస్పృహగా చెరువుగట్టు దగ్గర్నుంచి కదిలింది.

అటునుంచి రంగనాథం ఎదురొస్తున్నాడు.

రంగనాథం కళ్ళపడగానే మంగళ కొక్కసారి భగ్గుమంది.

అతని ప్రక్కనే దర్జాగా లతని కొడుకు కూడా వస్తున్నాడు. దగ్గరగా వచ్చాక మంగళ నెగాదిగా చూశాడు సుబ్బారావు.


"మన మంగళేనా? ఎంత మారిపోయిందీ!" అన్నాడు మంగళ రూపం అతని కళ్ళు చెదరగొడుతూంటే.

"మారిపోయింది నేను కాదు సుబ్బన్న బావా! నా పరిస్థితి! ఒకప్పుడు బీదదాన్ని. ఈవాళ మీ అందరినీ మించిన డబ్బున్న దాన్ని!" దర్పంగా అంది మంగళ తల ఎగరేసి. తనే మాత్రం దిగులుగా కనుపించినా రంగనాథం పసికట్టి, తానను కున్నది సాధించానని విర్రవీగుతాడని, లేని చలాకీతనమంతా ముఖంలో చూపడానికి ప్రయత్నించింది.

"కోడలు పిల్ల వనిపించుకున్నావే!" అంటూ అనవసరంగా ఆనందపడ్డాడు రంగనాథం.

'ఒకప్పుడు తనను హీనాతి హీనంగా చూసిన రంగనాథం కావాలని ఈనాడు నోరారా 'కోడలు పిల్ల' అంటున్నాడు!' మంగళ లోలోపల రంగనాథానికి తగిన పాఠం చెప్పాలనుకుంది.

ప్రేమించి చూడు....ఒక రచయిత్రిని!



"ఇంతకీ బహుకాల దర్శనం. సుబ్బన్న బావని చూసి చాలా రోజులయింది!"

"ఇక ఇక్కడే ఉంటాను మంగళా. చదువైపోయాక ఈ పాలెంలోనే ప్రాక్టీసు పెట్టి పల్లె ప్రజకు సేవ చేద్దామనుకుంటుకుంటున్నాను!" అన్నాడు సుబ్బారావు కాస్త మెలితిరుగుతూ.

"అంటే, ఈ పాలేనికేదో మూడిందన్నమాట! ఇంతకీ నా భయంకాని, నీ చదువు పూర్తయినప్పటి సంగతి కదా!" నవ్వుతూనే ఓ చురక వేసింది మంగళ.

"చూడు నాన్నా!" అన్నాడు సుబ్బారావు ఉడుకుబోత్తనంగా.

"అబ్బ ఉండరా. ఏదో హాస్యమాడుతూందది. వరసా, వావీ ఉన్న అదికాకపోతే ఇంకెవరు హాస్యమాడతారురా నిన్ను?" రంగనాధం కప్పుకురాబోయాడు.

"నా కలాంటి హాస్యాలంటే అసహ్యం నేను నిజంగానే అన్నాను" మంగళ లెంప మీద కొట్టినట్టు చెప్పింది. అయినా రంగనాథం తగ్గలేదు.

"ఊరుకోవే కొంటెపిల్లా—వాడసలే అమాయకుడు నిజమనుకుని అలిగి వెళ్ళిపోగలడు! వాడిచేత కాస్తా 'ఊఁ' అనిపించి ఆ మూడు ముళ్లూ ఎంతట వేయిద్దునా అని నేను చూస్తున్నాను!" సందర్భం కలిసి వచ్చింది కదా అని చకచక చెప్పేశాడు.

"ఆ మూడు ముళ్ళూ వేయించుకునేంత నిర్భాగ్యత్వం నాకు పట్టలేదు. సుబ్బన్న బావ 'ఊఁ' అనేకాదు. అరచి గీపెట్టినా సరే, నా జవాబిదే!" అదోలా నవ్వుతూనే జవాబిచ్చింది మంగళ.

"ఏమే అలా అనేస్తున్నావ్? సుబ్బన్న కేం తక్కువ?" అన్నాడింకా పట్టుకు వేలాడుతూ రంగనాథం.

"తక్కువ కాదు ఎక్కువ- అవేమిటో నీకూ తెలుసు!" అంది మంగళ, 'దుర్వ్యసనాలు' అన్నమాట నోట పలక్కుండా.

"మంగమ్మా! పెళ్లింట్లో నీ కోసం వెతుకుతున్నారు పదమ్మా!" అంటూ కేశవులు తాత రావటంతో, 'వస్తా మావయ్యా, వస్తా సుబ్బన్న బావా!' అనేసి మంగళ వెళ్ళిపోయింది.

"ఎంతపొగరు!" అని పళ్లు నూరాడు సుబ్బారావు.

"దానిక్కాకపోతే ఇంకెవరికుంటుందిరా పొగరు? నీలాంటి గాడిద కొడుకులు అదేలే అడ్డగాడిదలు-గాజులుతొడిగించు కున్నాక" అని రెండు చీవాట్లేసి, అనుకోకుండా తననూ గాడిదను చేసుకున్నందుకు రవంత చింతించేడు రంగనాథం.

"నేనేం గాజులు తొడిగించుకోలేదు!" సుబ్బారావు ఉడుకుబోత్తనంగా అన్నాడు. అప్పటికే మంగళ విసుర్లు అతని నసాళాని కంటి ఉన్నాయి.

"కబుర్లు చెప్పటం కాదురా వాజమ్మా! నీకేమైనా మగతనముంటే ముక్కుకితాడేసి దాని ఆట కట్టించు. దిక్కుదివాణం లేని నాడే అది ఒకర్ని లక్ష్యపెట్టే రకం కాదు. ఈవాళ లక్షాధికారిణిరా! నీలాంటి వాళ్ళని ఖాతరు చేస్తుందా అది? ఫో,ఫోవయ్ పిచ్చి సన్నాసీ!" నిస్సాకారంగా తండ్రి అన్న మాటల్తో ఎక్కడలేని పౌరుషం పుట్టు కొచ్చింది సుబ్బారావుకి.

"నాన్నా! నువ్వలా చూస్తూనే ఉండు, దాని పొగరణచి, మెళ్లో మూడు ముళ్ళు వెయ్యకపోతే నేన్నీకొడుకునే కాదు!" అన్నాడు శపథం పట్టినట్లుగా.

కొడుకు మీద అంత ఆశలేకున్నా, తాత్కాలికంగా రంగనాథాన్ని ఆనంద పరచిందామాట. అంతలోనే మంగళను తలచుకుని నీరుకారిపోతూ, "వట్టిదిరా. నాయనా. అది జరిగే పనికాదు—అది సామాన్యమయిన పిల్లాకాదు. ప్చ్. నీవల్లే మవుతుంది?' అన్నాడు

"నాన్నా! సామ, దాన, భేద దండో పాయాలన్నారు, చివరిదాని కెవరైనా చచ్చినట్టూ లొంగవల్సిందే. లొంగకపోతే ఏం జరుగుతుందో నీ కళ్ళతో నువ్వే చూద్దువుగాని, అదంతా నా కొదిలెయ్. మన సుబ్బిగాడేం చెయ్యగలడని మాత్రం నిరుత్సాహపడకు!" అని ధైర్యం చెప్పేడు సుబ్బారావు, తండ్రికి.

(ముగింపు వచ్చే సంచికలో)



మినీకథ: **సీటు**

సూర్యారావుగారు ఆకాశంలో చలిమంట వేసారు. ఆ సెగ తగిలి నాకు చెమటలు పోసేస్తున్నాయి. వెధవ బస్ ఎంతకీ వచ్చి చావదే? ఎండలో ఎంతసేపీ నిరీక్షణ? జేబు గుడ్డతో ముఖం తుడుచుకుంటూ ప్రక్కన నిలబడి ఉన్న అమ్మాయిని చూసి ఒక్కసారి ఉలిక్కిపడ్డాను. చంచలకు ఆ అమ్మాయికి చాల పోలికలున్నాయి.

ఛీ! చంచల మళ్ళీ గుర్తుకొచ్చింది. 'మనసా! మనసా! ఆ చంచలను మాత్రం నాకు మళ్ళీ గుర్తుచేయకు'' అని ఎన్నోసార్లు వేడుకున్నాను కాని ఏం ప్రయోజనం. ఏదో ఒక వంకతో చంచలను గుర్తుచేయక మానదు, పాడు మనసు.

చంచలని పేరు ఎందుకు పెట్టారో గాని పేరు మాత్రం సార్థకం చేసుకొంది. చిన్నప్పటినుండి అనుకున్న మేనరికాన్ని వదులుకుని నిన్నే ప్రేమించానని చంచల అన్నప్పుడు నిజమేనని నమ్మేసాను. నువ్వు లేకపోతే బ్రతకలేనంది. అదీ నమ్మేసాను.

కాని చంచల ఏం చేసింది?

అదిగో బస్సొచ్చింది. క్రిక్కిరిసి ఉంది. దేవుడా నిలబడడానికి చోటుంటే చాలనుకున్నాను. సరిగ్గా నిలబడడానికే చోటు దొరికింది. బస్సు కదిలింది. వెనుక నిలబడ్డాయన మాటిమాటికీ మీద పడుతున్నాడు. డొక్కలో పొడుస్తున్నాడు. చిరాకేసింది నాకు. ఏదయినా సీటు ఖాళీ అయితే బాగుండుననుకున్నాను. అనుకున్నానో లేదో పక్కనే ముగ్గురు ఆడవాళ్ళు లేచారు. తటాలున కూర్చున్నా.

ఇంతకీ ఎక్కడాగాను? అవును. చంచల ఏం చేసింది? వాడెవడ్నో పెళ్ళాడింది. కారణం వాడికి డబ్బుందట. నన్ను చూసి బావను వద్దంది. వాడి డబ్బు చూసేసరికి నేఫేడౌట్ అయిపోయాను. రేప్పొద్దున్న ఇంకా డబ్బున్నవాడు కనిపిస్తే వాడివెంట పడుతుందా? హుఁ. దీనికి సమాధానం ఒకటోక్లాసు కుర్రాడు కూడ చెప్తాడు.

బస్సాగింది. అటుప్రక్క మగవాళ్ళ సీటొకటీ ఖాళీ అయింది. నేనక్కడ చేరాను. అమ్మయ్య! ఆడవాళ్ళొస్తే లేచి నిలబడాల్సిన బాధ తప్పింది. బస్ మూలుగుతూ కదిలింది. బస్‌లో జనాభా ముందుకన్నా పెరిగింది. పక్కనున్న పశువెవడో కాలు తొక్కాడు. గుర్రుగా చూసాను. ఈ పక్కనున్న పీఠాధిపతి దిగితే బాగుండును. హాయిగా కిటికీ పక్కనే కూర్చోవచ్చు. గాలయినా తగులుతుంది. సరిగ్గా అప్పుడే మెరిసింది నా బుర్రలో మెరుపు. మొదట్లో నిలబడడానికి చోటు దొరికితే అదే చాలనుకున్నాను. ఇప్పుడు కిటికీ దగ్గర సీటు కావల్సి వచ్చింది నాకు. మరి ఇంకా చంచలను తిట్టుకోవడమెందుకు?

అంతే! ఆ తరువాత చంచలను మళ్ళీ జీవితంలో నేను గుర్తు చేసుకోలేదు. ఆడిపోసుకోలేదు.

—విజయ్

పోరు

[illegible] సత్యనారాయణ మూర్తి



ష్ ష్ ష్ ఛీ ఛీఛీ

ఇన్టూ

భౌ భౌ భౌ బౌ భౌభౌ

* * *

"ఏటా ఇసు గూ ఇదిల్చి కొట్టడ మూను? మొగుడెదవని. కాంత మన్నిం చడం నేర్చుకో."

"ఓసోస్ .. పవురసానికేం నోటు నేదు. లే . వుండు. తప్పుగో. ఏయీ— ఆ ముప్పయ్యీ యిచ్చెయ్. డబ్బు శానక పోతే ఆనక యిబ్బందవుద్ది."ధువ(ధువ(లాడుతూ వెళ్ళి గల్లాపెట్లోంచి మూడు పదులూ లాగేసుకుంది—లక్ష్మి.

'మొగుడెదవ' మంగపతి వెర్రి మొహం పెట్టి అవాక్కయిపోయాడు.

ఛెంగు ఛెంగున బజార్న పడిపోతున్న లక్ష్మిని చూసి 'గుడిసేటేసాలు నేర్పింది అనుకున్నాడు.

రోడ్డు చివర కు రి య న్ గుప్పు గుప్పు దమ్ముకొడుతూ లక్ష్మి కోసమే తచ్చాడుతున్నాడు.

"పదిపైసల నౌజిండియ్యి."

"అరపెట్టె సిగరెట్లు."

"సోడా కొట్టు."

"పిటీ కిళ్ళీ కట్టు."

బేరా లొచ్చిపడ్డాయ్. అన్నీ గబగబా అందించి మంగపతి మళ్ళీ రోడ్డు చివరకి దృష్టి సారించాడు.

కురియన్నూ, లక్ష్మి రిక్షా ఎక్కేశారు. రిక్షా ట్రాఫిక్‌లో కలిసిపోయింది. రూపాయి నోటిచ్చి ఏదో అడిగిన వాడకం దారుని మంగపతి "ఛిల్లర్లేదు" అని కసిరి కొట్టాడు.

ఇది ఆమధ్య మాట.

* * *

ష్ ష్ష్ ఛీ ఛీఛీ

ఇన్నూ

ఛా ఛాఛా .ఛౌ ఛౌఛౌ

* * *

సుఖనివాస్ కాఫీ హోటలుకీ, మంగపతి కిళ్ళీబడ్డీకి దాదాపు ఒకటే వయస్సు. రెండేళ్ళు.

మంగపతి అంతకు మునుపు ఏం చేసేవాడో తెలీదు. నలభయ్యో పడిలో పడ్డ అతనికి వయసొచ్చిన కూతురుంది. పెళ్ళాం సంగతి వేరే చెప్పక్కర్లేదు. కురియన్‌తో రిక్షా ఎక్కి బజారు వెళ్ళిందనుకున్నామేం—అదే—లక్ష్మి—మంగపతి పెళ్ళాం. మంగపతి ముసలి వాలకం పడిపోయాడుగాని, లక్ష్మి మాత్రం రివట్లాగ నువ్వా నేనా అనేట్టుగానే వుండి పోయింది.

సుఖనివాస్ ప్రొప్రైటర్ భోగారావు గారు. మనిషి ఇక్కడుంటే అయన బొజ్జ అక్కడెక్కడో వుంటుంది. ఏణ్నార్థం పైచిలుకి హోటలు నడిపి ఓ పొద్దున అకస్మాత్తుగా మూసిపారేశా రాయన బయట బోర్డు కట్టారు. 'సుహానా— ఏయిర్‌కండిషన్డు త్వరలో వేచి చూడండి' అని.

భోగారావు గారి హోటలుని బట్టే ఆ రోడ్డుకు రద్దీ. అక్కడ ఇంకో ఆకర్షణ ఏదీ లేదు. హోటలు మూత పడ్డంతో మంగపతి వ్యాపారం దెబ్బతింది. అయి పోయిన సరుకులు మళ్ళీ తెచ్చిపెట్టేందుకు తోక లేవడంలేదు. ఏ రోజు అమ్మకం డబ్బులు ఆ రోజు జరుగుబాటుకీ ఇంకా ఏమన్నా చిల్లర మిగిలితే అది లక్ష్మమ్మ రొంటి నుండే సంచీలోకీ కటాకటీ చాటాబొటీగా తయారైంది పరిస్థితి. వాడకందార్లు అప్పులు తీర్చడం మాట అటుంచి అరువులు జోరుచేస్తున్నారు. ఆ హోటలు సర్వర్లు, క్లీనర్లు మరీను. కొందరు గైరు హాజరైపోయారు.

భోగారావు గారికి సిరి అందుకుంది సిరి అతని తెల్ల మొహంలోనూ భారీబొజ్జ లోనూ లేదు. అతని భార్య ధనలక్ష్మిది అదృష్టం.

ఈ శాల్తీని చూసి తీరాలి. మగాడై వుండాలేగాని, ధనలక్ష్మిని చూశాడంటే 'ఓ చూపు చూసేయాలి, అనిపించి తిరు తుంది.

పెద్ద హోటలు కట్టడానికిగాను కొందరు పెద్ద పెద్ద ఆసామీల చేతులు, నోళ్లు తడిపి

తడిపి, ధనలక్ష్మిని తార్చి భోగారావుగారు లోను పుట్టించుకొచ్చారన్నది. ఆ నోటా ఈ నోట నా న్తున్న భోగట్టా.

సుహానా ఏయిర్ కండిషన్డ్ హోటలు అవతరించడానికి కొన్ని నెలలు పట్టింది. ఈలోగా

"అయినోడికీ కానోడికీ నువ్విలా అరువు విచ్చుకుంటూ పోతావుంటే సివరికి పిప్ప సేతికొస్తంది" కూకలేస్తూనే వున్నాడు మంగపతి.


కానీ లక్ష్మి మొగమాటాలు లక్ష్మివి. ఆ మలయాళీ సప్లయరు కురియన్నంటే దానికి మనసు.

"ఆ డెవరనుకుంటున్నావ్? అయిదంతస్తుల ఒటేలు ఎదురుగ్గా అంపట్టం లేదూ. రేపొ్పద్దున అది ఇప్పారంటే— ఆడికి దాంట్లో పని. నువ్వూ నీ కొట్టూ అన్నీ కలిపినా, ఆడికి ఓ పూట దొరికే పై డబ్బులపాటి వుండవు" అంటూ లక్ష్మి మంగపతి మాట ఎద్దేవా చేస్తూనే వుంది.

చవకబారు సిగరెట్లు, బీడీలు మాత్రమే మంగపతి బడ్డీలో ఇప్పుడు దొరుకుతూన్నది. మందు నీళ్ళకూ్కడా అతగాడికి పైసలు అంకటంలేదు.

ఓరోజు చక్కగా ముస్తాబై మిస మిస లాడిపోతూ వచ్చింది మంగపతి కూతురు. కేరేజి ఇచ్చేసి "శనేమాకెడుతున్నా—మేట్నీకి" అంది.

"బోర్డు పాసుల్లేవు. ఆ నాయాళ్ళు బోర్డు లివ్వడం మానేశారు. వున్న ఒక్క బోర్డు పాసూ ఆ నా కొడుకు కురియను గాడి కిచ్చింది నీయమ్మ" మంగపతి విసుగు కోపం కూకలేశాడు.



"నాకు నీ పాసేం అక్కర్లేదు. నాకాడ రెండ్రూపాయలున్నాయ్ ఎంచక్కా. కురియన్నే ఇచ్చాడు."

"ఆడు నీ కెందుకిచ్చాడు? ఎప్పుడిచ్చాడు?"

"ఎప్పుడో ఇచ్చాడు. ఆ వూసు నీ కెందుకు?"

"మీ అమ్మేదే? రానేదు పొద్దుణ్ణించీను??"

"అమ్మా కురియనూ కలిపి యాడకో పోయారు. రెండు. పోకుండలెట్టు."

పోకుండలు తీసుకుని రివ్వున వెళ్ళి పోయింది సుబ్బులు.

'ఇదీ తయారైందీ' అనుకున్నాడు మంగపతి.

మనసులో కురియను మెదిలాడు. 'నే నింటికాడ లేనప్పుడు ఈ నాయాలు వస్తూండడన్న మాట. ఈ నంజకి ఆ రవిడీవెదవతో ఏం పని . ? ఇది . నంజై పోయిందా?. . ఈ కుర్రముండ కూడా ' ఎన్నో అను మా నా లు. శంకలు. సందేహాలు.

* * *

ష్....ష్ష్....ఛీ....ఛీఛీ

ఇన్టూ

భౌ ..భౌభౌ....భౌ....భౌభౌ

* * *

'సుహానా—ఎయిర్ కండిషన్డ్' ప్రారంభోత్సవం. ఓ సినీనటీమణిగార్ని రావించారు భోగారావుగారు. ఓ మంత్రిగారూ వచ్చారు. ఆహూతులైన ప్రముఖుల సమక్షంలో భోగారావుగారు సుహానా రూపంలో కోటికి పడగెత్తారు. ధనలక్ష్మి భోగారావుగారు కూడా ప్రారంభోత్సవ సభా వేదిక నలంకరించారు. భోగారావుగారు అలా ఎదిగిపోయారు.

సుహానా హోటలు భవంతి లోపలే ధనలక్ష్మిగారి దూరపు బంధు వొకాయన అద్దాల షో కేసులతో ఓ సిగరెట్ బంక్ కం ఫ్యాన్సీషాపు పెట్టాడు. మంగపతి చెవిన పడిందా విషయం.

కొట్లో సరుకులు నిండుకున్నాయ్. గత సాయంత్రమనగా బజారుకెళ్ళిన లక్ష్మి ఇంతవరకూ అయిపూ అజా లేదు. సుహానా హోటల్లో కురియన్ తిరుగుతూనే వున్నాడు. కూతురు సుబ్బులు

కవిత.....ఒక్కటే!

గాలి అలిగింది!
నీరు అలిగింది!
భూదేవి అలిగింది!
శ్రీదేవి అలిగింది!
అలగనిది, కలగనిది
కవితాత్మ ఒక్కటే!
ఊళ్ళు విడివడ్డాయి!
బీళ్ళు విడిపడ్డాయి,
నొసళ్ళు ముడిపడ్డాయి!
నోళ్ళు మండిపడ్డాయి!
మదినుంచి విడిపడనిది,
మాడి మసి కానిది;
మానవత్వాన్ని కోరుకునే
మహనీయ కవిత ఒక్కటే!
చెట్టు ఒరిగిపోతున్నది!
గుట్ట విరిగిపోతున్నది!
పుట్ట పట్టు సడిలిపోతున్నది!
ఛెప్పన్న కాలాల్లోనూ,
చెనగి పోనిది;
విప్పి చెప్పలేని
కవితా మాధురి ఒక్కటే!
అణువణువులో;
రేణువులో;
మానవ గీతాన్ని
ఆలపించే వేణువులో;
వేవనల్లో, వేదంలో;
యువ జనతా
నవ నాదంలో;
నర్తించేదీ, అనువర్తించేదీ
అమల మోహనమౌ
కవిత ఒక్కటే!

—వై వియల్యాన్

నిన్న మధ్యాహ్నం అనగా కేరేజి ఇచ్చి పోయింది. తల్లీ కూతురూ నిన్న రాత్రి కూడా యింటికి రాలేదు. ఈ పొద్దుణ్ణించీ అతగాడు వస్తే కురియన్ని పిలిచి 'నా ఆడది ఏమైంద'ని వాకబు చేయడానికి మంగపతి మనసు ఒప్పుకోలేదు.

సాయంత్రమైంది. చీకటిపడుతోంది.

కొట్లోవున్న చిల్లర బిళ్ళలన్నీ పోగు చేశాడు మంగపతి. ఉజ్జాయింపుగా ఐదు, రూపాయ లుంది మొత్తం.

'ఏమైనా సరే మందేసేయాలి' తీర్మానించుకున్నాడు.

కొట్టు కట్టేసి బయల్దేరాడు

పీకదాకా పీపా పట్టు పట్టేశాడు

ఇప్పు డింటికెళ్ళి దాని పని పడదాం నిశ్చయించుకుని ఇంటిముఖం పట్టాడు నడవడం అతనివల్ల కావడంలేదు. తూగిపోతున్నాడు. పొద్దుణ్ణించీ గంజినీళ్ళయినా ముట్టలేదు. అడుగుతీసి అడుగు వెయ్యడం అతని శక్యం కావడంలేదు.

మంగపతి పడిపోయాడు

మంగపతి ఇంటిదగ్గిర పాకల్లో వుండే రిక్షా అతనొకడు ఇంటికి పోతూ పోతూ రోడ్డుమీద పడున్న మంగపతిని రిక్షాలో వేసుకున్నాడు. మంగపతి తెగ పేలుతున్నాడు.

రిక్షా అతను కూడా మందుమీదే వున్నాడు.

మంగపతి పరిస్థితి చూసి — 'ఏటో ఎదవ తాగుడూ ఈళ్ళూ. పావలా సరుకేసి పడిపోతారు. దమ్ముల్లేనపుడు ఏసుకోడం మానేయాలి. అంతే! ' నసుక్కుంటున్నాడు.

జ్యో॥

రిక్షా మంగపతి ఇంటి దగ్గర ఆపాడు. మంగపతి రిక్షాలోంచి వురికేసి కింద పడ్డాడు.

"లష్మమ్మొదిన లేదా? ఇల్లు తాళం పడి వుంది?"

"ఏం? నీకూ౯డా పని పడిందా దాన్తో?" మంగపతి వురిమాడు.

"ఏం లేదు. కొంచెం డబ్బివ్వాల్లే."

"అప్పిచ్చావా?"

"అప్పు కాదెహే. ఓ బాపతు లెక్క రావాల్లే," అంటూ రిక్షా తిప్పుకుని "సర్లే ఒత్తా" రిక్షా ఆసామీ వెళ్ళిపోయాడు.

"ఆగు."

ఒక్క ఉదుటన లేచి వెళ్ళి రిక్షా అతని చొక్కాపట్టుకున్నాడు మంగపతి.

"చెప్పు.. అదెంత డబ్బివ్వాలి? ఎందుకివ్వాలి?" నిలదీశాడు.

"నిన్న రేతిరి నాడ్డింగ్ కాడ బేరం ఒప్పజెప్పాను. కమిసన్ ఆనక యిస్తానంది." ఒళ్ళు మండి గుట్టు రట్టు చేశాడు రిక్షా అతను.

"ఆయ్" మంగపతి గాండ్రించాడు. "పిలు ఆ పింజారీని పిలు. నీ నెత్తిన ఓ సోడాబుడ్డి, దానినెత్తిన ఓ సోడాబుడ్డి బద్దలకొట్టేయాలిప్పుడ్నేను. పిలు"

"ఏదీ ఇంటికాడ నేదుగా! బాగానే వుంది. రెండు సోడాబుడ్లు నీనెత్తినే బద్దలేసుకో. మద్దెన వూరోళ్ళ మీద పడతావేంటీ?" అంటూ మంగపతిని ఓ తోపు తోసి "మంచికి రోజుల్లేవు" అనుకుంటూ రిక్షా వేసుకొని వెళ్ళిపోయాడు రిక్షా అతను.

మంగపతి మళ్ళీ పడిపోయాడు.

దీపం వెలగని ఎలక్ట్రిక్ స్తంభం వూత పుచ్చుకుని లేవబోయాడు. స్తంభం వచ్చి నొసటికి కొట్టుకుని గాయం చేసిందిగాని ఆసరా ఇవ్వలేదు. మంగపతి గురించి పట్టించుకొనే దిక్కు దిగనారిపోయింది.

* * *

నాల్రోజులు పోయాక .

కొట్లో కూర్చుని గోళ్ళు గిల్లుకుంటున్న మంగపతిని గెంటించేసి కొట్టుని అయిన కాడికి అమ్మి పారేసింది లక్ష్మి.

అదే క్షణంలో మంగపతిని 'ఒగ్గేసింది.'

పాత ఇల్లు ఖాళీ చేసింది. పేటలో పెంకుటిల్లు ఒకటి అద్దెకుచ్చుకుంది. ఈ ఇంట్లో కూతురు సుబ్బులుతోపాటు ఇంకో అయిదుగురు ఆడపిల్ల లుంటున్నారు. కురియన్ అస్తమానం వచ్చి పోతూంటాడు. రిక్షాలు 'పాసెంజర్ల'ని దింపుతూ వుంటాయ్. తీసుకు వెడుతూ వుంటాయ్.

మంగళపతి జాల్లేడు. సుహానా హోటలు ముందు చెయిజాపుతూంటే కురియన్నూ అతని సహచరులు ఓసారి తన్ని తగిలేశార్ట. నెలకావస్తోందీ వైనం తెలిసి.

సుహానా ఏయిర్ కండిషన్డు ప్రభ వెలిగిపోతోంది. భోగారావుగారికి ఒంట్లో బాగుండడం లేదు. ఒంట్లో కొవ్వు పెరిగిం

చంటున్నారు డాక్టర్లు గంగ వెర్రులెత్తిం చేసే ధనలక్ష్మిగారి పొంక బింకాలు నానాటికీ పెచ్చు పెరిగిపోతున్నాయి

హోటలు సుహానా భవంతిపైన ఇంకో ఐదంతస్తులు వెలుస్తున్నాయ్ 'సఫర్‌బార్ అవతరించబోతోంది భోగారావుగారు పాపం లాగ ఎదిగెదిగిపోతున్నాడు. పుణ్యాత్ముడు'

సుహానా హోటలుకి వెనకతట్టున ఓ మురుగు గొందె వుంది హోటలు మురుగంతా ఇక్కడే వుంటుంది పందిగుంటల మీద కుక్కలు రాజ్యమేలుతూవుంటాయ్' పబ్లిక్ కన్వీనియన్స్‌గా మానవసేవ చేసుకుంటోందాగొందె

హోటలు దొడ్డిగుమ్మంలోంచి ఇద్దరు కుర్రాళ్ళు బకెట్లకొద్దీ విస్తళ్ళు తెచ్చి గొందెలో పారేసి పోయారు కుక్కలు మూగబోతున్నాయ్ మూడు మానవాకారాలు వాటిని ఛకొడుతూ అవిలిస్తున్నాయ్ ఎవడికి అందిన ఎంగిలి విస్తళ్ళు వాడు లాగేసుకుంటున్నాడు కుక్కలు మాత్రం ఏం తక్కువ తిన్లేదు వాళ్ళతో లడాయికి దిగుతున్నాయ్


"ష్ ష్ష్ ఛ ఛఛ"

ఇస్టూ

"భౌ భౌభౌ భౌ భౌభౌ"

సమాజీవనంలో సమరం

అప్పుడెప్పుడో ఓ పాయినోటిచ్చి ఏదో సరుకడిగితే "చిల్లర్లేదు" అంటూ కసిరి కొట్టిన మంగపతి ***





చిట్టిబాబు సుందరిని ఒట్టి ప్రేమిస్తున్నాడు. గట్టిగా ప్రేమిస్తున్నాడు. గాఢంగా ప్రేమిస్తున్నాడు ఎన్నాళ్ళబట్టో ప్రేమించేస్తున్నాడు ఇక వుండబట్టలేక ఒకనాడు మంచి ముహూర్తం చూసుకుని తన ప్రేమనంతా కాగితం మీద ఒలకబోశాడు

సుందరి చిట్టిబాబు కంటే పన్నియర్ సీనియర్. చదువులో మాత్రమే

ఒకనాడు సుందరితో మాటా మాటా కలిపి, ఆ అమ్మాయి దగ్గర తెలుగు పద్య పుస్తకము తీసుకున్నాడు చిట్టిబాబు ఆమె పాపం, బుద్ధిగానే ఇచ్చింది. మనవాడే హస్త బుద్ధి తక్కువై అందులో ఆ ప్రేమలేఖ పెట్టి మర్నాడు తిరిగి సిన్సియర్ గా ఇచ్చేశాడు

ఆ అమ్మాయి చిట్టిబాబు ఇచ్చిన పుస్తకాన్నందుకుని, అప్పటికే బెల్ ఐపోయిందనే హడావిడిలో క్లాసులోకిపోయింది కాని అప్పటికే కుర్ర తెలుగు లెక్చరర్ కుర్ర కుర్చీలో కూర్చున్నాడు సుందరిని చూస్తున్నే సన్నగా నవ్వుతూ లోపలికి రమ్మన్నాడు తను ఆ రోజు పుస్తకం తీసుకురానందున స్టూడెంట్స్ నే బుక్ అడిగాడు. అప్పుడే తన బెంచీ వరుసలోకి రాబోతున్న సుందరి వెనక్కితిరిగి మాష్టారికి తన చేతిలోని పుస్తకాన్నందించింది

విరాట పర్వంలోని ద్వితీయాశ్వాసములో కీచకుడు ద్రౌపదిని ఉద్యానవనంలో కలుసుకుని తన మోహాన్నంతా వెళ్ళబోసుకుంటున్న ఘట్టం చెబుతున్నాడు కీచకుడు అనుభవించిన విరహాన్ని చక్కగా వివరించి చెపుతూ పేజీ తిప్పిన మేష్టారు టక్కున ఆగిపోయాడు ఒక చిన్న లేత గులాబీ రంగు స్లిప్ మీద "నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను వెంటనే దీనికి మీ సమాధానం కోరుతున్నాను!" అని రాసి వుంది చెబుతున్న పాఠాన్ని ఆపేసి ఉక్కిరి బిక్కిరయ్యాడు ఆ కుర్ర లెక్చరర్ అంతలోకి బెల్ కావడంతో తేరుకుని ఎవరూ చూడకుండా మెల్లిగా ఆ చీటిని తీసి తన దగ్గరున్న బెర్నార్డ్ షా బుక్ లోకి దోపేసి తిరిగి నవ్వుతూ బుక్ ఇచ్చేశాడు అలా బుక్ ఇచ్చేప్పుడు ఆ అమ్మాయి వేళ్ళను తాకేందుకు అతను చేసిన ప్రయత్నం వ్యర్థమైంది

స్టాఫ్ రూంలోకి రాగానే ఇంగ్లీష్

టి గౌరీశంకర్

మేడమ్ ఎదురై "హల్లో' మూర్తిగారు మీరు పుస్తకం తెస్తామన్నారు తెచ్చారా!" అని అడగ్గానే కుర్ర లెక్చరర్ ఊహల్లోంచి జారిపడి వెంటనే చేతిలోవున్న బెర్నార్డ్‌షా పుస్తకాన్ని తీసి "ఇదుగో" అంటూ ఆమె చేతిలో పెట్టేశాడు ఆమె అక్కణ్నుంచి కదిలి రీడింగ్ రూంలోకెళ్ళి కూర్చుని యధాలాపంగా పుస్తకాన్ని తిరగేస్తు చటుక్కున ఆగిపోయింది చీటీ చూసి అగ్గి అయిపోయింది వెంటనే లేచి యమ స్పీడ్‌గా ప్రిన్సిపాల్ రూంలో కెళ్ళింది అక్కడ ఇంకా ఎవరో కొంత మంది కొత్తవాళ్లు ఉండటం మూలంగా వివరంగా చెప్పలేక, అలా అని వెనక్కి తిరిగి రాలేక ఆ పుస్తకం మాత్రం అతని కందిస్తు "ఇది చూడండి!" అని ఇవతలి కొచ్చేసింది ఆ తరువాత వెళ్ళి చెప్పటం కుదరలేదు ఇంతలో కాలేజీ వదిలేశారు

ప్రిన్సిపాల్‌గారు పుస్తకం లోపలి చీటిని చూసి ముసిముసిగా నవ్వుకున్నారు ఈ ఆడవాళ్ళు ఏదొచ్చినా పట్టలేరు ఇన్నాళ్ళ బట్టి దెబ్బచేసి ఇప్పుడు మనసు పుట్టగానే అందరూ ఉండగానే పరుగెత్తుకొచ్చేసింది, అని మనసులో అనుకుంటు ఆ లెటర్‌ను గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు

ఉల్లాసంగా ఇంటికి వచ్చి, హుషారుగా ఈల వేసుకుంటు బుక్ టేబిల్ మీద విసిరేసి బాత్‌రూంలో కెళ్లాడు అలా పుస్తకం బల్ల మీది వేయటంతో అందు లోని కాగితం కొద్దిగా పైకొచ్చి కొస కనిపిస్తోంది మహిళా మండలి మీటింగ్‌కు బయలుదేరిన ప్రిన్సిపాల్‌గారి సతీమణి ఏదో చెప్పాలనుకుని భర్త గదిలోకొచ్చింది అలా కొట్టొచ్చినట్లు కనిపిస్తోన్న లేత గులాబీ రంగు కాగితం చివర్ను పుస్తకంలో చూసి వుండబట్టలేక తీసి చదివింది పళ్లు పటపటలాడిస్తు యుద్ధానికి సన్నద్ధమౌతుండగా, మహిళా మండలి నుంచి ఫోన్ వచ్చింది దాంతో ఇదేదో రాత్రికి తేల్చుకోవచ్చుననుకుని ఆ చీటీని వ్యానిటీ బ్యాగ్‌లో పడేసుకుని, సొంత కారు (డొక్కుది) రిపేరులో వున్న కర్మానికి టాక్సీలో బయలుదేరింది

సభ బాగానే జరిగింది బాగా పొద్దుపోయింది ఫ్రెండ్స్ కొంతమంది తమ కార్లలో లిఫ్ట్ ఇస్తామన్నా బెట్టుపోయి వద్దంటూ టాక్సీకోసం చూడసాగింది ప్రిన్సిపాల్‌గారి సతీమణి టాక్సీ దొరకలా కనీసం ఆటో కూడ దొరక లేదు చివరకు అటు ఇటు చూసి ఎవరు గమనించటం లేదని నిశ్చయం చేసుకుని ఒక రిక్షాను పిలిచి ఎక్కేసింది

ఇంటికి వచ్చే దారిలో ఒక కాలువ వంతెన వుంది అక్కడ ఎప్పుడూ నిర్మానుష్యంగా వుంటుంది అమావాస్య కావటం మూలాన ఇంకచెప్పనక్కర్లేదు అనుకున్నంత జరిగింది ఎవడో ఒక రౌడీ అటకాయించాడు రిక్షావాడు ముసలాడు కాబట్టి కళ్ళప్పగించి చూట్టం మినహా ఏం చేయలేకపోయాడు ప్రిన్సిపాల్‌గారి సతీమణిగారు నోరు తెరిచే శారు దొంగ ఒంటిమీది నగలన్నీ ఒలిచి ఇమ్మన్నాడు కాని అంతలో అట్నుంచి ఏదో సైకిల్ రావటంతో వాడు బెదిరిపోయి అందిందే చాలనుకుని ఆమె వ్యానిటీ బ్యాగ్ లాక్కుని చెట్లలోకి దూరిపోయాడు పోతేపోనీ వెధవ బ్యాగ్ ఆ సైకిలబ్బాయి ఎవరోగాని దేవుడిలా వచ్చాడు

అనుకుని తేలిగ్గా ఊపిరి పీల్చింది రిక్షావాడిక రివ్వున ముందుకు దూసుకుపోయాడు

దొంగ వ్యానిటీ బ్యాగ్ అంతా వెదికి చూశాడు, ఏమీలేదు, ఒక తెల్లటి చేతిరుమాలు చిన్న చీటీతప్ప ఒళ్ళుమండింది పక్క కాలువలోకి విసిరికొట్టాడు

తెల్లవారి కాలువ ఒడ్డున బట్టలుతికే చాకలి రత్తాలుకుఆ వ్యానిటీబాగ్ దొరికింది

తిన్నగా అది తీసుకొచ్చి కైలాసంగారి కిచ్చింది కైలాసంగారింట్లో మైల బట్టలుతుకుతుంది అది ఒక్క కైలాసంగారింట్లో ఏమిటి ఆ పేటంతా అదే కాంట్రాక్టు తీసుకుంది కైలాసంగారి కూతురు చదువుకున్న పిల్ల, పెళ్ళి కెదిగి వుంది అలాంటివారి కిలాంటి బ్యాగ్‌లు, షోకులుగాని తనలాంటిదాని కెందుకు, పైగా, దానికి ఎంతో కొంత డబ్బిస్తారు అని అది ఆశపడింది కైలాసంగారు మత్తెక్కించే రత్తి అవయవ ఒంపు సొంపులను చూపులతోనే నిమురుతూ బ్యాగ్ అందుకున్నాడు అది అలా ఒంటరిగా చిక్కినప్పుడు బట్టలేసే నెపంతో దాన్ని తడిమి తడిమి చూస్తు లొట్టలేయటం అతనెప్పట్నుంచో చేస్తున్న పని కాని ఇంకా అక్కడే వున్నాడు ఏమాత్రం ముందుకు సాగలేదు అదే అతని దిగులు ఇవ్వాళ వ్యానిటీబ్యాగ్ పుణ్యమా అని దాని లోపలి చీటీని తీసి చదివాడు అబ్బా! రత్తి ఎన్నాళ్ళకు తన్ని కనికరించింది' మెలికలు తిరిగిపోయాడు కాని ఇది రత్తి తనకు రాసిందా' దానికి చదువురాదే' అన్న ఆలోచన రాకపోలేదా నరునికి ఆ దానిదేముందిలే! అది ఎంతోమంది చదువొచ్చిన వాళ్ళ ఇళ్ళల్లో తిరుగుతూ వుంటుంది ఎవర్నో పట్టుకుని రాయించి వుంటుంది పైగా ఆడవాళ్ళు నోరు విప్పి చెప్పరు ఇలా ఉత్తరాలద్వారా తెలియజేస్తారు అతని కప్పుడు రుక్మిణి, దమయంతి, శకుంతల వగైరాలాంటి పురాణ స్త్రీలు వరుసగా గుర్తుకొచ్చారు. మీసాన్ని దువ్వుకుంటూ 'రత్తీ' నీకు స్వర్గాన్నే చూపిస్తా'అని అనుకుంటుండగా కూతురు రాజీ వచ్చింది బట్టల పద్దు రాస్తు, రాస్తు తండ్రి చేతిలో నల్లగా, మిలమిల మెరుస్తున్న బ్యాగ్‌ని చూసి చటుక్కున లాక్కొని సంతోషంతో కళ్ళింత చేసుకుని చూడసాగింది ఇంకా నయం దానిలోని చీటీ తీసి అంతకుముందే లాల్చీ జేబులో వేసుకున్నారు కైలాసంగారు రాజీ ఆ బ్యాగ్ తనకోసమే రత్తి తెచ్చిందని తెలుసుకుని కృతజ్ఞతగా ఓ చెంబుడు కాఫీ పోసి ఇచ్చింది రత్తాలుకు ఆ పిల్ల రత్తాలు కాఫీ తాగి తృప్తిగా త్రేన్చి వెళ్ళిపోయింది అది వెళ్ళినవైపే చూస్తూ ఎలా? ఎప్పుడు? ఎక్కడ? అని ఆలోచించసాగాడు కైలాసం'

ఆ రాత్రంతా కైలాసానికి నిద్రపట్టలేదు ఆయన కొడుక్కి నిద్ర పట్టలేదు తెల్లారితే కొత్త సినిమా మార్నింగ్‌షోతో రిలీజవుతోంది వెళ్ళేందుకు డబ్బు లేదు వీళ్ళు నిద్రపోలేదు కదాని తెల్లవారటం ఆగిపోదుగా! దాని పని అది చేసింది వీడి పని వీడు చేశాడు తండ్రి చూడకుండా మెల్లిగా వెళ్ళి లాల్చీ జేబులో చేయిపెట్టి డబ్బులకై వెదికాడు డబ్బులు దొరకలేదు. కాని ఒక లేత గులాబీ రంగు కాగితం దొరికింది తీసి చూశాడు ఆశ్చర్యం' అది క్రితం రోజు తాను సుందరికి వ్రాసిన ప్రేమలేఖ! ***

అర్థంకానిది/

వింధ్యవాసిని

లోకంలో అర్థం కాని విషయాలవుతే ఎన్నో వున్నయ్. కానీ అవన్నీ మన కిప్పుడు అప్రస్తుతం. అయితే 'నీ కెప్ప టికీ అర్థంకాని దేవిటయ్యా?' అని రామా రావనే ఒక వ్యక్తిని అడిగి చూడండి, "ఆడదాని మనసు" అని టక్కున సమా ధానం వస్తుంది. అసలీ రామారావంటే ఎవరూ, ఇతగాడి కథా కమామిషూ ఏమిటీ? అని అడుగుతారా. ఇదుగో ఇదే సమాధానం..

త్రిశంకు స్వర్గంలో వేళ్లాడే మధ్య తరగతి జాతికి చెందిన ఒక మెంబరు రామారావు. ఇతడి నివాసం ఒక మహా నగరంలో! ఉద్యోగం యూనివర్సిటీ లెక్చరర్ గిరీ; కుటుంబం భార్య, ఒక కొడుకూను. అత నుంటున్న యిల్లు యూనివర్సిటీనించి బస్సులో పది నిము షాల్లో వెళ్ళగల మార్గం. ఇంటిదాకా వెళ్ళటం సులువే కానీ, ఇంట్లోకి వెళ్ళటమే కొ_స్త కష్టం. ఎందుకంటే ఆ ఇల్లుంటు న్నది నాలుగంతస్థుల ఒక భవనపు నాలుగో అంతస్థులో. అసలు దాన్ని ఇల్లనటంకంటే గది అంటే బావుంటుం దేమో. అందులో వున్నవి ఒక మంచం, ఒక టేబిల్, ఓ కుర్చీ, ఓ బుక్ షెల్ఫ్, రెండు సూట్ కేసులూ. ఒక పక్కగా చిన్న పార్టిషన్‌తో ఏర్పడ్డ వంటగదీను. దీన్నిబట్టి ఆ గది ఎంత మల్టీపర్పస్‌గా వుపయోగిస్తుందో మనకి అర్థం అవు తుంది. వంటగది పోగా మిగిలిన భాగం, సిట్టింగ్ కమ్ స్లీపింగ్ కమ్ రీడిం(రూమన్నమాట. వంటగది నానుకు వున్న బాత్‌రూమ్‌లో మరీ లావా(వాళ్ళవుతే ఖాయంగా ఇరుక్కు పోవ(సిందే. ఇంతోటి ఇంటికీ అద్దె నూర్రు పాయలు నెలనెలా చెల్లించుకుంటున్నారు

ఇక అసలు విషయానికొద్దాం. ఆ వే(శనివారం. మిగతా రోజులకంటే కొ_స్త త్వరగా ఇంటికొస్తాడు రామారావు. అందు కని మామూలుగా సుమతి ఏదయినా టిఫిన్ చేస్తుంది శనివారం సాయంత్రాలు. ఆవేళ మధ్యాహ్నమే ఆలోచించి నిర్ణ యించుకుంది పకోడి చేయాలని సాయంత్రం. పకోడి వేడిగా అవుతేనే బావుంటుందని మూడింటికి మొదలు పెట్టింది చేయటం. ఉల్లిపాయలు తరిగి, పిండి కలుపుకుని, స్టవ్‌మీద నూనె పెట్టే సరికల్లా రానేవచ్చాడు రామారావు. లోప లికి వచ్చీరాంగానే, చేతిలో పుస్తకాలు టేబిలుమీద పడేసి, షూస్‌ని మంచం కిందికి తోసేసి, షర్ట్ విప్పి దండెంమీద గిరాటేసాడు. మంచంమీద నిద్రపోతున్న బాబు పక్కనే పడుకుని న్యూస్‌పేపర్ చేతిలోకి తీసుకుని "సుమా! కాసిన్ని మంచినీళ్ళు పట్రా" అని కేకేసాడు.

వళ్ళు మండింది సుమతికి. అతను రాగానే చక్కగా బట్టలు మార్చుకుని, విప్పిన బట్టలు హేంగర్స్‌కి తగిలించి వుంచి బుక్స్ నీట్‌గా షెల్ఫ్‌లో సర్ది, కాళ్ళూ ముఖం కడుక్కుని తనదగ్గిర



కూచుంటే చక్కగా కబుర్లు చెబుతూ, టిఫిన్ పెట్టాలనుంటుంది తనకి. కాని అతనెప్పుడూ అలా చెయ్యడు. అంత పెద్ద ఇంట్లో అతడికి మంచినీళ్ళందుకోవాలన్నా కష్టమే మరి.

"అబ్బ! రాగానే ఆ న్యూస్ పేపరొకటీయనకి తద్దినంలాగా. ఏమండీ కాస్త బట్టలు మార్చుకుని ముఖం కడుక్కో రాదూ! టిఫిన్ పెడతాను" అని ఇవతలికి రాకుండానే కేకేసింది.

అసలీ మాటలేవీ అసలు మనిషి చెవికే ఎక్కినట్లులేవు "మంచినోళ్ళోయ్" అని మళ్ళీ విన్పించింది బయట్నించీ. "తన పాటే గానీ నా మాట వినిపించుకోరుకదా?" అని గొణుక్కుంటూ, గ్లాస్‌తో నీళ్ళు తీసుకుని వెళ్ళింది.

"అలా పడుకుని పేంటంతా నలపక పోతే కాస్త బట్టలు మార్చుకోరాదుటండీ!" అంది. "మార్చుకోరాదనేం కాదుగానీ, అసలు లుంగీ ఎక్కడుందో నాకెలా తెలుస్తుంది?"

"మీ లుంగీన్నేను వంటింట్లో దాచుంచుతానా ఏం? అదెప్పుడూ ఆ దండెం మీదే వుంటుందిగా?" అని విసుక్కుంటూనే లుంగీ అతనికి అందించి, అతడు విప్పిన పేంటూ, షర్టు తీసి నీట్‌గా హేంగర్స్‌కి తగిలించి, పుస్తకాలన్నీ షెల్ఫ్‌లో సద్ది, వంటింట్లోకి వెళ్ళింది.

ఇంకాసేపుంటే సుమతి మళ్ళీ దండకం మొదలు పెడుతుందని భయపడి, బాత్‌రూమ్‌లో దూరి తలుపేసుకున్నాడు రామారావు.

మూకుడులో నూనె మరుగుతూంది. పిండి చిన్నముద్దలుగా చేసి వేద్దామని గిన్నెలో చేయి పెట్టబోయింది సుమతి. ఇంతలో బాత్‌రూమ్ తలుపు తెరుచుకుంది. "సుమా! టవల్ నా టవల్ ఇటివ్వు" అంటూ ముఖంమీద నీళ్లు కారుతూ బయటికొచ్చాడు.

"అబ్బ! టవల్ కూడా తీసుకోలేరు కదా?" గొణుగుతూనే టవల్ అందించింది సుమతి.

"అదికాదు సుమా! నా టవలేదో నాకు గుర్తుండి చావదు. ఏదో ఒకటి తీసుకుంటే అది నీదనో, బాబుదనో గోల పెడతావు నువ్వు" అని చిరునవ్వులు వలకబోస్తూ, ముఖం తుడుచుకుని సుమతి పక్కనే పీట వాల్చుకుని కూచున్నాడు.

వేడివేడి పకోడీల ప్లేటు అందించింది సుమతి. ఒక్కొక్కటే నెమ్మదిగా నములుతూ "భలే రుచిగా వున్నాయోయ్. తింటే నువ్ చేసే పకోడీలు తినాలి .. వాహ్ . .మార్వెలెస్ " అని గాలికొట్టి వుఫ్ఫేస్తూ ప్లేటు ఖాళీ చేశాడు రామారావు.

లోలోపల సంతోషిస్తూనే పయికి మాత్రం, "అబ్బ! పొగడటంలో మీరు ఎక్స్‌పర్టండీ! సరేగానీ ఇంకో నాలుగు వెయ్యమన్నారేమిటి?" అడిగింది సుమతి.

రామారావుకీ తెలుసు, పొగడ్తకో నాలుగు పకోడీలు ప్లేటులో కొస్తాయని. అయినా అన్నీ తనే తినేస్తే పాపం ఇక సుమతికేం మిగలవని, రెండుసార్లు మాత్రమే నాలుగు చొప్పున వేయించుకు తిని, కాఫీ తాగి నింపాదిగా లేచాడు.

మళ్ళీ వెళ్ళి మంచం మీద కూచుని, పేపరు అందుకోబోయాడు. అంతలో బాబు నిద్ర లేచి రాగం మొదలుపెట్టాడు "అమ్మా" అంటూ.


లోపలినించే కేకేసింది సుమతి. "కాస్త బాబు నెత్తుకోండీ" అంటూ. అతనికా మాట విన్పించిందో లేదో సుమతికైతే తెలీదుగానీ బాబు రాగం మాత్రం ఆపలేదు.

"ఏం చేస్తున్నారండీ?" అంటూ మళ్ళీ కేకేసింది.

సుభాషితాలు

మనిషి ఎదుటివారికి ధారాళంగా దానంచేసే వాటిలో మొదటిది సలహా.

—రోష్‌ఫోకాడ్



జవాబుగా ఏడుస్తున్న బాబు నెత్తుకుని లోపలికొచ్చాడు రామారావు. "వాడు "అమ్మా!" అనేడుస్తూంటే నన్నెత్తుకోమంటావేమిటోయ్? ఇప్పుడేగా నిద్ర లేవటం—నా మాట వినడుగానీ కాస్త నువే ఎత్తుకుందూ?" అని అందించి మళ్ళీ తన పేపర్ రీడింగ్‌లో పడిపోయాడు.

అప్పుడే దోగాడటం నేర్చుకున్న బాబుని ఆ చిన్న వంటగదిలో పట్టుకోవటం మహా కష్టం. వదిలేస్తే,చెంబూ, తప్పేలాలు మధ్యలో పోగేసి ఆట మొదలు పెడతాడు. వళ్ళో కూచోబెట్టుకుని వాడికోసం రెడీగా వుంచుకున్న పాలు తాగించింది సుమతి.

"కాలేజీకీ వెళ్ళి ఉద్యోగం చేసిరావటం తప్పించి, ఇంట్లో ఇటున్న పుల్లని అటు వెయ్యరు కదా? అసలీయనకు నే నంటూ ఓ మనిషిని అస్తమానూ పనితో సతమతమయి పోతూంటానని అర్థమవుతుందో లేదో ఆ దేవుడికే తెలియాలి. ఈ మాత్రానికిలా వుంది. నేనూ ఏ ఉద్యోగమో మొదలుపెడితే ఇక రెండు రోజులకే మంచంలో పడిపోతానేమో నేను. అందుకే కాబోలు, ఎప్పుడు నే నుద్యోగం చేసే మాట వచ్చినా తేలిగ్గా కొట్టి పారేస్తుంటా రీయన. అయినా మరీ కాస్త పిల్లడినయినా తీసుకోకపోతే ఎలా వేగటం?" అని తనలోనే తనే అనుకుంటూ పని చేసుకుపోతూంది సుమతి.

వంట ముగించి బాబుకి పాలు పట్టి, నిద్ర పుచ్చేసరికి ఎనిమిది గంటలయింది. రామారావు, సుమతి భోజనాలు ముగించేసరికి తొమ్మిదిగంటలు కొట్టాయి. అంట్లగిన్నెలన్నీ తోముకుని, బాత్‌రూము, వంటగది శుభ్రం చేసేసరికి మరో అరగంట పట్టింది సుమతికి. రామారావు ఎప్పుడూ అంటోనే వుంటాడు, పనిమనిషిని

పెట్టుకోరాదా అంత కష్టపడకపోతే అని. "ఆయనకేం తెలుస్తుంది? మా బాగా అంటారు పనిమనిషిని పెట్టుకోరాదా అని. ఈ సిటీలో పనిమనిషి అంటే మాటలు కాదు. ఏ ఇరవయి రూపాయలో ఇచ్చుకోవాలీ మాత్రం పనికి" అనుకుంటుంది సుమతి.

పని ముగించి ముందు గదిలోని కెళ్ళింది సుమతి. రామారావింకా చదువుకుంటున్నాడు. బాబుకి పక్క బట్టలు సర్ది, తానూ పడుకోబోతూ అంది— "రేపాదివారమేగా? ఇంక పడుకోరాదాండి" అని.

"ఏఁవిటో విశేషం?" అన్నాడు రామారావు.

"పడుకోవటానికి విశేషమేంటండీ. మీది మరీ చోద్యం" బుగ్గలు నొక్కుకుంది సుమతి.

"అది కాదమ్మాయ్. పదిన్నర దాటందే నాకు నిద్ర పట్టదని తెలుసు నీకు. అయినా పది గంటలు దాటకముందే పడుకోమంటున్నావంటే . "

"అంటే లేదు, గింటే లేదు. మీ ఇష్టంబాబూ. నే నేమో పడుకుంటున్నా అంతే" అంటూ దిండుమీద తలవాల్చింది.

"పోనీలేవోయ్. అంతగా అడుగుతున్నావుగా. నేనూ పడుకుంటా? మా బంగారువిగా. కాసిన్ని మంచినీళ్ళు తెచ్చి పెట్టుదూ" అన్నాడు పుస్తకంమీంచి దృష్టి మరల్చకుండానే.

ఏకళనుందో, విసుక్కోకుండా మంచినీళ్ళ గ్లాసు అందించింది. నీళ్ళు తాగి, గ్లాస్ని బల్లమీదుంచి, సుమతి చేయిపట్టి దగ్గరికి తీసుకున్నాడు.

"అరే. ఈవాళ మల్లెపూలు పెట్టుకోలేదేం?"

"ఆఁ! మీరు తెచ్చారా ఏం నేను పెట్టుకోవటానికి."

"సారీ డియర్, మరిచిపోయా. అయినా నువ్వింటిదగ్గిర తీసుకుంటావుగా?"

"మీరు స్వయంగా తెస్తే వున్న సంతోషం, ఇంటిదగ్గిర కొంటే రాదని మీ కెన్నిసార్లు చెప్పానో. అయినా ఎప్పుడో తప్ప తేవాలని మీకు గుర్తురాదు. మీకు నిజంగా ఇంటరెస్ట్ వుంటే గుర్తురాకుండా వుంటుందా? ఈవాళ మీమీద కోపం వచ్చే ఇంటిదగ్గిర కొనలేదు" తలవంచుకుని అంది సుమతి.

"పిచ్చిదానా! అంత చిన్న విషయాన్ని ఇంత సీరియస్గా తీసుకోవాలా? ఇప్పట్నించీ ఇంకెప్పుడూ మరిచిపోకుండా, నీకోసం పూలుతెస్తా రోజూ, సరేనా? . ఏదీ ఇంకా కోపమే .." అని అంటూనే, ఆమె జుట్టులో ముఖం దాచుకుని, అందులోంచి వస్తున్న షాంపూ వాసనల్ని అనుభవించ సాగేడు. ఇలా కోపం రావటం, భర్తతో పోట్లాడటం సుమతికి మామూలే. అయినా అతను కాస్త మెత్తగా మాట్లాడి, దగ్గరికి చేర్చుకునేసరికి అన్నీ మరిచిపోతుంది.

*　　*　　*

ఆవేళ ఆదివారం. గంట ఎనిమిది దాటింది. తీయటి కలలు కంటూ, ఇంకా నిద్రపోతూనేవున్నాడు రామారావు. బాబుకి స్నానం చేయించి, తనూ స్నానంచేసి వంటచేయటం మొదలుపెట్టింది సుమతి.

బాబుకి తాను నిద్రలేచాక, ఇంట్లో

ఇంకెవరూ నిద్రపోవట మనేది నచ్చదు అందుకని తండ్రిని ఎలా లేపాలా అని ప్రయత్నాలు చేస్తున్నాడు మంచం పట్టుకుని, మెల్లిగా నిలబడి నాన్న చెవిపట్టుకు లాగాడు గబుక్కున దుప్పటిని నిండా కప్పేసుకున్నాడు రామారావు ముఖం నిండా కొంచెం లాగి కప్పుకోవటంతో పాదాలు బయటికొచ్చాయి బాబు గబగబా అటువేపు దోగాడి వెళ్ళి కాళ్ళు పట్టుకు లాగాడు ఇంక లేవకపోతే తప్పేట్టులేదనుకున్నాడు రామారావు అయినా ముసుగు తీయకుండానే, "సుమా! పైమెంతయిందోయ్. అప్పుడే లేపమని వీణ్ణి పంపించావా?" అని అరిచాడు

"అప్పుడే ఎంటి? ఇంక లేద్దురూ ఎనిమిది గంటలు దాటిపోయింది"

దుప్పటి తొలగించి లేచి కూర్చుని, ఆవలించి, బాబుని ఓ ముద్దు పెట్టుకుని, "టిఫిన్ చేస్తున్నావా?" అన్నాడు

"మీ కిష్టమయిందే ఇవాళ దోశెలు పోస్తున్నాగానీ, త్వరగా లేచి ముఖం కడుక్కోండి"

దోశెలనేసరికి సంతోషంతో మంచం దిగి, లలలా అని పాడుకుంటూ, బాత్ రూమ్‌లోకి వెళ్ళాడు రామారావు

కాఫీకి నీళ్ళుపెట్టి, కాఫీ పొడి డబ్బా అందుకుంది సుమతి "సుమా! నా బ్రష్ కనిపించటం లేదోయ్ కొంచెం చూసి పెడుదూ" బాత్ రూమ్‌లోంచి విన్పించింది

"అబ్బ! కంటి ముందున్న వస్తువు కూడా కనిపించవు కదా ఈయనకి?" అని విసుక్కుంటూ వెళ్ళి బ్రష్ అందించింది

రామారావు ముఖం కడుక్కుని కాఫీ తాగేసరికి, బల్లమీద షేవింగుసెట్, వేడినీళ్ళు, అద్దం, రెడీగా వున్నాయి

"ఆదివారమేగా? రేపు చేసుకుంటాలే సుమా షేవింగ్" అంటూ పేపర్ అందుకోబోయాడు

"ఆదివారమయితేనేం? బద్ధకించకుండా తొరగా షేవింగ్ చేసుకుందురూ ఇంకా టిఫిన్ తిని, తలంటుకోవాలిగా మీరు" అంది సుమతి కొబ్బరిపచ్చడి రుబ్బుతూ

"ఏంటోయ్ ఇవాళ సినిమా ప్రోగ్రాం ఏమయినా వేశావా ఏం? అంతగా బతిమాలుతున్నావ్ షేవింగు చేసుకోమని ఏమి సినిమా చూడాలనో"

"మనం సినిమాకెళ్ళి ఎన్నాళ్ళయిందో సినిమా మాటెత్తితో నేర్పుగా దాటించేస్తారు ఎప్పుడూ బయట తిరిగే మీకు సినిమా అంటే ఇష్టంలేకపోవచ్చు కానీ నాకోసమయినా తీసికెళితేనేం?"

"అసలిప్పుడేమన్నానోయ్? నేనేం తీసికెళ్ళనన్లేదుగా, నువ్వు అడగటం నేను కాదనేంత ధైర్యమా ఏమి సినిమానో తెలుసుకుందామని అంతేగాని, అయినా నాకెందుకులే ఏ సినిమానో సినిమా చూసినా నాకు పేరు గుర్తుండదు అసలు" అంటూ షేవింగ్ మొదలుపెట్టాడు

ప్రతీ ఆదివారం తలంటుకుని స్నానం చేయటం చిన్నప్పట్నించీ అలవాటు రామారావుకి దానికి, పెళ్ళికాకముందు తల్లీ, పెళ్ళయాక సుమతీ సహాయం చేస్తున్నారు ఆదివారం ప్రోగ్రామ్‌లో భార్యాభర్తలిద్దరికీ ఇష్టమయిన కార్యక్రమమూ అదే ఆము చముతో తల అంటి, వంటికంతా రాయటానికి, సుమతి సహాయం చేస్తున్నంత

సేపూ ఏదో ఒకటి అంటూనే వుంటాడు రామారావు.

మర్దనా చేయటంలో సుమతి చేయి ఏకాస్త గట్టిగా తగిలినా, "ఊం! బాగా అంటించు. ఆడవాళ్ళకి మొగుడిమీద అధికారం చెయ్యటానికీ, తమ కోపమంతా చూపించటానికి ఇది మంచి ఛాన్స్. నీ ఇష్టమొచ్చినట్లల్లా మర్దిస్తున్నావుగా? కానీ ఏంచేస్తాం, నీ చేతిలో చిక్కిపోయాను." అంటాడు.

ఎక్కడయినా కాస్త నూనె ఎక్కువ రాసినా, "బాగా లోనికి పోనియ్యి. అయినా నాకేం? ఆ జిడ్డంతా పోగొట్టలేక అవస్త పడేదీ నువేగా?" అంటాడు.

"మీది మరీ చిన్నపిల్లాడి వాటం. కొంచెంసేపు కుదురుగా కూచోలేరు కదా? అయినా మరీ అలా పిల్లజమీందారులా నిటారుగా కూచోకపోతే, కాస్త వంటికి రాసిన నూనె రుద్దుకోకూడదూ?" అని చివాట్లేస్తుంది సుమతి.

అలా కీచులాటలతో, నవ్వులతో ముగుస్తుంద ఆఫార్స్ ఆదివారాలు. మధ్యాహ్నం భోజనం అయేక, చిన్న కునుకు తీద్దామని మంచంలో చేరాడు రామారావు. వంట సామాన్లు సర్దుతున్న సుమతి, "నిద్ర పోయేరు ఇవాళ మీ బట్టలన్నీ ఇస్త్రీ చేయాలి. ఉతికి వుంచాను నిన్న" అంది.

"సాయంత్రం సినిమా ప్రోగ్రాం వేశావుగా?"

"సాయంత్రంవెళ్ళే సినిమాకి, ఇప్పుడు ఇస్త్రీ చేయటానికొచ్చిన కష్టమేమిటి?"

"అదికాదు సుమా. నా కసలు సరిగ్గా చేయటం రాదుగా? నేను ఐరన్ చేసినా, ఎలాగూ నీకు నచ్చదు. మళ్ళీ చేయకుండా వుండవు."

"నేను చేసేటప్పుడు చూసి, కాస్త మెల్లిగా చేయటం నేర్చుకోండీ అంటే వినరుకదా? మీ బట్టలు మీరు ఇస్త్రీ చేసుకోకపోతే ఎలా? ఎన్ని పనులని చేయను నేను. ఆ పేంట్లు, ఒక్కొటి ప్రెస్ చేసే సరికి నా ప్రాణం పోయినట్లవుతుంది. అయినా నాదే తప్పు. మొదట్లో మీ కేమీ నేర్పకుండా, అన్నీ నేనే చేయటం తప్పయింది. ఇప్పుడు బాబుతోటి తీరకున్నా. అన్ని పనులూ చచ్చినట్లు నేనే చేయాలిసిందే ." సుమతి ఇంకా అలా గొణుగుతూ వుండగానే రామారావుకి నిద్ర పట్టేసింది.

మధ్యాన్నం ఇస్త్రీచేయటం ముగించి, సాయంత్రం త్వరగా వంట కానిచ్చి రెడీ అయి రామారావుకి మేలుకొలుపు పాడింది టైమయింది లేవమంటూ.

చక్కగా ముస్తాబయి, పిల్లాన్నొకరూ, పిల్లాడి సరంజామాగల బాస్కెట్ నొకరూ పుచ్చుకుని, ఉషారుగా బయలుదేరి, నాలు గంతస్థుల మెట్లూ దిగి రెట్టింపయిన వుత్సాహంతో సినిమాకి వెళ్ళిన ఆ దంపతులు, ఆకలితో దిగేసుకున్న ముఖాలతో, నిద్రపోతున్న బాబుని మోసుకుని, ఉసూరుమంటూ తిరిగివచ్చారు. అన్ని మెట్లూ ఎక్కి తమ గృహాన్ని చేరేసరికి సగం ప్రాణం పోయింది సుమతికి.

అయినా ఓపిక తెచ్చుకుని పక్క సర్ది బాబుని పడుకోబెట్టి, బట్టలు మార్చుకుని, కంచాల్లో అన్నం వడ్డించింది.

భోజనం ముగించి లేస్తుండగా, పక్క

సుభాషితాలు

ప్రతీ పురుషుడు స్త్రీని అర్థం చేసుకున్నాననుకుని బోల్తా పడుతుంటాడు.

—డేవిడ్ మెకాలే



పౌడి అందించి, "నేనింకా సామాన్లవీ కడుక్కోవాలి. ఈలోగా, కొస్త మీ పక్క దులుపుకుని, దోమతెరలు కట్టే యండి." అని భర్తకి పురమాయించి తన పనిలో పడిపోయింది.

రామారావుకి సినిమాలంటే యిష్టం వుండదు. అప్పుడప్పుడూ కొస్త తల నొప్పి కూడా వస్తూంటుంది సినిమా కెళ్ళినరోజు. ఆవేళ కూడా కొద్దిగా తల నొప్పిగా వుంది అతడికి. మెల్లిగా వెళ్ళి బాబు పక్కనే చోటు చేసుకుని కళ్ళమీద చేయిపెట్టుకుని పడుకున్నాడు. ఒక ఐదు నిమిషాలు అయాక సుమతి చెప్పిన పని చేద్దాం అనుకుని, తెలీకుండానే నిద్ర పట్టే సింది అలసటవల్ల.

తన పనంతా ముగించుకుని, ముఖం కడుక్కుని తుడుచుకుంటూ పడుకుందా మని వచ్చింది సుమతి. పక్కా, దోమ తెరా రెడీచేయకపోగా నిద్రపోతున్న భర్తని చూచి వళ్ళు మండిపోయింది సుమతికి.

"ఇంక జన్మలో ఈయన్ని సినిమాకి తీసికెళ్ళమని అడగను. తనలాగే నేనూ అలసిపోయుంటానని ఆయనకి తోచదుగా? ఏదో నాకోసంగా వచ్చి, మహా కష్టపడి పోయినట్లు చేస్తారు. ఆ పాడు సినిమాలు వద్దు-ఈ గొడవా వద్దు" అనుకుంటూ, అతడి పక్కవేసి, రెండు దోమతెరలూ కట్టింది.

"మీ పక్కలో వచ్చి పడుకోండి" అంటూ భర్తని లేపింది. కళ్ళు తెరిచిన రామారావు, అలసిపోయి చిన్నబోయిన

సుమతి ముఖంలోకి చూడగానే కరిగి పోయాడు.

"బాగా చాలయిపోయింది కదూ!" అంటూ దగ్గిరికి తీసుకోబోయాడు.

ఇష్టం చూపక ముఖాన్ని తిప్పేసుకుంది సుమతి.

"ఎందుకోయ్. దోమతెరలవీ రెడీ చేయలేదని కోపమా" అంటూ గడ్డాన్ని పట్టి తనవైపు తిప్పుకున్నాడు.

సుమతి కళ్ళనిండా నీళ్ళున్నాయి. అలాగే అడిగేసింది. "ఏమండీ మీ కళ్ళకి నేనెలా కనిపిస్తానసలు? ఒక సర్వెంట్‌లా కాకుండా, మీ అర్ధాంగినని మీ కెప్పుడయినా అనిపిస్తుందా?" అని గొంతు బొంగురుపోయింది.

ఆమె నోటిని మూసేస్తూ, "ఛ! ఏం మాటలు సుమా? నా ప్రాణమయిన నిన్ను నేను సర్వెంట్‌లా చూస్తానా? నువ్వెందుకలా అనుకుంటావు? బద్ధకంవల్ల అప్పుడప్పుడూ నిన్ను బాధిస్తుంటానే గానీ, నువ్వు లేకపోతే నేను బ్రతకలేనని నీకు తెలీదా సుమా? నువ్వు చెప్పినట్లు చేస్తాను. ఇంకెప్పుడూ ఇలాంటి మాటలనకు, నేను భరించలేను" అంటూ దగ్గిరికి తీసుకున్నాడు.

* * *

బాబుకి రెండ్రోజులనించీ జ్వరం. ఆ వేళే కాస్త నెమ్మదించింది. అయినా అస్తమానూ దేనికో దానికి పేచీపెట్టి ఏడుస్తూనే వున్నాడు. వాడితో వేగలేక విసుగెత్తిపోయింది సుమతికి.

మధ్యాహ్నం వాడు నిద్రపోయేసరికి తానూ వాడి పక్కనే మేను వాల్చింది. బాగా పట్టేసింది నిద్ర. తలుపు వేయటం కూడా గుర్తులేక పోయింది. ఎప్పుడు లేచాడో బాబు శబ్దం చేయకుండా వరండాలోకి వెళ్లాడు.

నిద్రలో చేత్తో తడిమి చూసుకుని ఉలిక్కిపడి లేచి కూచుంది సుమతి. బాబు కన్పించలేదు గబగబా వరండాలోకి వెళ్ళి చూసింది. మోట్లనానుకుని వున్న పిట్ట గోడని-తన చిన్న చేతులతో పట్టుకుని మొదటి మెట్టు మీద నిలుచుని వున్నాడు. సుమతిగుండె గుభేలుమంది. ఒక్క అంగలో వెళ్ళి అందుకో బోయింది. అంతలో బాబు కొంచెం ముందుకి జరిగాడు.

"బాబూ" అని అరిచి సుమతి పట్టుకునేలోగా, ఒక్క క్షణంలో పదిమెట్లు దొర్లిపోయాడు. అదృష్టకొద్దీ ఎవరో పయికి వస్తున్నారు అతను బాబుని చూసి, గబుక్కున దొర్లకుండా పట్టుకున్నాడు. సుమతి వాళ్ళ పక్కనున్న మూడో ఇంటి అతను ఆయన.

అతడు బాబుని సుమతికి అందించే సరికే బాబుకి స్పృహలేదు. కళ్ళు మూసుకుని వున్నాడు. సుమతికి కళ్ళు తిరిగాయి. ఏమి చేయాలో కూడా తోచలేదు. బాబుని పట్టుకున్నతనే, తన ఇంట్లోకి వెళ్ళి తన భార్యని ఆమెకి తోడుగా, డాక్టర్ దగ్గిరికి పంపేడు. సుమతి ఇల్లుతనే తాళంపెట్టాడు. స్పృహలేకుండా వేలాడిపోతున్న బాబుని తీసుకుని, పక్కింటామె సహాయంతో, బస్‌లో ఎక్కి అక్కడికో మైలుదూరంలో వున్న డాక్టర్ దగ్గిరికి బయలుదేరింది ఆమె.

సుభాషితాలు

మన గొప్పతనాన్ని మెచ్చుకునే మనిషికంటే మన బలహీనతలను చూసి జాలి సలహా చెప్పేవాడు నిజమైన స్నేహితుడు —పై



ప్రమాదమేమీ లేదనీ, తలకి కాస్త గట్టిదెబ్బ తగలటంచేత స్పృహ పోయిందనీ చెప్పి అరగంటలో ఏదో ఇంజక్షన్ ఇచ్చి స్పృహ తెప్పించాడు డాక్టర్ కానీ రెండు రోజుల్లో నెమ్మదించిన జ్వరం మళ్ళీ తిరగబెట్టింది బాగా టెంపరేచర్ వచ్చేసింది ఏవో మందులు ఇచ్చి పంపాడు డాక్టర్

మళ్ళీ సిటీబస్ కాచ్ చేసి సుమతి ఇల్లు చేరేసరికి సాయంత్రం ఆరుగంటలయింది

తల పగిలిపోతూంది సుమతికి నొప్పితో నిద్రపోతున్న బాబుని మంచం మీద జాగ్రత్తగా పడుకోబెట్టి కాస్త టీ పెట్టుకు తాగింది ముఖం కడుక్కుంది అంత టయిమయినా రామారావింకా ఇంటికి రాలేదు కాలేజీలో మీటింగ్సేపయినా వుంటే ఇలా లేట్ అవటం అప్పుడప్పుడూ జరిగేదే కానీ ఈవాళ బాబుకింద స్పృహపోవటం, డాక్టర్ దగ్గరికి రావటం చాలా చిరాకుగా వుంది సుమ ఏమీ పనిచేయాలన్పించలేదు దానికి ‹ భర్త రాకపోవటం మరింత చిరా వుంది

అలాగే వెళ్ళి అన్నానికి ఎసరు సింది కూరలు ఏమీ చేయాలన్పిం ఊరగాయ వేసుకోవచ్చులే ఈ ష అనుకుంది గంట ఏడున్నర అవుతుం ఇంటికొచ్చాడు రామారావు, అ అలాగే నిద్రపోతున్న బాబు పక కూచుంది సుమతి లేపకుండా, బాబు ‹ పడుకున్నాడేం అనిగానీ, నువ్వెంద వున్నావనిగాని అతను అడగలేదు ‹ వయిపే అతని దృష్టిపోలేదు లాపంగా కుర్చీలో కూచుని షూస్

కుంటూ, "అలాగే కూచున్నావేం. కాస్త కాఫీ ఇవ్వు" అన్నాడు. మవునంగా వెళ్ళి కాఫీ కప్పు అందించింది సుమతి. కానీ రోజూలా బట్టలు మార్చుకోమనీ సర్ది పెట్టమనీ కూడా కేకవేయలేదు ఆమె. అందు కాశ్చర్యంగానే వున్నా, ఏమీ ప్రశ్నించలేదు రామారావు.

అతడి ఉదాసీనత చూసి, ఆడిగితే తప్ప ఏమీ చెప్పకూడదనుకుంది సుమతి. మవునంగా స్టవ్ మీదున్న అన్నాన్ని వార్చింది. "ఆకలిగా వుంది. అన్నం వడ్డించు" అన్నాడు రామారావు కాళ్ళు, ముఖం కడుక్కుని.

రెండు ప్లేట్లల్లో అన్నం వడ్డించి, రెండు పచ్చడి సీసాలు పెరుగుగిన్నె దగ్గరికి జరిపింది సుమతి.

"కూర చేయలేదూ?"

" . ... . "

అలసిపోయున్నాదేమో జవాబు రాక పోయేసరికి కోపం వచ్చింది రామారావుకి.

"అడిగిందానికి జవాబు చెప్పటం కూడా కష్టమయిపోయిందే?"

జవాబు చెప్పకుండా ఏడ్చేసింది. "ఛ! ఎప్పుడూ ఏడుపేనా? నోరు విప్పి సరిగ్గా మాట్లాడవు. గట్టిగా అడిగితే ఏడుస్తావు" ఏమో నీవరస నాకు నచ్చలేదు సుమతీ" అసలిప్పుడు నేనేమన్నానని అంతలా ఏడవటం? కూర చేయలేదా అని అడగటం కూడా తప్పేనా?"

ఉక్రోషం వచ్చేసింది సుమతికి. "అవునండీ మీ దృష్టిలో మీరు చేసేవన్నీ రైటు. నేను చేసేవేమో తప్పు. అయినా నేనేడిస్తే మాత్రం మీ కొచ్చిన నష్టమేవిటి? అసలు ఇంట్లో వాళ్ళు ఎలాపోతే మీకేం? మీ పనులూ, మీ భోజనం మీ నిద్ర మీకు సక్రమంగా అమర్తే చాలు ఇంక ఏ విషయమూ అక్కర్లేదు. రెండు రోజులనించీ బాబు జ్వరంతో నేనెంత సతమతమయి పోతున్నా, మీ పనుల్లో మాత్రం లోటు రానియ్యలేదు. పూచిక పుల్లంత సహాయమయినా చేశారా నాకు మీరు? ఇవాళ్టికి వాళ, ఎంత ప్రమాదం తప్పిందో. మెట్లమీంచి కింద పడి కళ్ళు తేలేశాడు బాబు. ఏమీ చేయటానికి కాళ్ళు, చేతులు రాక ఎంత తల్లడిల్లిపోయానో. అప్పుడనంగా వాణ్ని తీసుకుని డాక్టర్ దగ్గరికి వెళ్ళిం దాన్ని ఇప్పుడే కాస్పేపయింది వచ్చి. కనీసం రెండు రోజులయి జ్వరం కదా బాబు ఎలా వున్నాడో చూద్దామని అన్నా మీకు అన్పించిందా? మీ కనిపిస్తే, ఇంత ఆలస్యంగా వస్తారా? ఒక్కరోజుకి కూడా, మీ వ్యవహారాలు మానుకోలేదు గదా మా కోసం? వచ్చాకయినా ఒక్కమాట అడిగారా బాబుకెలావుంది అనిగానీ, నువ్వలా వున్నావేం అనిగానీ. నా పిచ్చి గానీ మీ రెందుకడుగుతారండీ, ఎంత సేపూ, నా భర్త, నా ఇల్లు, నా బిడ్డ, నా సంసారం అని నేను పడే తాపత్రయంలో మీకు వీసమంతయినా ఉందా?" అలా ఎంతసేపు మాట్లాడి వుండేదోకానీ, రామారావు ఆవకాయ వేసుకుని భోజనం మొదలు పెట్టటంతో ఆపేసింది

అయిదు నిముషాల్లో భోజనం ముగించి వెళ్ళి, రెండు పక్కలూ వేసి. దోమ తెరలు కట్టి, బాబుని పడుకోబెట్టాడు రామారావు. తన బల్లదగ్గర కూచుని

పుస్తకం వకటి చేతిలోకి తీసుకున్నాడు.

వంటిల్లు సర్దేసి వచ్చిన సుమతి మవునంగా బాబు పక్కన చేరి పడుకుంది. భర్త ఏదయినా మాట్లాడితే బావుండు ననుకుంది. కానీ అతనేమీ మాట్లాడటానికి ప్రయత్నించలేదు. లోపలున్న బాధ కన్నీళ్ళ రూపంలో బయటికి రావాలని చూస్తూంది. అయినా గట్టిగా ఏడవాలంటే అహం అడ్డు వస్తూవుంది సుమతికి. చదువు ముగించి వచ్చాక అయినా దగ్గరికి తీసుకుంటాడేమో అనుకుంది.

మరో అరగంటకి లయిటు ఆర్పేడు రామారావు. భార్య పక్కన కూచుని ఒకసారి జుట్టు మీద, చంపలమీద చేయి వేసి నిమిరి, తన పక్కలో పడుకున్నాడు.

నిస్పృహ కలిగింది సుమతికి. అయినా మారు మాట్లాడకుండా తనంత తాను నిద్రపోయింది.

* * *

ఉదయం సుమతి మేలు కొలుపు పాడక ముందే, ఏడింటికే నిద్రలేచాడు రామారావు చెప్పకముందే పక్కలన్నీ సర్ది, బాత్ రూమ్‌లోకి వెళ్ళి ముఖం కడుక్కున్నాడు. సుమతి అందించిన కాఫీతాగి; స్నానానికి వెళ్లేడు. షేవింగ్ ముగించి బాయిలర్ లోంచి తానే నీళ్లు పట్టుకుని స్నానం చేశాడు. వెంటనే విడిచేసిన బనీను డ్రాయరూ ఉతికి ఆరేసాడు.

అంతా గమనిస్తూనే వుంది సుమతి. "ఇదెన్నాళ్ళ ముచ్చటో చూద్దాం" అనుకుంది మనసులో.

సుమతి వడ్డించిన భోజనం తిని, డ్రెస్‌చేసుకుని తనే షూష్ తుడుచుకు వేసుకుని కాలేజీకి బయలుదేరాడు. వెళ్ళే ముందు ఏదో గుర్తువచ్చినవాడిలా లోపలికొచ్చి. "బజారునించి తేవలసిన వేమయినా వుంటే లిస్టు రాసివ్వు. సాయంత్రం పట్టుకొస్తాను వచ్చేటప్పుడు" అన్నాడు.

ఏం లేవంది సుమతి.

వెళ్ళిపోయాడు.

సుమతికి చాలా ఆశ్చర్యంగా వుంది రామారావులో వచ్చిన మార్పు. సాయంత్రం అయిదింటికి ఇల్లు చేరుకున్నాడు రామారావు. రాగానే విప్పిన బట్టలు, షూస్, పుస్తకాలు నీట్‌గా సర్ది, భార్య ఇచ్చిన కాఫీ తాగి ఒక అరగంట ఆరోజుటి పేపర్ చూసుకున్నాడు. మళ్ళీ డ్రెస్ చేసుకుని, కొడుకు నెత్తుకుని డాక్టర్ దగ్గరికి బయలుదేరాడు. ఆవేళ టెంపరేచర్ కొంచెం తగ్గింది వాడికి.

రాత్రి టయిముకి సరిగ్గా భోజనంచేసి, పక్కలు వేశాడు. తన చదువు ముగిశాక లయిటు ఆర్పేసి పడుకున్నాడు.

దాదాపు రోజూ ఇదే దినచర్య. రామారావు, సుమతి మాట్లాడుకోవటమే చాలా మటుకు తగ్గిపోయింది. అంటే సీరియస్‌గా ఏమీలేదు. కానీ అతను అస్తమానూ, ప్రతీదానికీ భార్యని పిలవకుండా తనపని తాను చేసుకునిపోతున్నాడు. సుమతికి పనికి అడ్డురాకుండా బాబుని దగ్గిరికీ తీసుకుంటున్నాడు.

వారం రోజులు ఇలాగే గడచిపోయాయి. మొదట రెండు, మూడురోజులూ సుమతికి రిలీఫ్‌గా అనిపించినా, తర్వాత అతడు మరీ, ఏమాత్రం తనమీద ఆధార పడకుండా తన పనులు తాను చేసుకో

వటం, ఏదో వెలితిగా తోచింది. తన పనులు అన్నీ తాను చేసుకోవటంతో, ఇద్దరిమధ్యా మాటలు కూడా చాలా తగ్గిపోయాయి. ఏం చేయాలో ఎక్కడ కల్పించుకుని మాట్లాడాలో కూడా సుమతికి అర్థంకాలేదు. అతడు తన బనీను, డ్రాయరు ఉతుక్కోవటం, రోజూ తలకి నూనె తానే రాసుకోవటం మరింత బాధించాయి ఆమెని. కానీ ఏమి చెప్పాలన్నా, కసురుకుంటాడేమోనని భయం.

మళ్ళీ ఆదివారం వచ్చింది, ఉదయమే సంతోషంగా నిద్రలేచింది సుమతి. ఎన్ని పనులు తానే చేసుకున్నా, తలంటిపోసుకోవటం తన సహాయం లేకుండా అతడికి చాతకాదు. పోనీ అని మానేస్తే, అలవాటు అవటంవల్ల కళ్ళు మండుతాయి. అందుకని తప్పక తన్ని పిలుస్తాడని ఆశించింది. ఆ రకంగా అయినా మళ్ళీ మొదటికి మల్లే అతడికి దగ్గరవాలనుకుంది. ఆవేళ అతనికెంతో ఇష్టమయిన పెరుగుపచ్చడి, పెసరట్లు చేసింది. వారం రోజుల తర్వాత ఆవేళ మళ్ళీ పెసరట్లు బావున్నాయని మెచ్చుకుని తిన్నాడు రామారావు.

టిఫిన్ తినడం అయాక తనని పిలుస్తాడనుకొంది సుమతి. కానీ ఆ సూచనేవీ కన్పించలేదు. తనంత తాను బనీను విప్పేసి, ఆముదం సీసా పుచ్చుకుని, కుర్చీలో కూర్చున్నాడు. సీసా వంచి చేతిలో వేసుకునేలోగా, ఇక ఉండలేక పరిగెత్తి వచ్చేసింది సుమతి.

"ఉండండి. మీకు చాతకాదు. నేను రాస్తాను" అంటూ సీసా అందుకోబోయింది. కానీ అతనివ్వలేదు.

"అఖ్ఖర్లేదు. నీపని నీవు చూసుకో. చాతకాదు అనేముంది, వారంవారం చేస్తుంటే అదే అలవాటయిపోతుంది."

కళ్ళలో నీళ్ళు తిరిగినాయి సుమతికి.

"ఏమిటండీ, మరీ అంతదూరం చేసేంత పాపం నేనేం చేశాను? కాస్త నాకు సహాయం చేయండి, అదీ ఆరోజు ఆ కోపంలో అన్న మాటలకి మీకింత పట్టుదలవుతే నేనేమయిపోవాలి?" అంటూ అతడి భుజంమీద చేయివేసింది.

"అరే. అంతలో కన్నీళ్ళెందుకు సుమా! నువ్వన్నదాంట్లో తప్పుందని నేనన్నానా? నీవు చెప్పిందే కరెక్టుకదా? ఎవరిపనులు వాళ్ళు చేసుకుంటే అందరికీ సుఖంగా వుంటుంది. నీకు కష్టం కలిగించకూడదనే నా ఉద్దేశం కానీ నీమీదేం కోపంలేదోయ్."

"మీరెన్నిచెప్పినా సరే. మీకు తలంటు మాత్రం నేను చేయాలిసిందే" అంటూ, అతడి చేతిలోంచి ఆముదం సీసాని లాక్కుంది.

చేసేదిలేక తలవంచుకుని, "ఏమిటో ఈ అమ్మాయి మాటలు విచిత్రం! తన మనసు నా కెప్పటికీ అర్థం కాదేమో?" అనుకున్నాడు తనలోతానే.



మన రైతులకు ఏకైక ఆశాకిరణం

దేశానికి వెన్నెముక అయిన రైతులోకానికి వరప్రసాదం వంటివి సహకార సంఘాలు. సహకార రంగ ప్రగతిలో ఆంధ్రప్రదేశ్ ఘనమైన విజయాలు సాధించింది. రైతుబిడ్డలకు పరపతి లభింపజేయడానికి గత రెండు దశాబ్దాలలో అనేక చర్యలు తీసుకున్నారు.

ఈ ఇరవై సంవత్సరాలలో స్వల్పకాలిక మధ్యకాలిక ఋణాలు పెరుగుతూ వచ్చాయి. 1955-56,1964-65 మధ్యకాలంలోని దశాబ్దంలో సహకార ఋణాల మొత్తం రు. 189.98 కోట్లుకాగా, 1965-66, 1974-75 మధ్య దశాబ్దంలో యీ ఋణాల మొత్తం రు. 412.40 కోట్లకు పెరిగింది.

ఋణాలు యిచ్చే విషయంలో ప్రాథమిక వ్యవసాయ అభివృద్ధి బ్యాంకులు ఉదార విధానాలను అమలు చేస్తున్నాయి. దీని ఫలితంగా ప్రాథమిక వ్యవసాయ అభివృద్ధి బ్యాంకుల ద్వారా రైతులకు అందజేసిన ఋణాలు మొదటి మూడు ప్రణాళికలలో ఎన్నో రెట్లు అధికం అయ్యాయి. మొదటి ప్రణాళికా కాలంలో రు. 256.02 కోట్లు వున్న యీ మొత్తం, రెండవ ప్రణాళిక కాలంలో రు. 477.86 కోట్లకు, మూడవ ప్రణాళిక కాలంలో రు. 3746.18 కోట్లకు పెరిగింది. ఐదవ ప్రణాళిక రెండవ సంవత్సరం 1975-76 లోనే యీ మొత్తం రు. 2723.60 కోట్లకు పెరిగింది. 1974-75 లో యీ మొత్తం రు. 1886.16 కోట్లు మాత్రమే వుండేది.

మన రాష్ట్రం వ్యావసాయిక ఆర్థిక వ్యవస్థలో మార్కెటు సంఘాలు కీలక పాత్ర వహిస్తున్నాయి. 1956 జూన్ నెలలో మన రాష్ట్రంలో 148 ప్రాథమిక మార్కెట్ సంఘాలు పనిచేస్తూ వుండేవి. వాటి వాటా ధనం రు. 26.61 లక్షలు వుండేది. 1976 జూన్ నాటికి యీ సంఘాల సంఖ్య 265 కు పెరిగింది. వీటి వాటా ధనం కూడా రు. 269.22 లక్షలకు పెరిగింది. ఇదీ గత 20 సంవత్సరాలలో యీ రంగంలో జరిగిన గణనీయమైన అభివృద్ధి.

డైరెక్టర్ సమాచార పౌరసంబంధ శాఖ;
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-హైదరాబాద్.

కొత్త సీరియల్ ప్రారంభం



మనిషికేం కావాలి?

కొమ్మూరి వేణుగోపాలరావు

ఎలా చెప్పను ఈ కథ? నా అంతరంగచరిత్ర ఎక్కడ్నుంచి మొదలుపెట్టను? నేను ఎక్కడ కూర్చుని, ఏ పరిసరాల్లో యిమిడిపోయి, ఎలాంటి స్థితిలో వుండి యిదంతా రాస్తున్నానో తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. నిట్టూర్పు విడుస్తారు. ఓ కన్నీటి బొట్టు .. ఏమో! అనుమానమే. ఈ లోకంలో మనిషిని మనిషి అర్థంచేసుకునే శక్తి యింకా మిగిలివుందా? భార్యాభర్తలుగానీ, ఇతరులు భగ్గుమని అసూయతో మండిపోయేటంతటి ప్రాణస్నేహితులుగానీ, తండ్రిబిడ్డలుగానీ, తల్లిపిల్లలుగానీ, అన్నదమ్ములుగానీ, అన్నా చెల్లెలు-అక్కా-చెల్లెలుగానీ, యజమానులు-వాళ్ళ పరివారముగానీ, ఆఖరికి గాఢంగా ప్రేమించుకుని ఒకరికోసం ఒకరు త్యాగాలు చేసుకునే ప్రేయసీప్రియులైనా సరే ఒక ర్నొకరు పూర్తిగా కాకపోయినా, కనీసం అవసరమైనంత పరిధిలోనన్నా అర్థం చేసుకుంటారా? అసలు మనిషి తనని తాను అర్థం చేసుకుంటాడా?

మొదట్నుంచీ నాలో ఓ గుణం వుండేది. నా మనసును నే మోసంచేసుకోలేక పోయేదాన్ని.

నిజాన్ని ప్రేమించేవారు తమ మనసుల్ని మభ్యపెట్టుకోలేరేమో!

చిన్నతనంలో నేను చాలా పెంకిగా వుండేదాన్ని. గారాబం కూడా యింట్లో ఎక్కువే వుండేది. నాన్న పెద్ద ఆఫీసరు కాబట్టి యింట్లో నౌకర్లూ, చాకర్లూ వాళ్ళమీద అజమాయిషీలూ, అధికారాలూ, ఇరుగుపొరుగులతో నేను తెచ్చే తగాదాలూ, అవి పరిష్కరించటానికి అమ్మానాన్నా పడే అవస్థలూ—ఎన్ని పేచీలు పెట్టేదాన్నో లెక్కే లేదు. ఒక్కతే కూతుర్ని కాబట్టి, అసలు వున్నది నే ఒక్కదాన్నే కాబట్టి అన్నీ కిమ్మనకుండా భరిస్తూ వుండేవాళ్ళు. అమ్మ అప్పుడప్పుడూ నాకు ప్యాంటూ, షర్టూ తొడిగి, క్రాపింగ్‌లా తలదువ్వి, నేనే కొడుకునయినట్లు మురిసిపోతూవుండేది.

ఇంతకీ అప్పుడు నాకు ఎనిమిదేళ్ళన్నా నిండలేదు.

ఎప్పుడన్నా ఒక్క నిమిషం కళ్ళెదుట లేకపోతే అమ్మ "సునీతా! సునీతా!!" అని కలవరిస్తూవుండేది.

స్కూల్లో ఏ మీటింగో వుండి ఓ అరగంట లేటయితే నాన్న బవాన్లని స్కూలుకి పరుగుపెత్తించేవాడు.

జీవితంలోని ప్రతి రోజూ మనం స్పష్టంగానో, అస్పష్టంగానో అనుభవిస్తాము. వాటిలో కొన్నిటిని ప్రేమిస్తాము, కొన్నిటిని ద్వేషిస్తాము. అలా కొన్ని వందల వేల రోజులు గడిపివేస్తాము. కాని వాటిలో మన స్మృతిపథంలో మిగిలివుండేవి కొన్నే. మిగతావి కాలగర్భంలో ఎలా కలిసిపోయాయో, ఎలా హరించుకుపోయాయో ఎంత గింజుకున్నా గుర్తు రావు. వాటి రూపురేఖలు, ఆ ప్రభావాలు ఆ యా సంఘటనల లోతు పాతుల్నిబట్టి నెమరువేసుకోవల్సిందే.

చిన్నతనంలోకి పోతే నాకు ఏవేవో కొన్నికొన్ని దృశ్యాలు చెదురుమదురుగా జ్ఞాపకం వస్తాయి. దీపావళి రోజున అమ్మా, నాన్నగారూ ఎంత వద్దంటూన్నా

వినకుండా సీమటపాకాయలూ, బొట్లూ పేల్చటం, తారాజువ్వలు ఆకాశంలోకి జుయ్యీమని ఎగరెయ్యటం ఎవరో దొంగని ఇరుగుపొరుగువారు పట్టుకుని చావచితగ కొడుతూంటే, వాడు రక్తం కక్కుతూంటే నేను వీరావేశంతో అడ్డువెళ్ళటం, ఓ సారి దగ్గర్లో ఇళ్ళు తగలబడి బ్రహ్మాండంగా గాలిలో మంటలులేచి, పాకల్లోనివాళ్ళూ, పెంకుటిళ్ళలోనివాళ్ళూ చేతికందిన వస్తువులతో, భయభ్రాంతులతో పరిగెత్తుతోంటే, ఆ మంటల్లోకి దూకి వాళ్ళకి సాయం చెయ్యాలని నేను ఆరాటపడటం

మా అమ్మ నాకు సంగీతం చెప్పించాలని తాపత్రయపడుతోంటే నేను రింగ్ టెన్నిస్, షెటిల్‌కాక్ మీద మోజు చూపించేదాన్ని నన్ను డ్యాన్సర్‌ని చెయ్యాలని నాన్న కలలు కంటూంటే నేను రన్నింగ్, స్విమ్మింగ్‌లలో ఆసక్తి ప్రదర్శిస్తూ వుండేదాన్ని

ఒకసారి పెద్దవాళ్ళకు తెలీకుండా నౌకరు వీరాస్వామి దగ్గర రహస్యంగా సైకిలు నేర్చుకున్నాను వయసుకి మించిన పొడవు వుండేదానను కాబట్టి కొంచం అవస్థగానే వున్నా త్రొక్కటానికి పెద్ద యిబ్బంది లేకపోయేది రెండుమూడు రోజులు గడిచేసరికి ఇహ వచ్చేసిందని ధీమా వచ్చేసింది ఓ సాయంత్రం వెనకనుంచి వీరాస్వామి గాభరాగా "అమ్మాయిగారూ! అమ్మాయిగారూ!" అని పిలుస్తున్నా వినిపించుకోకుండా నిర్లక్ష్యంగా సైకిలు త్రొక్కుకుంటూ ముందుకెళ్ళిపోయాను


అలా వచ్చీరాకుండానే బ్యాలెన్సు చేసుకుంటూ, మనుషుల్ని తప్పించుకుంటూ పోతూంటే ఎంత హాయిగా వుంది! ఈ ప్రపంచమంతా సైకిలుమీద తిరిగి రావాలన్నంత కసిగా, ఉత్సాహంగా వుంది ముందుకెళ్ళిపోతున్నాను మొదట్నుంచీ నాకు ప్రకృతి దృశ్యాలంటే ఎంతో యిష్టం ఓ ప్రక్కన నిండుగా ప్రవహిస్తోన్న కాలవా, ఆ నీటిలో ఒడ్డున నడుస్తూ త్రాళ్ళతో మనుషులు లాగుతూండగా బరువుగా కదిలే పెద్దపెద్ద పడవలూ, ఇరుప్రక్కలా ఒక దానితో ఒకటి పోటీపడుతూ, ఆకాశంలోకి ఎదిగినట్లున్న పెద్దపెద్ద చెట్లూ నాకు టైము తెలియటల్లేదు ఊరిబయట కాబట్టి మనుషులు కూడా అడ్డులేరేమో రయ్యిమని వెళ్ళిపోతున్నాను

ఉన్నట్లుండి వెనకనుంచి ఏదో శబ్దం వినిపించింది లారీ ఏదో వస్తున్నట్లు గ్రహించాను రోడ్డు చాలా సన్నగా వుంది ప్రక్కకి తప్పుకుందామంటే తుప్పలు, పొదలు కొంచెం దూరం పోతేనేగాని విశాలమైన జాగా వచ్చి ప్రక్కకి తప్పుకునే అవకాశం రాదు వెనక లారీ మీదకు దూకేటంతటి ప్రళయంగా చప్పుళ్ళు చేస్తోంది నా మీదకి వచ్చేసినట్లే అనిపించింది విధిలేక ఏమయితే అయిందని రోడ్డుప్రక్క తుప్పల్లోకి పోనిచ్చేశాను లారీ ప్రక్కనుంచి వెళ్ళిపోయింది వేగంగా నేను మాత్రం సైకిలుమీదినుంచి ఆ తుప్పల్లో పడిపోయాను కళ్ళు చీకట్లు క్రమ్మినట్లయింది

కొంచెంసేపు తెలివితప్పే వుంటుంది కళ్ళు తెరిచేసరికి సైకిలు ఒక ప్రక్కా, నేనో ప్రక్కా పడివున్నట్లు తెలిసింది మెల్లిగా లేచి కూర్చున్నాను వళ్ళంతా

సుభాషితాలు

నేరం చేసిన వాడిని శిక్షించటమే ప్రధానం కాదు నేరం చెయ్యటానికి ఏ పరిస్థితులు పురిగొల్పుతున్నాయో వాటిని తొలగించటం ముఖ్యం — యం యన్ రాయ్



నొప్పులుగా వుంది కాళ్ళూ, చేతులు బాగా గీసుకుపోయి మండుతున్నాయి అలాగే లేచి నిలబడి సైకిలును యివతలకు లాగాను అదృష్టవశాత్తూ పంచర్ పడలేదు హ్యాండిల్ బార్ మాత్రం బాగా వంకర తిరిగింది

చుట్టూ చూశాను   అప్పుడు తెలిసింది — సాయంత్రం గడిచిపోయి చీకటి ఆవరిస్తోందనీ, ఊరు దాటి మూడునాలుగు మైళ్ళు వచ్చేసివుంటాననీ

ఎంత ధైర్యంగా వుందామన్నా మనసులో భయంలాంటిది మెదిలింది హ్యాండిల్ బార్ వంకరపోయినప్పుడు వీరాస్వామి సైకిలు ముందు చక్రాన్ని రెండు కాళ్ళ మధ్యా అదిమిపట్టివుంచి దాన్ని సరిచెయ్యటం యిదివరకు చూశాను అలా సైకిలు పట్టుకుని చెయ్యటానికి ప్రయత్నించాను బలం సరిపోలేదు

సైకిలు రెండు చేతుల్లో పట్టుకుని నిస్సహాయంగా అటూ ఇటూ చూశాను

దూరంగా ఒక మనిషి నడిచి వస్తున్నాడు కొంచెం ధైర్యం వచ్చినట్లయింది

ఆ మనిషి క్రమంగా దగ్గరకు వచ్చాడు   వయస్సులో పెద్దవాడే   పంచా, చొక్కా వేసుకున్నాడు చుట్ట కాలుస్తున్నాడు మనిషి ముతగ్గా, మొరటుగా వున్నాడు నన్ను పలకరిస్తాడేమోనని ఆశగా చూస్తున్నాను   నా వంక ఒకసారి చూసి, అను

మానంగా ఆగి, మళ్ళీ ముందుకే సాగిపోతున్నాడు అతడి కళ్ళు ఎరుపు కొట్టొచ్చినట్లు కనిపించింది

నాకే భయం అనిపించలేదు "ఏమండీ! ఏమండీ!" అని పిలిచాను

వెనక్కి తిరిగి దగ్గరకు వచ్చాడు "ఏమిటి?" అన్నాడు గొంతు కూడా మొరటుగా వుంది

"సైకిలుమీద వస్తూ పడిపోయానండి చూడండీ ఎలా దెబ్బలు తగిలాయో" అన్నాను చేతులు అతనికి చూపిస్తూ, సైకిలు నా నడుముకు ఆన్చుకుని

"అయితే ఏం చెయ్యమంటావు?"

"కొంచం సాయం చెయ్యండి హాండిల్‌బార్ వంకర తిరిగింది అసలు సైకిలు కదులుతుందో లేదో తెలీదు?"

"అడ్డులే" నా చేతుల్లోని సైకిలు తీసుకుని నిమిషంలో సరిచేశాడు సైకిలు ముందుకూ వెనక్కీ నడిపించి "నడుస్తుందిలే" అన్నాడు

"థ్యాంక్సండీ" అని సైకిలునందుకుని ముందుకు నడిపించబోయాను

"ఆగు" అన్నాడు "సైకిలు నేను తొక్కుతాను నువ్వు వెనక కూచో"

"మీ కెందుకండీ శ్రమ? నేను వెళ్ళగలను లెండి"

"కూచుంటావా లేదా?"

అతని గొంతు గర్జించినట్లయింది ఉలికిపడి చూశాను కళ్లు మరింత ఎర్ర రంగు పులుముకున్నట్లయినాయి

"మీ యిష్టం" అన్నాను భయంభయంగా

సైకిలు ఎక్కి కూచున్నాడు నేను వెనక ఎక్కాను మెల్లిగా కదిలింది

క్రమంగా చీకటిపడిపోయింది రోడ్డుమీద మేమిద్దరం తప్ప ఎవరూ మనుషులు కనబడటంలేదు ఎంత ధైర్యంగా వుందామన్నా నాకు భయంగానే వుంది లోపల భయంకరమైన నిశ్శబ్దం, ఒంటరితనం, ముక్కూ మొహం తెలియని ఎవరితోనో సైకిలు ప్రయాణం, చీకట్లో అటూ యిటూ దెయ్యాల్లా ఊగే చెట్లు, యింటికి ఎప్పుడు చేరిపోతానో అని ఆరాటంగా వుంది

సైకిలు జోరుగానే తొక్కుతున్నాడు అతనూ మాట్లాడటం లేదు, నేనూ మాట్లాడటంలేదు

అంత దూరంలో లైట్లు కనిపిస్తున్నాయి ఊరుని సమీపించామన్న మాట రెండు మూడు ఫర్లాంగులు వుంటుందేమో

ఉన్నట్లుండి సైకిలు బ్రేక్‌చేసి ఆపాడు ముందుకు పడబోయి సీటు గట్టిగా పట్టుకుని, నిలద్రొక్కుకుని "ఏమిటి?" అన్నాను

"దిగు"

ఎందుకలా అంటున్నాడో అర్థంగాకపోయినా క్రిందకు దిగి నిల్చున్నాను

అతనూ దిగి సైకిలు స్టాండ్ వేసి నా ప్రక్కకి వచ్చాడు అతని చేతులు నా

మెడమీద పడేసరికి, భయంతో ఒక్క అడుగు వెనక్కి వేశాను

"చూడు! నేను దొంగని కాను కాని నాకు కోపం వస్తే మనిషిని కా
కారణాలేమయితేనేం? డబ్బు చాలా అవసరంగా వుంది నీ మెళ్ళోని గొలుసూ, చె
రింగులూ, చేతి గాజులూ తీసేసుకుంటున్నాను పేచీ పెట్టావా? మనిషిని కా
చెప్పానుగా "

నా ధైర్యమంతా ఏమయిపోయిందో, ఆ గొంతు నన్ను శాసించినట్లయిం
మెదలకుండా నిల్చున్న నా వంటిమీద నుంచి బంగారాన్ని వొలుచుకున్నా
"మంచి పిల్లవు" అంటూ బుగ్గమీద చిటికవేశాడు ఎగిరి ముఖం మీద తం
మనిపించింది

"అన్నట్లు యీ సైకిలు కూడా నాక్కావాలి తీసుకెడుతున్నాను ఊరిం
ఎంతో దూరం లేదులే నడిచి వెళ్ళిపో" అని నా జవాబుకోసం ఎదురు చూడకుం
సైకిలెక్కి రివ్వుమని వెళ్ళిపోయాడు

క్షణంపాటు చేష్టలుడిగి నిలబడి పోయాను ఇల్లూ వీరాస్వామీ, అమ్మా నా
వరుసగా గుర్తు వచ్చారు కళ్ళలో నీళ్ళు తిరిగినట్లయినాయి నాన్నగారు వీరాస్వామి
కొట్టారేమో అయనకు కోపమొస్తే వళ్ళు తెలియదు ఇందులో వీరాస్వామి తప్పే
లేదని చెప్పాలి

మెల్లిగా నడకసాగించాను పది పదిహేను నిమిషాల్లోనే వూరు చేరుకున్నా
మనుషుల్ని చూశాక బాగా ధైర్యం వచ్చేసింది బహూశా నాన్నగారు నలుగుర్ని నాలు
మూలలకు పంపించి నా కోసం వెతికిస్తున్నారేమో గబగబ యింటికేసి నడువసాగా

ఇంట్లో లైట్లన్నీ వెలుగుతున్నాయి నేననుకున్నట్లే అయింది వసారాలో
ప్రక్క వీరాస్వామి వణికిపోతూ నిల్చుని వున్నాడు జుట్టు పీచులారేగిపోయివుం
అతని వాలకం చూస్తే ముఖం మీదా బాగా దెబ్బలు పడినట్లు తెలుస్తోంది నాన్నగా
పెద్దపులిలా అటూ యిటూ పచార్లు చేస్తున్నారు అమ్మ యింకో ప్రక్క కన్నీ
కారుస్తూ నిలబడి వుంది

మొదట అమ్మే నన్ను చూసింది "అదిగో పాప వచ్చేసింది" అ
సంతోషంతో నా వైపు ఉరికేస్తున్నట్లుగా కదిలి

మరుక్షణంలో అమ్మ చేతుల్లో ఒదిగిపోయాను అమ్మ ఏడుస్తూ, న
బలంగా అదుముకుంటూ మధ్య మధ్య బుగ్గలు ముద్దు పెట్టేసుకుంటున్నది

ఆవేశాలు చల్లారాక "ఏం జరిగింది చెప్పు" అన్నారు నాన్నగారు లాలనగా
నేను వీరాస్వామికేసి జాలిగా చూస్తూ జరిగిందంతా పూసగ్రుచ్చినట్లు చెప్పా,

అంతా విని అమ్మ "ఇవేళ ఎంత గండం తప్పింది? ఆ దుండగీడు వస్తువ
కోసం నీ ప్రాణాలుతీస్తే మాత్రం చేసేదేముంది?" అని దేవుళ్ళందరికీ దణ్ణా
పెట్టేసింది

"పోలీసు రిపోర్టు ఇస్తాను వాడి ఆరా తీసి అంతు కనుక్కుంటాను"

నాన్నగారు గర్జనలు చేశారు.

ఆ తర్వాత దాని విషయమేమీ తేలినట్లు నాకు గుర్తులేదు.

*　　　*　　　*

కొన్నాళ్ళకు జరిగిన ఆ దురదృష్టకరమైన ఘట్టంమాత్రం ఎన్నటికి మరిచిపోలేను. అది మా జీవితాల్లో దారుణమైన మలుపు తెచ్చిన సంఘటన.

అమ్మ తిరుపతి వెడదామంది. నాన్నగారు సరేనన్నారు. నన్ను తీసుకుని కారులో బయల్దేరారు.

నాన్నగారే కారు డ్రైవ్ చేస్తున్నారు. కొద్దిసేపట్లోనే ఏలూరు దాటేశాము చీకటితోనే బయల్దేరటంవల్ల సాయంత్రంలోపలే తిరుపతి చేరుకుంటామని నాన్నగారన్నారు.

నాన్నగారు వేగంగా, హాయిగా డ్రైవ్ చేస్తోంటే నాక్కూడా కారు డ్రైవు చేసెయ్యాలన్నంత ఆవేశం వస్తోంది. గబగబ పెద్దదాన్నయిపోయి. డ్రైవింగ్ నేర్చుకుని కార్లో ఊర్లన్నీ తిరిగిరావాలని కోరిక ఉరకలు వేస్తోంది.

ఉన్నట్లుండి ఆకాశమంతా మేఘాలు క్రమ్మేశాయి. కాసేపట్లోనే జోరుమని వర్షం కురవసాగింది.

అద్దంమీద వైపర్స్ పనిచేస్తోన్నా లోపలివైపు మంచులా క్రమ్మివేస్తూ దారి సరిగ్గా కనబడటంలేదు. అయిదు నిమిషాలకూ పదినిమిషాలకూ దెయ్యంలాంటి లారీలు మీదకు దుసుకుతున్నట్లు ఎదురుగుండా రావటమో, ప్రక్కనుంచి దూసుకుపోవటమో జరుగుతోంది.

అమ్మ ముఖంలో వ్యాకులపాటు కనిపించింది. "ఎక్కడైనా కారు ఆపేద్దామండి. వర్షం వెలిశాక బయల్దేరవచ్చు. నాకు భయంగా వుంది" అన్నది.

నాన్నగారు చిరునవ్వు నవ్వి ప్రక్కనే కూర్చున్న అమ్మ బుజం తట్టారు.

"మీ అమ్మ భయపడుతోంది. ఏం సునీతీ ఆపెయ్యమంటావా?"

ముందు సీటుమీద చేతులువేసి నేను వెనకవైపు నిల్చుని వున్నాను.

"అమ్మ ఎప్పుడూ అంతే నాన్నగారూ. నాకేం భయంలేదు. పోనివ్వండి" అన్నాను.


నాన్నగారు నవ్వి చెయ్యి వెనక్కి పోనిచ్చి నా తల నిమిరారు.

కారు జోరుగా పోతూనే వుంది. నెమ్మదిగా ఒక్కొక్క వూరూ వెనకపడిపోతోంది. వర్షం మాత్రం ఎడతెరిపి లేకుండా పడుతూనే వుంది. టైమెంతయిందో తెలీదు.

ఉన్నట్లుండి.... మసకమసగ్గా మబ్బుమబ్బుగా వున్న అద్దంలోంచి దెయ్యంలాంటిదేదో మీదకు దూకుతున్నట్లనిపించింది. అమ్మ కెవ్వున కేకపెట్టింది. నాన్నగారి చేతులు స్టీరింగ్‌మీద వాయువేగంతో పనిచేశాయి. అయినా దెయ్యాన్ని తప్పించుకోవటానికి వ్యవధి చాలలేదు. నేను కళ్ళప్పగించి చేష్టలుడిగి చూస్తున్నాను. పెద్ద చప్పుడు.

సుభాషితాలు

కవిత్వం, మేల్కొల్పాలి గాని జోకొట్టకూడదు. —శ్రీశ్రీ



కారు గిర్రున తిరిగిపోయినట్లయింది. నా తలమీద దేంతోనో మోదినట్లయింది. కళ్ళు బైర్లుక్రమ్మాయి.

తెలివివచ్చి కళ్ళు విప్పేసరికి మొదటంతా మసకమసగ్గా కనిపించింది. ఎక్కడో మంచంమీద పడుకోబెట్టబడి వున్నాను. కాని ఎక్కడో, తెలియలేదు.

తలంతా వెయ్యి సమ్మెట్లతో మోదినట్లు బ్రద్దలై పోతోంది.

"అమ్మా!" అని మూలిగాను.

"ఎలా వుంది?" ఎవరిదో కంఠస్వరం అడుగుతోంది.

"మా అమ్మ... నాన్నగారూ ఏరీ .?"

"బాగానే వున్నారు. ప్రక్కగదిలో వున్నారు."

"అసలు మేము . . ఎక్కడ వున్నాం?"

"హాస్పటల్. మీ కారుకి ఏక్సిడెంట్ అయి మీరంతా గాయపడితే ఇక్కడికి తీసుకొచ్చారు?"

కళ్ళు పూర్తిగా తెరిచి నలువైపులా చూడటానికి ప్రయత్నించాను. శక్తిచాలక, సాధ్యం కాలేదు.

"మా అమ్మనూ, నాన్నగార్నీ చూడాలి. నన్నక్కడికి తీసుకెళ్ళండి?"

"ఇప్పుడు కాదు. నీకు బాగా దెబ్బలు తగిలాయి. కదలటానికి వీల్లేదు."

"పర్వాలేదు. తీసుకెళ్ళండి. నేను చూసితీరాలి" ఏడుస్తున్నాను.

కొంతసేపు నిశ్శబ్దం .. బుజం క్రింద చురుక్కుమన్నట్లయింది. ఇంజక్షన్ ఇచ్చినట్లున్నారు. అయిదునిమిషాల్లో మగత క్రమ్మేసింది.

అలా అప్పుడప్పుడూ నాకు తెలివిరావటం, నేను ఏడవటం, కేకలుపెట్టటం, మళ్ళీ ఇంజక్షన్ ఇవ్వబడటం.... ఇలా జరిగిపోయింది. ఇక్కడ చచ్చిపోయి, ఎక్కడో కల్లో బ్రతుకుతూన్నట్లుగా వుంది.

ఒకసారి కళ్ళు తెరిచేసరికి తలదగ్గర అమ్మ కూర్చుని వుంది. ముఖమంతా బ్యాండేజెస్. నా జుట్టు నిమురుతోంది.

"అమ్మా!" అని అరిచాను. "మీరంతా నా కెందుకు కనబడటంలేదు? నాన్నగారేరీ?"

అమ్మ కళ్ళలో నీళ్ళు కన్పించాయి. "ఊరుకో సునీతీ. తర్వాత చెబుతాను."

"కాదు. ఇప్పుడు చెప్పాల్సిందే. నాన్నగార్ని నేను చూసి తీరాలి."

అమ్మ జవాబు చెప్పకుండా ఎటువైపో చూస్తున్నది. కన్నీళ్ళతో ఆమె చెంపలు తడిసిపోయి వున్నాయి.

"చెప్పు. నాన్నగారికేమయింది!"

అమ్మ పెదవులు బిగపెట్టింది. నిగ్రహించుకుంటోంది.

"నాన్నగారు మన కింక కనబడరు సునీతీ!"

"అమ్మా!" కెవ్వున కేకపెట్టాను.

తలలో పర్వతాలు బ్రద్దలయ్యాయి.

2

ఒక్కో సంఘటనవల్ల జీవితంలో అగ్నిపర్వతాలు బ్రద్దలవటమేగాక, జీవిత గమనమే మారిపోతూ వుంటుంది. అంతవరకూ మా అమ్మగానీ నేనుగాని కష్టమంటే ఎరుగం. ఇంటినిండా పనివాళ్ళు, బయటకు కాలుబెడితే కారో, మరేదో వాహనమో, ఎప్పుడూ పెద్ద పెద్ద యిళ్ళకు పార్టీలకు పోవటమో, సినిమాలకు షికార్లకు వెళ్ళటం— ఇలా హడావుడిగా సంతోష పరంగా గడిచిపోయేవి.

ఒక వ్యక్తి పోయాకగాని, సమాజపు నిజ స్వరూపంగాని లేక మన నిజ పరిస్థితి గాని పూర్తిగా వెల్లడికావన్న సత్యం తెలిసిపోయింది.

నాన్నగారికి వచ్చే జీతం ఎప్పటికప్పుడు దర్జాగా ఖర్చుపెట్టుకోవడంవల్ల బ్యాంకి బ్యాలెన్స్ ఏమీలేదు. కారు తుత్తునియలై పోయింది.

ఇన్సూరెన్స్‌వాళ్ళు లక్ష ప్రశ్నలువేసి ఏవేవో కాగితాలమీద సంతకాలు పెట్టించు కుని చివరకు దమ్మిడీ యివ్వనక్కర్లేదని తీర్మానం చేశారు. అలాగే నాన్నగారి జీవితం మీదవున్న పాలసీవల్ల కూడా అమ్మ నానా హైరానపడి ప్రయత్నించడమేగాని ఫలిత మేమీ చేకూరలేదు. మా తరపున గట్టిగా అడిగేవాళ్ళు కూడా లేకపోయారు. తిరువూరి నుండి మా పెదనాన్నగారు మాత్రం యీ విషయాలు తెలిసినప్పుడు వచ్చి ఒకటి

రెండురోజులుండి వెళ్ళిపోయారు. ఆ రెండు రోజులు కూడా అంటీ అంటనట్లే వున్నారు. ఆయనవల్ల ఎలాంటి సాయం లభించే సూచనలు కనిపించలేదు.

ఆఫీసు వాళ్ళు మాత్రం ఏవేవో లెక్కలు చెప్పి నాలుగయిదువేలదాకా ఇచ్చారు. నాన్నగారు పోకముందు కొన్ని అప్పులున్నాయిట. అవి తీర్చటానికీ యింటి అద్దెకూ కొంత డబ్బు అయిపోయింది. పనివాళ్ళంతా ఆఫీసుకు సంబంధించినవాళ్ళే కాబట్టి వాళ్ళకూ మాకూ సంబంధం లేకుండా పోయింది. వీరాస్వామికి మాత్రం మేమంటే ఎంతో దయగా వుంటూ, అప్పుడప్పుడూ వచ్చి కనబడుతూ చిన్నచిన్న పనులు చేసి పెడుతూ వుండేవాడు.

ఆ పెద్ద యిల్లు విడిచిపెట్టి చిన్న పెంకుటింట్లోకి మారిపోయాము.

అమ్మ నన్ను స్కూల్ మానవద్దంది. అలాగే వెళ్ళవస్తున్నాను. కాని కొన్ని నెలల్లో ఎంత మార్పు! నాలో చిలిపితనమంతా చచ్చిపోయినట్లూ, సహజమైన జీవితం నుంచి దూరమైపోయినట్లూ అనిపిస్తూ ఎప్పుడూ ఏవేవో ఆలోచనలు ముసురుకుంటూ వుండేవి.

అమ్మకూడా జీవితంలో ఏదో కోల్పోయినట్లూ, ఏదో యంత్రంలా బ్రతుకుతున్నట్లూ ఎప్పుడూ పరధ్యానంగా, నిస్పృహగా వుండేది. బహుశా నేనంటూ లేకపోతే అమ్మకూడా చచ్చిపోయి వుండేదేమో తెలియదు. అమ్మ చాలా అందంగా వుండేది! నునుపుగా, తెలుపుగా, పాలరాతిబొమ్మలా వుండేది. నాకు అమ్మ కాబట్టి, "అమ్మా!" అని పిలుస్తున్నాను కాబట్టి అమ్మ అనే భావం కలుగుతోందిగాని లేకపోతే నిరాడంబరురాలయిన ఓ కాలేజి అమ్మాయిలా, ఇంకా పెళ్ళికాని స్త్రీలా, చిన్నారి ముద్దుగుమ్మలా—నా కళ్ళకి రకరకాలుగా కనపడేది.

ఓ సంవత్సరం గడిచేసరికీ ఎంత పొదుపుగా వాడుకున్నా మా దగ్గర డబ్బంతా ఖర్చయిపోయింది. స్కూల్‌ఫీజ్ కట్టటానికి డబ్బులేదు. పుస్తకాలు కొనటానికి డబ్బు లేదు. వంటికి రెండుమూడు గౌన్లకంటే ఎక్కువలేవు. అమ్మకి చీరెలు లేవు. ఇంటికి అద్దె కట్టటానికి డబ్బులేదు. ఇంట్లో తినటానికి బియ్యపు గింజలు లేవు.

"అద్దెయినా కట్టండి. లేదా యిల్లయినా ఖాళీ చెయ్యండి" అని రోజూ ఇంటి యజమాని వచ్చి హెచ్చరిక చేసి వెడుతున్నాడు.

ఏం చెయ్యాలి? ఎక్కడకు పోవాలి? అమ్మ పెద్దగా చదువుకోలేదు. ఉద్యోగం చేసి పొట్టపోసుకోవటానికి ఆ వచ్చిన చదువు సరిపోలేదు. అమ్మకు పుట్టింటి తరపున ఎవరూ లేరు. ఆమె తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోతే ఓ అనాథాశ్రమంలో పెరిగిందిట. ఆ ఆశ్రమంలో కూడా దేముళ్ళమీద భజనలు చేయించటం, అప్పడాలు వొత్తించటం, వడియాలు పెట్టించటం, ఊరగాయలు, పచ్చళ్ళు చెయ్యటం—ఇలాంటివి తప్పితే విద్య, కళలు యిలాంటివేమీ నేర్పేవారుకాదుట. ఒకసారి చదువుకునే రోజుల్లో నాన్నగారు తాను వుండే హాస్టలుకు మెస్ సెక్రెటరీగా వుండేవారు కాబట్టి, ఊరగాయలూ, అప్పడాలూ కొనటానికి ఆశ్రమానికి వెళ్ళి అక్కడ అమ్మే ప్యాక్‌చేసి

యిస్తోంటే, చూసి మురిసిపోయి పరిచయం చేసుకున్నారట. నెలనెలా వస్తువులు కొనటానికి వెడుతూండటాన పరిచయం వృద్ధి అయిందిట. "నేను చదువు పూర్తయి. ఉద్యోగంలోకి వచ్చాక నిన్ను పెళ్ళిచేసుకుంటాను. అప్పటిదాకా ఎవరొచ్చినా పెళ్ళాడకు" అన్నారట నాన్నగారు. అమ్మ అలాగేనని మాట యిచ్చింది. ఆ మాటకు లోబడి తర్వాత రెండో పెళ్ళివాళ్ళూ, పెళ్ళాల్ని వొదిలేసినవాళ్ళూ, ఎవరెవరో సంపన్నులూ అప్పుడప్పుడూ వచ్చి ఆశలు చూపుతూన్నా, ఆశ్రమ అధికారులు బల వంతం చేస్తోన్నా ఎవరినీ లెక్కచేయలేదుట. చివరకు నాన్నగారు చదువు పూర్తి చేసుకుని, ఉద్యోగం సంపాదించి, ఇంట్లో అందరూ వ్యతిరేకించినా, వాళ్ళందర్నీ ఎదిరించి అమ్మని చేసుకున్నారట.

ఒకరోజు ప్రొద్దుటినుంచీ రాత్రివరకూ యిద్దరం పచ్చి మంచినీళ్ళు తప్ప యింకేమీ తీసుకోలేదు. ఇంట్లో వున్నవన్నీ అయిపోయినాయి.

"సునీతీ: ఏం చేద్దామే?" అంది అమ్మ కళ్ళలో నీళ్ళు తిరుగుతూండగా.

"నేనెక్కడైనా పని చేస్తానమ్మా!" అన్నాడు ధీమాగా.

"నీ మొహం! నువ్వేం పని చేస్తావే?"

"సైకిలు షాపుల్లో చిన్నచిన్న పిల్లలుంటారే — తుడవటానికీ, చక్రాల్లో గాలి కొట్టటానికీ; లేకపోతే మోటారు షెడ్లలోనైనా సరే సామాను అందించటం. రెంచీలతో బిగించటం ."

అమ్మ దిగులుగా నవ్వింది. "అవన్నీ మొగపిల్లలు చేసే పనులే."

"నేనింకా చిన్నపిల్లనేగా! పోనీ మొగడ్రెసు వేసుకుంటాను."

అమ్మ నన్ను దగ్గరకు తీసుకుని బుగ్గమీద ముద్దు పెట్టుకుంది. ఏమీ జవాబు చెప్పలేదు.

"పోనీ. మనకున్న చుట్టాలల్లా పెదనాన్నగారే కదా. అక్కడకు పోదామా?" అన్నాను కొంచంసేపు ఆలోచించి.

"ఆ యింటికి మనకూ ఎప్పుడూ రాకపోకలు లేవు. వాళ్ళు మనని చూస్తా రంటావా?" అన్నది. కాని ఆమె మెత్తబడుతూన్నట్లు గ్రహించాను.

చేసేదేముంది? చివరకు అక్కడకే బయల్దేరాం. బస్సు టికెట్లకి, మిగతా ప్రయాణపు ఖర్చుకూ వీరాస్వామే కొంత డబ్బు సహాయం చేశాడు. బస్‌స్టాంపు దాకా వచ్చి బస్సు ఎక్కించాడు. మాకు వీడ్కోలు చెబుతుంటే అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అమ్మా, నేనూ కూడా ఏడ్చాము.

బస్సు తిరువూరులో ఆగేసరికి మధ్యాహ్నం దాటింది. ఆకలితో పేగులు నకనకలాడిపోతున్నాయి. ఒక చిన్న హోటలులోకి వెళ్ళి వీరాస్వామి యిచ్చిన డబ్బుతో యిద్దరం కొంచెం తిన్నాం.

హోటల్లో అంతా మా వంకే చూస్తున్నారు. మా వంక అనటంకంటే అమ్మ వంక చూస్తున్నారనటం సబబు. హోటల్లోనే కాదు, బస్సులో, వీధుల్లో ఎక్కడ

పడితే అక్కడ జనం అమ్మవంక ఎందుకు అలా తినేసేటట్లు చూస్తారో, తలుచుకుంటూంటే నాకు అరికాలి మంట నెత్తికెక్కుతున్నది.

మా పెదనాన్నగారి పేరు వాసుదేవమూర్తిగారు. ఆయనకు బట్టలకొట్టుంది. అంతవరకే మాకు తెలుసు. ఆ వివరాలు చెప్పి ఓ గంటకుపైగా తిరిగి మొత్తానికి ఆయన యిల్లు కనుక్కున్నాం.

మేము వెళ్ళేసరికి ఆయన ఇంట్లో లేరు. పెద్ద పెంకుటిల్లు. పాతకాలం నాటిది. పెద్దమ్మ, పిల్లలూ వున్నారు.

ఆవిడ బయట కుర్చీలో లావుగా వ్యాపించి కూర్చుని సినిమాపత్రిక తిరగేస్తున్నది. పిల్లలు క్రిందపడి దొర్లుతూ అల్లరిచేస్తున్నారు.

"అమ్మా! ఎవరో వచ్చారే" అంది నా యీడుదే అయిన ఓ చింపిరిజుత్తు అమ్మాయి.

ఆవిడ పుస్తకంలోంచి తల ఎత్తి చూసింది. ఆవిడ ముఖం గుండ్రంగా చలిమిడిముద్దలా వుంది. కళ్ళు గాజు కళ్ళలా వున్నాయి.

"ఎవరు కావాలి?" అంది.

"వాసుదేవమూర్తిగారు" అమ్మ చిన్నగా అంది.

"బయటి కెళ్ళారు. ఏమిటిపని?"

"నేను... నేను . వారి మరదల్ని."

గాజు కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయాయి. కొంతసేపు పరీక్షగా మా ఇద్దర్నీ మార్చి మార్చి చూసింది.

"నువ్వే అన్నమాట ఆ మహా ఇల్లాలివి."

అమ్మ తలవంచుకుంది. నాకు వళ్ళు మండిపోతోంది.

"ఆస్తిలో వాటాకోసం, హక్కులకోసం వచ్చావా? ఇది ఆయన స్వార్జితం. ఇందులో మీకు దమ్మిడీ రాదు?"

"ఆస్తికోసం రాలేదు. బ్రతకటానికి వచ్చాను."

"ఇక్కడెలా బ్రతుకుతావు? మేమేం జమీందార్లంకాదు."

అమ్మ ఏం జవాబు చెప్పలేదు.

"సరే. అలా వుండండి. ఆయనొచ్చాక మాట్లాదురుగాని" లేచి లోపలకు వెళ్ళిపోయింది.

మాతోబాటు తెచ్చుకున్న చిన్న రేకుపెట్టె నేలమీదపెట్టి నిల్చుని నిల్చుని కాళ్ళు నొప్పిపుట్టగా అమ్మా, నేనూ బయట అరుగుమీద కూర్చున్నాం. పిల్లలు నలుగురు దాకా వున్నారు. వాళ్ళు లోపలకూ, బయటకూ గెంతుతూ మధ్యమధ్య మమ్మల్ని జూలో జంతువుల్ని చూసినట్లు చూస్తున్నారు.

ఏ పరిస్థితుల్ని మనం ఎక్కువగా ఏవగించుకుంటామో, ఎక్కువగా అలాంటి వాటినే మనం ఎదుర్కోవాల్సి వస్తూ వుంటుంది.

సాయంత్రానికి ఆయన వచ్చారు. బయట కూర్చున్న మమ్మల్ని చూడగానే కనుబొమలు పెద్దవయినాయి. అమ్మ లేచి నిల్చుని నమస్కారం పెట్టింది. అర్థమయిందన్నట్లు ఆయన మా వంక చూసి, తల ఊపి లోపలకు వెళ్ళిపోయాడు.

లోపల్నుంచి ఏవో మాటలు వినిపిస్తున్నాయి. ఆయనేదో చిన్నగా చెబుతున్నాడు. ఆవిడ గట్టిగా కేకలేస్తూ మాట్లాడుతోంది. మొత్తంమీద ఇద్దరూ ఘర్షణ పడుతున్నారు.

చాలసేపటికి ఆయన బయటకు వచ్చారు. ముఖం ఎర్రగా కందగడ్డలా వుంది.

"ఇలాంటి పరిస్థితి వస్తుందని నాకు తెలుసు. మిమ్మల్ని యీ ఇంట్లో పెట్టుకోవటం నా కిష్టంలేదు. అయినా మనుషులు కష్టాల్లో వుంటే చూడలేను. సరే— ఏం చేస్తాం? మీకు ఆ మూలగది ఇస్తున్నాను. అందులో వుండండి. మిగతా విషయాలన్నీ తర్వాత తెలుస్తాయి" అని లోపలకు వెళ్ళిపోయాడు.

అలా ప్రారంభమయింది అక్కడ మా జీవితం.

కృష్ణవేణమ్మగారు మా పెద్దమ్మగారి పేరు. ఆవిడకు దేముళ్ళమీద భక్తి మెండు. ఎప్పుడూ లావుపాటి తన శరీరానికీ, చలిమిడి సుద్దలాంటి ముఖానికీ పసుపు రాసుకుని తలంట్లు పోసుకుంటూ వుంటుంది. ఇంట్లో పూజామందిరం దగ్గర దేముళ్ళకి పూజలూ, పునస్కారాలు చేస్తూ వుంటుంది. దీపారాధనలూ, వ్రతాలూ చేయిస్తూ వుంటుంది. గుళ్ళలో అభిషేకాలూ, అర్చనలూ చేయిస్తూ వుంటుంది. తనంతటి భక్తురాలు ఆ ఊళ్ళో ఎవరూలేరని రోజుకు పదిసార్లన్నా ప్రగల్భాలు పలుకుతూ వుంటుంది.

క్రమంగా— ఆ భార్యాభర్తలిద్దరూ పడే ఘర్షణలనుబట్టి ఆయనకు పేకాటా, త్రాగుడూ అలవాటున్నాయనీ, ఆయన ఇంటికి ఆలశ్యంగా వచ్చినప్పుడు ఆవిడ గదితలుపులు కూడా తియ్యదనీ మాకు బోధపడింది. "కృష్ణవేణీ! కృష్ణవేణీ" అని కేకలు వేసివేసి, తలుపులు బాదిబాది అలసిపోయి వసారాలో ఏ బల్లమీదనో పడి నిద్రపోయేవాడు

ఆ ఇంట్లో మా అమ్మకు వంటలక్కకన్న ఏమీ స్థానంలేదని కొద్దిరోజుల్లోనే గ్రహించగలిగాము. మేము అక్కడకు రావటానికి కొన్నాళ్ళకుముందే ఆ ఇంట్లో పనిచేసే వంటమనిషి మానుకున్నదనీ, అందుకనే మాకంత సునాయాసంగా ప్రవేశం దొరికిందనీ గ్రహించటానికి కూడా ఎక్కువ రోజులు పట్టలేదు. తెల్లవారుఝామున అయిదింటినుంచీ అమ్మ పనుల్లో తలమున్కలు అవుతూ వుండేది. పొయ్యి అంటించటం, స్నానాలకు నీళ్ళు కాచటం, కాఫీలు పెట్టటం, ఫలహారాలు చెయ్యటం, అన్నాలు వండటం, వడ్డించటం. ఎంగిళ్ళు ఎత్తటం, మళ్ళా కాఫీ ఫలహారాలు, అన్నాలు, వడ్డనలు నాకు చేతనైనంత వరకు అమ్మకి సాయంచేస్తూ వుండేదాన్ని.

పేరుకి పెదనాన్నగారు నన్ను స్కూల్లో చేర్పించారేగాని, బడికిపోవటం సక్రమంగా ఎప్పుడూ సాగేదికాదు. పెద్దమ్మకు మరీ పెద్ద శరీరమేమో, అందులో ఏమూలలో ఒకమూల నిరంతరం ఏదో బాధ వుండేది. ఒకసారి నడుంనొప్పి, ఒకసారి తలనొప్పి, ఒకసారి కాళ్ళు పీకుడు—— నన్ను పిలిచి నడుం పట్టించుకోవటమో, కాళ్ళు పిసికించుకోవటమో చేస్తూ వుండేది. ఆసుపత్రి కెళ్ళి మందులు తీసుకురావాలి. లేకపోతే ఆవిడతో గుడికి తోడు వెళ్ళాలి. ఆవిడ శరీరంలో అన్నిభాగాలూ కదిలించుకుంటూ నడుస్తూ వుంటే పూజాద్రవ్యాలున్న బుట్టపట్టుకుని నేను వెనక నడుస్తూ వుండాలి. పూజలకూ తిండికీ మధ్యనుండే విరామ సమయాలు ఆవిడ సినిమా పత్రికలు చదవటంలో గడుపుతూ వుండేది. పూజ చేసేటప్పుడు తప్ప ఆవిడకు దేముడి విషయం గుర్తువచ్చేది కాదు. ఇంటికి ఎవరైనా వచ్చినప్పుడు మాత్రం సినిమా పుస్తకాలు దాచేసి "నేను భక్తురాలను. భక్తురాలను" అంటూ వుండేది. రేడియోలో కూడా ఎప్పుడూ సినిమా పాటలే వింటూ తన్మయురాలవుతూ వుండేది.

అమ్మతో ఆవిడ ఎప్పుడూ దయగాగాని, నిర్దయగాగాని మాట్లాడినట్లు గుర్తు లేదు. ఎంతవరకు అవసరమో అంతవరకూ మాట్లాడి, మిగతా విషయాల్లో అక్కడ ఓ మనిషి వున్నట్లే పట్టించుకునేది కాదు.

అమ్మ నిర్లిప్తంగా రోజులు వెళ్ళదీస్తోంది. నామీదే పంచప్రాణాలూ పెట్టుకుని, నేను బాగా చదివి పెద్దదాన్ని కావాలన్న ఆశతోనే ఆమె జీవిస్తున్నట్లు కనబడింది.

స్కూలుకి సరిగ్గా వెళ్ళకపోయినా, సాధ్యమైనంతవరకూ నేను బాగానే చదువుకునేదాన్ని. మొదట్నుంచీ నాకు క్లాసులో ఫస్టుమార్కులు వస్తూవుండేవి. ఆ 'అలవాటు' యిక్కడికి వచ్చినా పోలేదు. రాత్రుళ్లు కళ్ళలోకి నిద్ర ఎంత కూరుకువస్తున్నా ఒకటి రెండు గంటలు చదువుకుంటేగాని పడుకునేదాన్ని కాను. (సశేషం)

పెద్దన్నయ్య

మంచి చిత్రమన్నది చూసి ఎంచుకోమన్నా!...

సాంకేతిక పర్వం

పతాకం —పాంచజన్య

చిత్రదర్శకుడు —పి డి ప్రసాద్

పదసారధి —గోపి


ఫోటోగ్రఫీ —సుఖదేవ్

రాగాల కూర్పరి —సత్యం

నిర్మాణం —అప్పుదాస్

తారాతోరణం —జగ్గయ్య, రంగనాద్, రావుగోపాలరావు, ప్రభాకర రెడ్డి, చంద్రమోహన్, ప్రభ, సంగీత

హల్లో ఇది మీ హాల్లో 'లక్ష్మీ ఫిలింస్' విడుదల చేస్తున్నది





జీవితానికి అప్పులు జీవితంలో తప్పులు కోకొల్లలు అయిపోయి "అప్పో లక్ష్మణా!" అనడం అందరికీ అలవాటయిన ఈ కాలంలో "అప్పులు చెయ్యడం" పాపం అని భావించే ఓ వాసుదేవరావు ఉన్నాడు

ఆ వసుదేవుడు అవసరానికి గాడిద కాళ్ళు అయినా పట్టాడుగానీ ఈ వాసుదేవరావు జీవితంలో కళ్ళు తిరిగిపడిపోయే టప్పుడు గూడా అప్పుకి చెయ్యి పట్టడు

అరె! గమ్మత్తుగా ఉందే ఈ నయా వాసుదేవీయం ఇంతకీ ఎవరీ వాసుదేవరావు ఆయనకి అప్పులు చెయ్యడాలు చెయ్యి చాచడాలు ఎందుకో పనికి రావు అని ఈ పేజీల చదువ్రలావుకి పెద్ద అనుమానం ఇందులోని అప్పారావులకి అప్పులో అయినా ఆయన కథా కమామిషు తెలుసుకోవాలని ఆసక్తి కలగవచ్చు

కానీండి మీ ఇష్టప్రకారమే చేద్దాం —

అతి చిన్నవయసులో తను చెయ్యని నేరానికి తన తండ్రి తెలియక చేసిన నేరానికి బలి అయిగూడా పడిపోకుండా జీవితంతో పోరాడి ఎదిగి పైకి వచ్చిన వాడు వాసుదేవరావు

పదునారు కళలందు ఏ చిత్రకళవో!
ఏ శిల్పి కలలందు నెలకొన్న చెలివో!



వాసు బ్రతుకుతున్నది 'ప్రెస్' రాబడితో.

వాసుని బ్రతికిస్తున్నది 'లక్ష్మి' ప్రేమ. భర్తను మరపించే ఆమె ఆత్మీయత.

గోపి ఉమ వాసుకి ఉచ్ఛ్వాసనిశ్వాసలు తమ్ముడు చెల్లెలికి 'అన్న-వదిన' అమ్మ నాన్నగ నిలిచారని మహాభిమానం.

మమతే తప్ప మరోటి తెలీని ఇల్లు ఆ ఇల్లు. గోపి వర్క్ షాపులో ఉమ స్కూల్లో పని చేస్తున్నారు.

తమ్ముడు చెల్లికి ఏ లోటు రాకుండా వాళ్ళ దృష్టిని అంతస్థులు సుఖాల దారికి మళ్ళనివ్వకుండా తన విశ్వాసాల కను రెప్పలతో వాసు కాపాడుకుంటూ వస్తున్నాడు.

ఆత్మగౌరవంతో బ్రతకడం ఆ ఇంట అలికి ముగ్గు పెట్టడంలాంటిది. వ్యక్తిత్వాన్ని నిలుపుకోడం ఊపిరి పీల్చడం లాంటిది. అబద్దాలు ఆత్మవంచన ఆ పంచన కనబడవు.

'మెత్తని పులి ధర్మజుడు.... వాక్యం గుర్తు వస్తుంది వాసుదేవరావున చూస్తే. అప్సరసల సొంపు జ్ఞాపకం వస్తుంది ఉమ రూపం చూస్తే. అందుకే ఉమ రూపం చూసి అపురూపంగా ఫీల్ అయాడు శ్యామ్. రాఘవరావు అంతస్థు కొలవడానికి కొలబద్దలు లేవు. శ్యాం రాఘవరావు సుపుత్రుడు.

శ్యాం ఉమను తప్ప మరొకర్ని పెళ్లాడననడం, ఉమ శ్యామును తప్ప మరొకర్ని పెళ్లాడలేననడం విధి ఆడిన నాటకం గాదు, వర్తమాన యువతరం ప్రేమ పోకడల ఘాటుతనం మాత్రమే. డబ్బున్న శ్యాము కోసం తన చెల్లెలు అర్రులు చాచడం వాసుకి ఏమాత్రం ఇష్టం లేదు.


'పొరపాటు జరిగితే కొన్ని వస్తువులు మార్చుకునే అవకాశం ఉంటుంది. కానీ మనస్సు అనే వస్తువు ఒకసారి జారితే జీవితమే పతనమైపోతుంది ఉమా.'


'అన్నయ్యా.'

'నేను మరెందుకూ భయపడను ఉమా. నీ పెళ్ళి కోసం నేనేం అయినా చెయ్యగలనుగానీ అంతస్థుల తెరలు తొలిగించలేను' అని వాసుదేవరావు అన్నా లాభంలేకపోయింది.

రాఘవరావు తమ అంతస్థు చూసి ఉమను ఎరగా వాడినట్లు అంటే వాసు భరించలేకపోయాడు. ఫలితంగా ఉమ అన్నను ఎదిరించి అంతస్థు ఉన్న అత్త వారింటికి వెళ్ళిపోయింది.

రెండు ఇళ్ళమధ్య ఏ పవిత్ర సంబంధం ఏర్పడిందో అదే ఇనపగోడగా తయారయింది. ఉమకి ఒక వర్గం ఒక వాసం





ఒకేసారి విధి అనుగ్రహించింది

ప్రెస్ అకస్మాత్‌గా అగ్నిప్రమాదంలో భస్మం అవడం కూతురుకన్నా మిన్నగా ప్రేమించిన ఉమ అందర్నీ కాదని అంతస్థుల ఇంద్రధనస్సుకేసి వెళ్ళిపోడం వాళ్ళ ఇంటిని మనస్సుల్ని నలిపేసింది

అయినా అప్పుకోసం ఎవరి దగ్గరా వాసు నిలబడలేదు విచిత్ర పరిస్థితుల్లో ఎదురయిన ఆనందరావు వాసుకి ఆర్థికంగా సాయం చేయబోతే తిరస్కరిస్తాడు

పరులనుంచి అప్పు తీసుకోవడమే గాదు ఉచితసాయం అందుకోడం గూడా అవమానంగా ఫీల్ అయిన వాసును ఆనందరావు 'ప్రతి యుగంలో దేముడు ఒక్కొక్క రూపంలో అవతారం ధరిస్తే ఈ యుగంలో దేముడు కరెన్సీ అవతారం ఎత్తాడు' అని చెప్తాడు

దేముడు కరెన్సీలోనే ఉన్నా తన సిద్ధాంతాల్ని దానికి బలి ఇవ్వలేనన్నాడు వాసు

కాలప్రవాహానికి కరెన్సీ కెరటాలు తప్పని ఈనాడు వాటినుంచి వాసు ఎలా తప్పుకొని ఈదగలడో చూస్తానని ఆనంద రావు సవాల్ చేశాడు

ఆత్మగౌరవానికి జీవిత విలువలకి ఆధునిక యుగంలో అనుక్షణం జరుగు తున్న సవాల్‌కి సెల్యూలాయిడ్ మీద దర్శకుడు పి డి ప్రసాద్ పట్టిన అద్దానికి అందం అయిన పేరు 'పెద్దన్నయ్య

పెద్ద ఆదర్శాలున్న 'పెద్దన్నయ్య ప్రయోజనాత్మక చిత్రమే గాదు ప్రతి వ్యక్తి ఆదరణకీ అర్హం అయిన చిత్రం



నిజ జీవితంలో నిజాల్ని ఆత్మాభిమానుల జీవితాల్లోని తీపిచేదుల్ని తన కలం పసందుల్తో అడుగడుగునా రచయిత గోపి కలం చేసే విందులు కోకొల్లలు

ప్రయోజనం ప్రమాణంగా వాస్తవికత నడకగా కొత్తదనం సినీగమకంగా నడిపిన ఈ దర్శకుడి పూర్తి ప్రతిభకి శభాషుల్ని రేపు తెరమీద చిత్రం చూసి చెప్పాల్సినది మీరు।

దర్శకుడులేని సినిమాల కాలం అయిన ఈనాడు సరికొత్తగా వస్తున్న పెద్దన్నయ్య దర్శకత్వపు సినిమానే కాదు అందరూ దర్శనీయం అయిన సినిమా గూడా।

కాబట్టి 'మంచియన్నది పెంచుమన్నా' కి చిన్న జోడింపు చేస్తే ఎలా ఉంటుంది?—

'మంచి చిత్రమన్నది ఎంచుకోమన్నా' అంటా మీరంతా ఔననడానికి

పెద్దన్నయ్య న్యాయం!

'బంగారంలాంటి మీ మనసే నా స్వంతమైతే ఇంకా వేరే బంగారం ఎందుకండీ?'

'భగవంతుడు నాకు ఒక న్యాయం ఇంకో అన్యాయం చేశాడు లక్ష్మీ।

'అదేమిటండీ?

'పేదరికం అన్యాయమేగాదు, పెద్ద శిక్ష గూడా ఆ పేదరికంలో గూడా పెద్ద మనసున్న నిన్ను నా ఇల్లాల్ని చేశాడు దేముడు అదే ఆయన చేసిన న్యాయం

ఇది మనందరి బాధ్యత

ప్రజల ఆరోగ్య సంక్షేమం చూచే మహోన్నత బాధ్యత సమాజంలో అందరి మీదా వుంటుంది వ్యాధులపైన పౌష్టికాహారలోపం పైన నిరంతర పోరాటం అవసరం ఇన్ని సంవత్సరాలనుండి ముఖ్యంగా మన స్వాతంత్ర్యం లభించిన తర్వాత ప్రజారోగ్య రంగంలో అమోఘమైన ఫలితాలను సాధించారు

స్వాతంత్ర్యం లభించిన తొలిరోజులలో భారతీయుని సగటు ఆయుర్దాయం 27 సంవత్సరాలు ఈనాడు భారతదేశంలో జన్మించే ప్రతి శిశువుకు సగటున 50 సంవత్సరాల ఆయుఃప్రమాణం వుంటుందని అంచనా ఇదే వైద్య ఆరోగ్య కార్యక్రమాలలో మనం సాధించిన అపూర్వమైన అభివృద్ధికి కొలబద్ద

ప్రణాళికల కాలంలో మనం ప్రశంసనీయమైన కృషి చేశాం అఖిలభారత స్థాయిలోను, ఆంధ్రప్రదేశ్‌లో కూడా మొదటి మూడు పంచవర్ష ప్రణాళికలకాలంలో పటిష్టమైన ఆరోగ్య సేవలకు ప్రాతిపదిక ఏర్పరచారు నాలుగవ ప్రణాళిక ఆఖరు నాటికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పటిష్టం చేయడంద్వారా గ్రామీణ ఆరోగ్య సేవలకు గట్టి పునాదులు వేశారు

ప్రజలను కుటుంబనియంత్రణకు మరింత సుముఖం చేయడానికి వీలుగానూ వారికి తగిన సౌకర్యాలు కల్పించడానికి వీలుగానూ ఐదవ ప్రణాళికలో కుటుంబ నియంత్రణ శిశు ఆరోగ్యం పౌష్టిక ఆహార కార్యక్రమాలను సమీకరించడానికి ఉద్దేశించారు

గత రెండు దశాబ్దాలుగా ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఆరోగ్య సేవల విస్తరణ మరింత ముమ్మరంగా నూతనోత్సాహంతో కొనసాగింది 1957-58 లో 14 185 పడకలతో 693 ప్రభుత్వ వైద్య సంస్థలు ఉండగా అవి 1975-76 లో 22,917 పడకలతో 1423 సంస్థలకు పెరిగాయి ఇదే కాలంలో డాక్టర్ల సంఖ్య 129(నుండి 3724 కు పెరిగింది 1957-58 లో రు 1 24 లకు ఉన్న తలసరి సగటు వైద ఆరోగ్య ఖర్చులు రు 8 60 కి పెరిగింది

మశూచి నిర్మూలన కార్యక్రమం జాతీయ మలేరియా నిరోధక కార్యక్రమం జాతీయ బోదవ్యాధి నిరోధక కార్యక్రమాలను పటిష్టవంతంగా అమలు జరిపారు తత్ఫలితంగా యీనాడు రాష్ట్రానికి యీ భయంకరమైన వ్యాధుల నుండి విము లభించింది

నేడు కుటుంబనియంత్రణకు ఎంతో ప్రాముఖ్యత వుంది ఈ కార్యక్రమ ప్రారంభించినప్పటినుండి నేటివరకు మన రాష్ట్రంలో 20 లక్షల కుటుంబనియంత్ర శస్త్ర చికిత్సలను నిర్వహించారు ఈవిధంగా సంతాన యోగ్యులైన దాదాపు 19 శాత మందికి భద్రత కల్పించారు 1976-77 లో 6 లక్షల శస్త్ర చికిత్సలు నిర్వహించాల లక్ష్యం

డైరెక్టర్, సమాచార, పౌరసంబంధ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాద్

సినిమా

మిస్టర్ సంపత్ ఎం ఏ.

ఈ తరం మనిషి !

ఇంతకాలమూ మిమ్మల్ని ఉర్రూత లూగించిన సీరియల్ మిస్టర్ సంపత్ ఎం ఏ 'ఈ తరం మనిషి' పేరుతో తెర కెక్కింది అదే చిత్రం ఈ సంచిక ముఖ చిత్రాన్నీ అలంకరించింది వచ్చే సంచిక జ్యోతి విడుదలయేసరికి మీరా చిత్రం చూసేసో చూడబోతూనో ఉంటారు పల్లవీ ఆర్ట్ పిక్చర్స్ రంగుల్లో నిర్మించిన ఈ చిత్రం వి మధుసూదనరావు దర్శకత్వంలో రూపుదిద్దుకొంది ఎస్ వెంకట రత్నం, కె రవీంద్రనాధ్ నిర్మించిన ఈ చిత్రంలో ప్రధాన పాత్రలలో శోభన్‌బాబు, లక్ష్మి జయప్రద రావు గోపాలరావు, గుమ్మడి, పద్మనాభం గిరిబాబు రాజ్ బాబు, అల్లు రామలింగయ్య అంజలీదేవి, హలం మొదలయినవారు నటించారు

పండుగకు దండిగా

సంక్రాంతి తెలుగువారి పెద్ద పండుగ! ఆ పండుగ సందర్భంగా ప్రతి సంవత్సరమూ పెద్దపెద్ద చిత్రాలే విడుదలవుతాయి ఈసారి సంక్రాంతి కానుకలుగా జనవరిలో విడుదలవుతాయనుకొంటున్న చిత్రాల వివరాలు ఇవి

కురుక్షేత్రం

దాన-వీర-శూర-కర్ణ !

కురుక్షేత్రం సినిమాస్కోప్‌లో రంగుల్లో భారీ ఎత్తున తయారవుతోంది

'ఈ తరం మనిషి'లో శోభన్‌బాబు, అంజలీదేవి, జయప్రద





సత్యచిత్ర వారి సినిమాస్కోప్ వర్ణచిత్రం పాట రికార్డింగ్ సందర్భంగా తీసిన ఫొటో. కె. లింగమూర్తి (లక్ష్మి ఫిలింస్) సత్యనారాయణ (నిర్మాత), కె. వి. మహదేవన్ (సంగీత దర్శకుడు) సూర్యనారాయణ (నిర్మాత) కె. రాఘవేంద్రరావు (దర్శకుడు), వేటూరి సుందరరామమూర్తి (గీత రచయిత) చిత్రంలో ఉన్నారు.

కృష్ణుడిగా శోభన్‌బాబు, అర్జునుడిగా కృష్ణ నటించిన ఈ చిత్రంలో ఇతర పాత్ర లన్నిటిలోనూ ప్రసిద్ధులే నటిస్తున్నారు. (నటీనటుల వివరాలు జ్యోతి ఇదివరలో అందించింది.) కురుక్షేత్ర సంగ్రామ ఘట్టాలను అద్వితీయంగా చిత్రించే ప్రయత్నంలో ఈ చిత్రం యూనిట్ రాజస్థాన్ లోని జైపూర్‌వద్ద ఇరవై రోజులపాటు ఔట్‌డోర్ షూటింగ్‌లో గడిపింది. ఈ చిత్రానికి దర్శకులు కమలాకర కామేశ్వర రావు.

ప్రేక్షకులు అత్యంత ఆత్రుతతో ఎదురుచూస్తున్న మరో భారీ పౌరాణిక వర్ణచిత్రం పద్మశ్రీ ఎన్. టి. రామారావు నిర్మిస్తున్న దాన వీర శూర కర్ణ. ఎన్.టి. ఆర్. కృష్ణుడిగానూ, కర్ణుడిగానూ, దుర్యోధనుడిగానూ నటిస్తూ ప్రపంచ చరిత్రలోనే విశేషంగా చెప్పబడే విధంగా ఈ చిత్రానికి దర్శకత్వపు బాధ్యత కూడా నిర్వహిస్తున్నారు. రామారావు తనయులు హరికృష్ణ (అర్జునుడు), బాలకృష్ణ (అభిమన్యుడు) కూడా ఈ చిత్రంలో నటించడం మరో విశేషం. నిజానికిప్పుడు తెలుగు చలన చిత్రాభిమానుల్లో పై రెండు చిత్రాల గురించి అధికంగా చర్చించుకొంటున్నారు. ఎంతో ఆసక్తిగా ఆ చిత్రాల విడుదలకు ఎదురుచూస్తున్నారు కూడా!

చక్రధారి

భక్తిరసపూరితమైన పాత్రలు నటించడంలో పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరరావు ఎన్నోసార్లు తమ ప్రతిభ నిరూపించుకొన్నారు. ఇప్పుడు లక్ష్మి ఫిలిం కంబైన్స్ నిర్మించిన చక్రధారి, రంగుల చిత్రంద్వారా ఎ.ఎన్.ఆర్. తెలుగు ప్రేక్షకులకు తన

నటనా ప్రతిభను చూపించబోతున్నారు. వి. మధుసూధనరావు దర్శకత్వంలో కృష్ణవేణి సమర్పించే ఈ చిత్రంలో ఇంకా వాణిశ్రీ, జయప్రద, రమాప్రభ, సత్యనారాయణ, రాజ్ బాబు, మాధా, అల్లురామలింగయ్య, జయమాలిని, వెన్నిరాడై నిర్మల కూడా నటిస్తున్నారు.

క్రాంతికుమార్ 'కల్పన' !

నిర్మాత క్రాంతికుమార్, కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో నిర్మించిన 'కల్పన' చిత్రం విడుదలకు సిద్ధమౌతోంది. మురళీమోహన్, జయచిత్ర, గుమ్మడి, రావుగోపాలరావు, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, అల్లురామలింగయ్య మొదలైనవారు నటించారీ చిత్రంలో.

కె. విశ్వనాథ్ సిరి సిరి మువ్వ !

సంగీత, నృత్యప్రధానంగా దర్శకుడు విశ్వనాథ్ చేతిలో రూపుదిద్దుకొన్న సిరిసిరి మువ్వ విడుదలను సిద్ధంగా ఉంది. చంద్రమోహన్, సత్యనారాయణ, జయప్రద,

'ఈ తరం మనిషి'లో లక్ష్మి





'ప్రేమించి పెళ్ళి చేసుకో' జయచిత్ర

రమాప్రభ, దేవదాస్, కవిత మొదలైనవారు నటించిన ఈ చిత్రంలో కె. వి మహదేవన్ సంగీతం ప్రత్యేకాకర్షణగా ఉంటుంది. రంగుల చిత్రమిది.

మల్లెమాల ప్రేమ కథ !

నిర్మాత ఎం. ఎస్. రెడ్డి ఒక చక్కని ప్రేమ కథకు అతి చక్కని చిత్రరూపంగా రూపొందించిన 'ముత్యాల పల్లకి' వర్ణ చిత్రం తయారైంది. బి. వి. ప్రసాద్ దర్శకత్వంలో నారాయణరావు, జయసుధ, రోజారమణి మమత, జగ్గయ్య రాజ్



'చక్రధారి'లో నాగేశ్వరరావు, వాణిశ్రీ

బాబు, మాడా, రమాప్రభ మొదలైనవారు నటించారు మాటలు పాటలు 'మల్లెపూల' సమకూర్చారు

రామానాయుడు చిత్రాలు !

విజయా సురేష్ కంబైన్స్ పతాకం క్రింద నిర్మాత డి. రామానాయుడు నిర్మిస్తున్న వర్ణచిత్రం 'సావాసగాళ్ళు' కృష్ణ, జయచిత్ర, గిరిబాబు, ప్రభ, సత్యనారాయణ, గుమ్మడి, నాగేష్, అల్లురామలింగయ్య, రమాప్రభ మొదలైన నటీనటులతో తయారౌతోంది మరోవైపు 'సోగ్గాడు' చిత్రాన్ని హిందీలో జితేంద్ర కథానాయకుడిగా నిర్మిస్తున్నాడీ నిర్మాత అంతేకాదు ప్రముఖ హాస్యనటుడు నాగేష్ దర్శకత్వంలో 'మొంటోడు' పేరిట ఒక చిత్రాన్ని నిర్మించే సన్నాహాల్లో కూడా ఉన్నారు.

పి. ఏ పి చిత్రాలు !

తెలుగు చలనచిత్ర నిర్మాత సంస్థల్లో ఒక ప్రత్యేకమైన గౌరవం కలిగిన పి ఏ.పి సంస్థ నిర్మించిన 'అత్తవారిల్లు' తయారై విడుదలకు సిద్ధంగా ఉంది కె ప్రత్యగాత్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నరసింహరాజు, ప్రభ, కాకరాల, మోహన్‌బాబు, లక్ష్మీకాంత్, మమత, ఫణి, సునందిని, జి వరలక్ష్మి, జయఉష మొదలైనవారు నటించారు పి ఏ పి రజతోత్సవ చిత్రంగా నిర్మితమవుతున్న చిత్రం తాతినేని రామారావు దర్శకత్వంలో రూపుదిద్దుకొంటోంది ఈ చిత్రంలో అక్కినేని, వాణిశ్రీ ప్రధాన



'లంబాడోళ్ళ రాందాసు'లో జయలక్ష్మి, రావు గోపాలరావు


పాత్రలలో కన్పిస్తారు ఈ చిత్రాల నిర్మాత అనుమోలు వెంకటసుబ్బారావు

బంగారక్క'

రవిశంకర్ పిక్చర్స్ పతాకం క్రింద నిర్మాత సునీల్ చౌదరి నిర్మించే 'బంగారక్క చిత్రం తుది మెరుగులు దిద్దుకొంటూంది మురళీమోహన్ శ్రీదేవి ఈశ్వరరావు సత్యనారాయణ, రమాప్రభ అల్లురామలింగయ్య ఉషాభారతి శాంతి నటిస్తున్న ఈ చిత్రానికి కధ స్క్రీన్‌ప్లే మాటలు దర్శకత్వం దాసరి నారాయణ రావు చేపట్టారు

శ్రీధర్ దర్శకత్వం!

'పెళ్ళికానుక 'మనసేమందిరం వంటి ఎన్నో మంచి చిత్రాలు అందించిన దర్శకుడు శ్రీధర్ దర్శకత్వం వహిస్తున్న




ప్రపూర్ణ మూవీస్ వారి వర్ణచిత్రం ప్రారంభంలో క్లాప్ కొడుతున్న సురేష్ అధినేత డి రామానాయుడు



'ఒకనాటి కథ' లో విక్రమకుమార్, రోజారమణి

'కల్పన' లో మురళీమోహన్, జయచిత్ర





'ఒకే రక్తం'లో జయప్రద, కృష్ణంరాజు

చిత్రం "సీత గీతదాటితే" సి. పి. రెడ్డి. నిర్మించే ఈ చిత్రం ప్రముఖ నిర్మాత ఎ. పూర్ణచంద్రరావు నిర్వహణలో తయారవుతోంది. శ్రీధర్, చక్రపాణి, ప్రసాద్, కవిత, భవాని, వై. విజయ మొదలైన వారు నటిస్తున్నారీ చిత్రంలో.

శుభాంకురం!

'అంకుర్' 'నిశాంత్' చిత్రాలతో అంతర్జాతీయఖ్యాతి బడసిన శ్యామ్ బెనెగల్ దర్శకత్వంలో రవిరాజ్ ఇంటర్నేషనల్ సంస్థ ఒక తెలుగుచిత్రం నిర్మిస్తోంది. వాణిశ్రీ ప్రధానపాత్ర ధరిస్తున్న ఈ చిత్రంలో మిగతా నటీనటులు కొత్తవారిని ఎన్నుకొంటారు. ప్రముఖ దర్శకుడు, నటుడు గిరీష్ కర్నాడ్ స్క్రీన్‌ప్లే సమకూరుస్తున్న ఈ చిత్రానికి సంభాషలు. మహాకవి శ్రీశ్రీ రచిస్తున్నారు. నిర్మాతలు కేశవ జయరామ్, కె. వెంకటరామరెడ్డి.

తయారవుతున్న బంగారు బొమ్మలు

తొలుత నిర్మాతగా, తర్వాత దర్శకుడిగా తెలుగు ప్రేక్షకుల అభిమానం ఆదరణ విశేషంగా పొందిన జగపతి-సంస్థ అధినేత వి. బి. రాజేంద్రప్రసాద్. తమ నూతన చిత్రం ప్రారంభించారు. భారీ ఎత్తున రంగుల్లో నిర్మితమవుతున్న ఈ చిత్రం బంగారు బొమ్మలు. అక్కినేని నాగేశ్వరరావు, మంజుల ప్రధాన పాత్రలు ధరిస్తున్న ఈ చిత్రానికి కథ సమకూర్చి దర్శకత్వం నిర్వహిస్తూ నిర్మాణం సాగిస్తున్నారు. వి. బి. రాజేంద్రప్రసాద్.

-యస్వీనారాయణ

ధైర్య సాహసాలుగల

ఉత్సాహవంతులు ముందుకు రండి

ఆంధ్రప్రదేశ్‌లో గత ఇరవై సంవత్సరాలుగా పారిశ్రామికీకరణకు తీవ్రంగా కృషి జరిగిన ఫలితంగా ఈనాడు సత్వర పారిశ్రామిక అభివృద్ధికి అనువైన వాతావరణం ఏర్పడింది

కేంద్ర పబ్లిక్ రంగంలో భారతభారీ విద్యుత్పరికరాల పరిశ్రమ, భారతీయ ఔషధాల సంస్థ, హిందుస్థాన్ యంత్ర పరికరాల యూనిటు, భారత ఎలక్ట్రానిక్ కార్పొరేషన్, హిందూస్థాన్ విమానాల నిర్మాణ సంస్థ వంటి బ్రహ్మాండమైన పరిశ్రమలు, రాష్ట్ర పబ్లిక్ రంగంలో రిపబ్లిక్ ఫోర్జ్ కంపెనీ, ఇండోనిప్పన్ ప్రిసిషన్ బియరింగ్ సంస్థ దానికితోడు ప్రైవేటు రంగంలో అసంఖ్యాకమైన పరిశ్రమలు ఏర్పడడంతో అనేకమంది పారిశ్రామిక వేత్తలను హైదరాబాదు ఆకర్షిస్తున్నది


1956 లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత యీ 20 సంవత్సరాలలో గమనార్హమైన పారిశ్రామిక అభివృద్ధి సాధించబడింది 1956 ప్రారంభంలో కేవలం రు 63 కోట్ల పెట్టుబడితో మొత్తం 45 భారీ మధ్యతరహా పరిశ్రమలు మాత్రమే ఉండేవి అయితే యిటీవలి రెండు సంవత్సరాలలోనే రు 620 కోట్ల పెట్టుబడిగల భారీ, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు 150 పారిశ్రామిక లైసెన్సులు అందాయి తద్వారా 45,000 మందికి ఉపాధి లభిస్తుంది మన పారిశ్రామిక అభివృద్ధికి యిది శుభ సూచన

1971-72 లో ప్రారంభించిన స్వయం ఉపాధి పథకాన్ని విజయవంతంగా అమలు జరపడంలో ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో యితర రాష్ట్రాలకు అగ్రగామిగా ఉంది 1976 జులై ఆఖరు నాటికి 8996 యూనిట్లు ఈ పథకం క్రింద నెలకొల్పారు ఇందువల్ల 32,640 మందికి ప్రయోజనం కలిగింది

ఈనాడు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల రంగంలో ధైర్యసాహసాలుగల ఉత్సాహవంతులైన యువకులకు అపారమైన అవకాశాలను కల్పిస్తున్నది తగినంత మంది ఈ అవకాశాలను వినియోగించుకోడానికి ముందుకు వస్తున్నారు

డైరెక్టర్, సమాచార, పౌరసంబంధ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాదు.

Edited and Published by V Leelavathy Raghavaiah, 40/1, Moosa sait Street Madras-600 017 and Printed by D Hanumantha Rao, at Kranti Press, 12, Francis Joseph Street, Madras 600 001



పల్లవి ఆర్ట్ పిక్చర్స్
ఈతరం మనిషి
ఈస్ట్‌మన్ కలర్
LAKS

ఫిబ్రవరి '77

రు. 3

